'సోమశిల'కు త్వరలో కృష్ణమ్మ రాక

- పోతిరెడ్డిపాడుకు 10 వేల క్యూసెక్కులు విడుదల
- రెండువారాల్లో జిల్లాకు జలాలు



అనంతసాగరం జూలై 7 (ఆంధ్రజ్యోతి) : సోమశిల జలాశయాన్ని త్వరలోనే కృష్ణమ్మ పలకరించనుంది. ఎగువ జూరాల, సుంకేసుల నుంచి 1.85 లక్షల క్యూసెక్కుల ప్రవాహం డ్యాంకు వచ్చి చేరుతోంది. దీంతో శ్రీశైలం పూర్తి నిల్వ 215.80 టీఎంసీలకు గాను సోమవారానికి 190 టీఎంసీలకు చేరుకొన్నట్లు అధికారులు తెలిపారు. ఇక దిగువ పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్‌కు 10 వేల క్యూసెక్కుల నీటిని వదలడంతో ఆ జలాలు రాయలసీమ అవసరాలు తీరుస్తూ సోమశిల వైపు పరుగు తీస్తోంది. 10 నుంచి 15 రోజుల్లో కృష్ణమ్మ సోమశిలకు చేరే సూచనలు కనిపిస్తున్నాయి.

నీరు వదిలారు

శ్రీశైలం నుంచి పోతిరెడ్డిపాడుకు నీరు వదిలిన విషయం వాస్తవమే. ఆ నీరు సోమశిలకు చేరాలంటే కొంత సమయం పడుతుంది. రుతుపవనాల ద్వారా వర్షాలు కురిస్తే నేరుగా కుందు నుంచి సోమశిలకు వరద చేరే అవకాశం ఉంది.

- వెంకటరమణారెడ్డి
ఎస్ఈ, సోమశిల

● ఈసారి తొందరగానే ..

సహజంగా సోమశిల ప్రాజెక్టుకు ఆగస్టు మొదటి వారంలో కృష్ణా జలాల రాక ఉంటుంది. ఈసారి శ్రీశైలం డ్యాం తొందరగా నిండటంతో ఆదివారం పోతిరెడ్డిపాడుకు నీరు సరఫరా చేశారు. అక్కడ నుంచి నీరు ఇక్కడకు రావడానికి పది రోజులకుపైగా సమయం పడుతుంది. ఈ క్రమంలో జూలై 3వ వారంలో నీరు చేరే అవకాశం ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. సోమశిల పరిధిలో వచ్చే ఏడాది రెండు పంటలకు అవసరమైన నీరు నిల్వ చేసుకొనే వెసులుబాటుతోపాటు చిత్తూరు, చెన్నై ప్రాంతాలకు త్వరలో నీరు ఇచ్చే సౌలభ్యం కలగనుంది. కాగా, డ్యాంకు ప్రస్తుతం 190 క్యూసెక్కుల ప్రవాహం వస్తుండగా 29.710 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఉత్తర కాలువకు 425, దక్షిణ కాలువకు 400, పెన్నాడెల్టాకు 2,600 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

ఇక మ్యాజిక్ డ్రైన్!

● ప్రయోగాత్మకంగా కొమరికలో నిర్మాణం



ఎన్టీఆర్ జిల్లాలో ఏర్పాటు చేసిన మ్యాజిక్ డ్రైన్ ఇదే!

నెల్లూరు (జడ్పీ), జూలై 7 (ఆంధ్రజ్యోతి) : మురుగు కాలువల్లో ఎక్కడ నీరు అక్కడ ఇంకిపోయే విధంగా 'మ్యాజిక్ డ్రైన్' నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుటోంది. తక్కువ ఖర్చుతో భూగర్భ జలాలు పెరిగేలా ఇంకుడు గుంతల తరహాలో ఈ కాలువల నిర్మాణానికి శ్రీకారం చుడుతోంది. తొలుత ఎన్టీఆర్ జిల్లా నందిగామా మండలం సోమవరంలో ఈ డ్రైన్ నిర్మించగా విజయవంతమైంది. రాష్ట్రవ్యాప్తంగా ఒక్కో జిల్లాలో ఒక్కో కాలనీలో ప్రయోగాత్మకంగా డ్రైన్ నిర్మించాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఇందులో భాగంగా పైలెట్ ప్రాజెక్టుగా ఇందుకూరుపేట మండలం కొమరిక గ్రామంలో ఏర్పాటు చేయనున్నారు. ఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా డ్వామా ఆధ్వర్యంలో ఈ పనులు జరగనున్నాయి. తొలుత పొదలకూరులో రెండు గ్రామాలు, జలదంకిలో ఒకటి, ఇందుకూరుపేట మండలంలో కొమరికను అధికారులు పరిశీలించారు. చివరకు ఎక్కువ గృహాలు ఉన్న కొమరికను ఎన్ఆర్ఈజీఎస్‌ను ఎంపిక చేశారు.

● ఇంకుడు గుంతల్లాగా...

మ్యాజిక్ మురికి కాలువలను ఇంకుడుగుంతల తరహాలో నిర్మించనున్నారు. కాంక్రీట్ లేకుండా కాలువకు ఇటు, అటు వైపు నాపరాళ్లను ఏర్పాటుచేసి, కాలువ మధ్యలో రాళ్లు, గ్రావెల్ మాత్రమే వేసేలా రూపకల్పన చేశారు. ఇళ్లలో నుంచి వచ్చే మురికినీరు కాలువల్లో పారుదల లేకుండా భూమిలో ఇంకిపోతుంది. దీనిద్వారా భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉంటుంది. అంతేగాక కాంక్రీట్‌తో నిర్మించే కాలువ కన్నా ఈ డ్రైన్ ఖర్చు చాలా తక్కువ. అలాగే పైన నిలబడే చెత్తను తొలగించేందుకు ప్రత్యేక పరికరాలను అందుబాటులోకి తెస్తున్నారు. ఇది విజయవంతమైతే జిల్లావ్యాప్తంగా మ్యాజిక్ డ్రైన్లు ఏర్పాటు చేసే అవకాశం ఉంటుంది. కొమరికలో మ్యాజిక్ డ్రైన్ నిర్మాణానికి ప్రతిపాదనలను ఉన్నతాధికారులకు పంపినట్లు డ్వామా పీడీ గంగాభవాని తెలిపారు. స్థానికుల తోనే ఈ పనులను చేయించనున్నట్లు చెప్పారు.

ఇంజనీరింగ్ కౌన్సెలింగ్ ప్రారంభం

13 కళాశాలలు.. 12,804 సీట్లు ● ఆగస్టు 4న తరగతుల ప్రారంభం

నెల్లూరు (విద్య), జూలై 7 (ఆంధ్రజ్యోతి) : ఇంజనీరింగ్ కావాలనుకునే విద్యార్థుల కల నెరవేరడానికి తొలిమెట్టు ప్రక్రియ ఆరంభమైంది. ఈఏపీసెట్ ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ప్రక్రియ సోమవారం మొదలైంది. గతేడాది ఏ కళాశాలలో ఏ కేటగిరీకి ఎన్నో ర్యాంకు వరకు సీటు వచ్చింది అనే వివరాలు పరిశీలించుకుంటూ తామెక్కడ ఉన్నామో.. ఎక్కడ సీటు వస్తుందో అని విద్యార్థులు లెక్కలు వేసుకుంటున్నారు. మరోవైపు అధికశాతం మంది కంప్యూటర్ సైన్స్ కోర్సుపైనే ఆసక్తి చూపిస్తుండగా కోర్సు ముఖ్యమా, కళాశాల ముఖ్యమా అనే ప్రశ్న కూడా తల్లిదండ్రులు, విద్యార్థులను వెంటాడుతోంది. దీనికోసంగా కళాశాలలో వసతులు, విద్యా ప్రమాణాలు, ఫలితాలు, ఉద్యోగావకాశాల పరిస్థితులను అంచనా వేసుకుంటున్నారు.

● అందుబాటులో 12,804 సీట్లు

గతంలో 21 ఇంజనీరింగ్ కళాశాలలు ఉండగా వీటిలో 8 కాలేజీలు మూతపడ్డాయి. ఏఐసీటీఈ జాబితా ప్రకారం జిల్లాలో 13 ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలు ఉండగా, 12,804 సీట్లు అందుబాటులో ఉన్నాయి. గతేడాది అత్యధికంగా సీఎస్ఈ, ఈసీఈ సీట్లు భర్తీకాగా మెకానికల్, సివిల్ విభాగాలకు రెండో ప్రాధాన్యం ఇచ్చారు. చివరగా ఈఈఈలో కొంతమంది మాత్రమే ప్రవేశించారు. ఇంజనీరింగ్‌లో చేరాలనుకునే విద్యార్థులు సాఫ్ట్‌వేర్ ఉద్యోగమే లక్ష్యంగా తమకు వచ్చిన ర్యాంకులను బట్టి కళాశాల, గ్రూపుల ఎంపిక చేసుకోవాలని, బ్రాంచ్‌ల ఎంపికే కీలకం కానుందని మేధావులు చెపుతున్నారు.

● ఈఏపీసెట్ ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ప్రక్రియ

7 నుంచి 16వ తేదీ వరకు రిజిస్ట్రేషన్, ప్రాసెసింగ్ ఫీజులు చెల్లింపులు, 17వ తేదీ వరకు ఆన్‌లైన్‌లోనే ధ్రువపత్రాలు పరిశీలన ఉంటుంది. 13 నుంచి 18వ తేదీ వరకు కళాశాలలు, బ్రాంచ్‌ల ఎంపికకు వెబ్ ఆప్షన్‌ల ఎంపిక, 19న వెబ్ ఆప్షన్‌లు మార్చుకునే అవకాశం ఇచ్చారు. 22న కళాశాలలు, బ్రాంచ్‌ల సీట్ల కేటాయింపు జాబితా వెల్లడిస్తారు. సీట్లు దక్కించుకున్న విద్యార్థులు 23 నుంచి 26వ తేదీ వరకు సంబంధిత కళాశాలల్లో రిపోర్టు చేసుకోవాలి. ఆగస్టు 4న తరగతులు ప్రారంభం అవుతాయి.

అప్రమత్తంగా ఉండాలి

వెబ్ ఆప్షన్ల నమోదులో విద్యార్థులు జాగ్రత్తగా వ్యవహరించాలి. నచ్చిన కోర్సులు, కళాశాలలను ముందుగానే ప్రాధాన్యత క్రమంలో జాబితాను సిద్ధం చేసుకుని, దీని ఆధారంగా ఆప్షన్లను నమోదు చేయాలి. కళాశాలల షార్ట్‌ఫామ్‌ల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు ఫోన్ నెంబర్, బోధనా రుసుం ఆప్షన్, కులం తప్పుగా నమోదైతే మార్చుకునేందుకు మాత్రమే సంబంధిత ధ్రువపత్రాలతో వెంకటేశ్వరపురం ప్రభుత్వ బాలుర పాలిటెక్నిక్ కళాశాలలోని సహాయ కేంద్రాన్ని సంప్రదించాలి.

- డాక్టర్ ఎస్.రామారావు, జిల్లా సమన్వయకర్త



స్వర్ణాల చెరువులో తలమీద రొట్టె పెట్టుకుని స్నానం చేస్తున్న ముస్లిం యువతి



స్వర్ణాల చెరువులో భక్తుల సందడి



భక్తి సుగంధం!

- వైభవంగా గంధ మహోత్సవం
- పోటెత్తిన యాత్రికులు
- 4లక్షల మందికిపైగా భక్తుల రాక
- పటిష్ట బందోబస్తు
- నేడు రొట్టెల పండుగ

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 7 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులో జరిగే రొట్టెల పండుగలో ప్రధాన ఘట్టమైన గంధ మహోత్సవం సోమవారం అర్ధరాత్రి తర్వాత వైభవంగా జరిగింది. మతసామరస్యాన్ని ప్రతిబింబిస్తూ ఆధ్యాత్మిక శోభను వెదజల్లుతూ లక్షలాది మంది ఈ ఉత్సవంలో పాల్గొన్నారు. బారాషహీదులకు సమర్పించే పవిత్ర గంధాన్ని నగరంలోని కోటమిట్ట అమీయామియా మసీదులో సిద్ధం చేశారు. ఇస్లాం మత పెద్దలు దైవ ప్రార్థనలతో గంధం కలిపి 12 బిందెలకు ఎత్తారు. ఆ బిందెలను పూలతో అలంకరించి రథంపై ఉంచుకుని మేళతాళాలు, ఫకీర్ల జరబ్‌లతో కోటమిట్ట, ట్రైకస్‌రోడ్డు, పాత జడ్పీ కార్యాలయం, ఏసీ మార్కెట్, మాగుంట విగ్రహం, పోలీసు ఆఫీసు మీదుగా బారాషహీద్ దర్గాకు చేరుకున్నారు. అమరులైన బారాషహీద్‌ల సాహసాలను కీర్తిస్తూ ఫకీర్‌లు సాహస విన్యాసాలు ప్రదర్శించారు. ఈ దృశ్యాలను భక్తులు ఆసక్తిగా తిలకించారు. ఎస్పీ కృష్ణకాంత్ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. బిందెలలోని గంధాన్ని కడప పెద్ద మసీదు పీఠాధిపతి ఆరీఫుల్లాహుస్సేనీ, ఆయన శిష్యబృందం దైవప్రార్థనలు చేసి, బారా షహీద్‌ల సమాధులకు ఎక్కించి కొత్త గలేఫులు కప్పారు. అనంతరం భక్తులకు గంధాన్ని ప్రసాదంగా పంచారు. ఈ ఘట్టం ముగియడంతో రొట్టెల పండుగ స్వర్ణాల చెరువు తీరంలో అట్టహాసంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమం లో టీడీపీ నాయకుడు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి గిరిధర్‌రెడ్డి, ఇతర ప్రజా ప్రతినిధులు, నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

4 రొట్టెలకు డిమాండ్

రొట్టెల పండుగకు సోమవారం రెండవ రోజు భక్తులు పోటెత్తారు. సుమారు 4 లక్షల మంది తరలివచ్చినట్లు అంచనా. వరాల రొట్టెల కోసం స్వర్ణాల ఘాట్‌లో భక్తులు కిటకిటలాడారు. వివాహం, ఉద్యోగం రొట్టెలకు డిమాండ్ కనిపించింది. ఆరోగ్యం, సౌభాగ్యం, విద్య తదితర రొట్టెలను సైతం భక్తులు అధిక సంఖ్యలో పట్టుకున్నారు. బారాషహీద్‌ల సమాధుల దర్శనానికి బారులు దీరారు. సోమవారం అర్ధరాత్రి గంధ మహోత్సవం జరగనున్నందున సాయంత్రానికి యాత్రికుల సంఖ్య మరింత పెరిగింది. వివిధ జిల్లాలు, రాష్ట్రాల నుంచి తరలివచ్చే వారి వాహనాలతో నగర రోడ్లపై రద్దీ నెలకొంది. దీంతో భక్తులకు సేవలు అందిస్తున్న సిబ్బందిని ఆయా శాఖల అధికారులు అప్రమత్తం చేశారు.

● లోకేష్ కోసం ప్రత్యేక రొట్టె...

రొట్టెల పండుగకు హాజరైన మంత్రి లోకేష్ కోసం రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ ప్రత్యేకంగా భారీ రొట్టెను తయారు చేయించారు. సహచర మంత్రులు, ఎమ్మెల్యేలు, భక్తులతో లోకేష్ ఆరోగ్య రొట్టెను పట్టుకున్నారు. గంధమహోత్సవం సందర్భంగా భారీ స్థాయిలో అన్నదానం జరిగింది. స్వర్ణాల ఘాట్‌లో హోసూరుకు చెందిన భక్తుడు ఫిట్స్‌తో పడిపోతే అపోలో వైద్య శిబిరంలోని వైద్యులు స్పందించి సేవలు అందించారు.

● పోలీసుల తనిఖీలు...

బారాషహీద్ దర్గాకు తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి మహమ్మద్ ఫరూక్, దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఇతర ప్రజా ప్రతినిధులు తరలివస్తున్న సందర్భంగా పోలీసు శాఖ విస్తృత తనిఖీలు చేపట్టారు.

● జోరుగా బోట్ షికారు..

స్వర్ణాల చెరువులోని బోట్ క్లబ్‌లో పర్యాటకాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో బోట్ షికారు జోరుగా సాగుతోంది. భక్తులు భారీ సంఖ్యలో బోట్ క్లబ్ పరిసరాల్లో సేద తీరడమే కాక బోట్ షికార్ చేస్తున్నారు.



బారాషహీద్ దర్గాను దర్శించుకుంటున్న భక్తులు

చంద్రబాబు ఆరోగ్యంగా ఉండాలని..

● ఆరోగ్య రొట్టె స్వీకరించిన నారా లోకేష్

నెల్లూరురూరల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆరోగ్యం బాగుంటే రాష్ట్రం బాగుంటుందని రాష్ట్ర మంత్రి నారా లోకేష్ అన్నారు. బారాషహీద్ దర్గాలో జరుగుతున్న రొట్టెలపండుగలో జిల్లా మంత్రులు మహ్మద్ ఫరూక్ పొంగూరు నారాయణ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కలెక్టర్ ఆనంద్, రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి ఇతర నేతలతో కలిసి లోకేష్ పాల్గొన్నారు. దర్గాలో ప్రత్యేక ప్రార్థనల అనంతరం స్వర్ణాల చెరువు ఘాట్ వద్దకు చేరుకున్నారు. దిల్‌షాద్, గౌసియా అనే మహిళలు మంత్రి లోకేష్‌కు ఆరోగ్య రొట్టెను అందించారు. ఈ రొట్టెను తన తండ్రి, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు అందచేస్తానని తెలిపారు. అనంతరం ఘాట్ వద్ద మీడియాతో లోకేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా ఇబ్బందులను ఎదుర్కొంటున్నా ఈ పండుగ కోసం రూ. 10 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. రాష్ట్రంలో వీసీల నియామకం పారదర్శకంగా జరుగుతోందని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. 9,600 పాఠశాలలో ఒన్ క్లాస్, ఒన్ టీచర్ విధానాన్ని తీసుకువస్తున్నట్లు పేర్కొన్నారు. దర్గా ప్రాంగణంలో ఏర్పాట్లపై భక్తులు, మహిళలు, చిన్నారులతో లోకేష్ మాట్లాడారు. యాత్రికులు, రెడ్‌క్రాస్ సిబ్బంది, పారిశుధ్య కార్మికులతో సెల్ఫీలు తీసుకున్నారు. మంత్రి వెంట రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్‌అజీజ్, ఎస్పీ కృష్ణకాంత్, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, దర్గా ఉత్సవ కమిటీ చైర్మన్ ఖాదర్‌బాషా, టీడీపీ నేతలు గిరిధర్‌రెడ్డి, వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, తాళ్ళపాక అనురాధ తదితరులు ఉన్నారు.

వీఆర్‌స్కూలులో బాస్కెట్‌బాల్ ఆడుతున్న లోకేష్

సంబ్రమాశ్చర్యం!

- వీఆర్ స్కూల్‌లో విద్యార్థిలా మారిన లోకేష్
- అహం వద్దు.. కార్యకర్తలకు దిశా నిర్దేశం
- బారాషాహీద్ దర్గాలో భక్తిశ్రద్ధలతో పూజలు
- ఏర్పాట్లపై యాత్రికులతో ఆరా



నెల్లూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : ఒక్క రోజు పర్యటన నిమిత్తం నెల్లూరుకి వచ్చిన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సంబ్రమాశ్చర్యాలతో సోమవారం సాయంత్రం రాజధానికి పయనమయ్యారు. పీ-4 కింద అద్భుతంగా తయారైన వీఆర్ స్కూలును చూసి మురిసిన ఆయన కొంతసేపు విద్యార్థిగా మారిపోయారు. నెల్లూరు నగర నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో భవిష్యత్ కార్యాచరణపై కార్యకర్తలను కార్యోన్ముఖులను చేశారు. పరిణితి చెందిన నేతగా కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఎంపీ వేమిరెడ్డి నివాసంలో విద్యార్థులతో మాటామంతీ నిర్వహించారు. సాయం సంధ్యవేళ బారాషాహీద్ దర్గాలో ప్రార్థనలు చేశారు.

● పిల్లల్ని ఉత్సాహ పరుస్తూ..

ఉదయం 9 గంటల ప్రాంతంలో వీఆర్ స్కూలును మంత్రి లోకేష్ ప్రారంభించారు. మంత్రి నారాయణ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, పీ-4 పథకం కింద పాఠశాలను అభివృద్ధి చేసిన నాగార్జున కన్‌స్ట్రక్షన్స్ సంస్థ ప్రతినిధులు, నారాయణ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ప్రతినిధి షరణీలు వారి వెంట ఉన్నారు. తరగతి గదుల్లో డిజిటల్ బోర్డులు, విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన బెంచీలు, స్టడీ మెటీరియల్ చూసి సంతోషించారు. హైడ్రోపోనిక్ ల్యాబ్‌ను చూసి ఆశ్చర్యపోయారు. అధునాతన టెక్నాలజీతో సిద్ధం చేసిన క్రీడా మైదానాలు చూసి తను మంత్రిననే విషయాన్నే మరచిపోయారు. క్రికెట్ బ్యాట్ అందుకొని బ్యాటింగ్ చేశారు. వాలీబాల్ కోర్టులో బాల్ అందుకొని స్టయిల్‌గా సర్వీస్ చేశారు. లోకేష్‌తో ఆడేందుకు వెనుకాడుతున్న పిల్లలను చూసి ఆడండ్రా.. బాబు అంటూ వారిని ఉత్సాహపరిచారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులతో ముచ్చటించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఫరూక్, ఎంపీ వేమిరెడ్డి ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి నిజంగా ఈ స్కూలు ఓ అద్భుతమంటూ కితాబిచ్చారు. ఎంపీ వేమిరెడ్డి మాట్లాడుతూ తాను కూడా ఆర్ఎస్ఆర్ స్కూలును ఇదేవిధంగా అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు.



వీఆర్‌స్కూలు ప్రారంభం, ఆర్ఎస్ఆర్, బాలికల ఉన్నత పాఠశాలల్లో సౌకర్యాల కల్పనకు శిలాఫలకాలను ఆవిష్కరించిన మంత్రి లోకేష్, ఇతర మంత్రులు ఫరూక్, నారాయణ, ఎంపీ వేమిరెడ్డి తదితరులు

● వీఆర్ స్కూలుగానే కొనసాగాలి : ఆనం

దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ వీఆర్ స్కూల్ 50 ఏళ్లపాటు ఆనం కుటుంబీకుల ఏలుబడి కింద ఉండేదన్నారు. ఈ విద్యాసంస్థ అభివృద్ధికి తమ కుటుంబ పెద్దలు ఎంతో కృషి చేశారన్నారు. ఇన్నేళ్లలో ఏనాడు స్కూలు పేరు మార్చే ఆలోచన చేయలేదన్నారు. ఇప్పుడు వీఆర్ స్కూలు పేరును వీఆర్ మున్సిపల్ కార్పొరేషన్ స్కూలుగా పేరు మార్చడాన్ని ఆనం తప్పు పట్టారు. ఈ పేరును తొలగించి వీఆర్ స్కూలుగానే ఉంచాలని, ఇంతకు మునుపులా ప్రత్యేక పాలకవర్గం కింద కొనసాగించాలని కోరారు. నగరంలోని మరిన్ని మున్సిపల్ స్కూళ్లను పీ-4 పథకం కింద అభివృద్ధి చేయడానికి దాతలు ముందుకు రావాలన్నారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం ఈ పాఠశాలలను అధునాతనంగా తీర్చిదిద్దామన్నారు. ఈ పాఠశాల విద్యార్థులకు నారాయణ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ తరఫున ఉచిత బ్రేక్‌ఫాస్ట్, యూనిఫాం, పుస్తకాలు, ఉచిత రవాణా, ఆరవ తరగతి పైబడిన విద్యార్థులకు ఉచిత సైకిళ్లు అందజేయడానికి తన బిడ్డలు ముందుకు వచ్చారని, ఈ సహాయ సహకారాలు నిరంతరం కొనసాగుతాయని అన్నారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, దగుమాటి వెంకటకృష్ణారెడ్డి, కాకర్ల సురేష్, ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్‌చక్రవర్తి, కలెక్టర్ ఆనంద్, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్, సివిల్ సప్లయ్స్ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

● మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో నెల్లూరు సిటీ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తలతో అనిల్ గార్డెన్‌లో మంత్రి లోకేష్ సమావేశమై దిశానిర్దేశం చేశారు.

● సాయంత్రం నారా లోకేష్ రొట్టెల పండుగలో పాల్గొన్నారు. ఆరు గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి బయలుదేరి వెళ్లారు.

జూనియర్ కళాశాలలో మెగా రక్తదాన శిబిరం

పొదలకూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం సామాజిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. విద్యార్థినీ విద్యార్థులకు బ్లడ్ గ్రూప్, హిమోగ్లోబిన్ శాతాన్ని నమోదు చేసి, తగిన ఆరోగ్య సలహాలు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ నాహిద్, ఆరోగ్య సహాయకులు వెంకటేశ్వర్లు, కామాక్షమ్మ, అరుణ, మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్ పెంచలమ్మ, ప్రగతి, ఆశా కార్యకర్తలు, రమాదేవి, పెంచలనరసమ్మ, అధ్యాపకులు పాల్గొన్నారు.



బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9280
వెండి కిలో ధర	రూ. 110400
వెండి ఒక గ్రాము	రూ. 113.40

అన్నదాత.. సుఖీభవ నమోదు నిరంతర ప్రక్రియ

పొదలకూరు వ్యవసాయాధికారి వీ. ప్రతాప్



పొదలకూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి) అన్నదాత సు ఖీభవ, పీఎం కిసాన్ యోజన పథకాలకు సంబంధించి నమో దు ప్రక్రియ నిరంతరం జరుగుతుందని, వీటికి సంబంధించి ముగింపు చర్యలు లేవని మండల వ్యవసాయాధికారి వి. ప్రతాప్ అన్నారు.

? : 'అన్నదాత సుఖీభవ'కు ఇప్పటి వరకు ఎన్ని రికార్డులు వచ్చాయి

! : మండలంలో 8500 మంది రికార్డులు వచ్చాయి. ప్రభుత్వ భూములకు ఈ పథకాలు వర్తించవు. కౌలు, దేవాదాయ భూములకు సంబంధించి మార్గదర్శకాలు రావాల్సి ఉంది.

? : మండలంలో ఖరీఫ్‌కు సంబం ధించి వరి సాగు ఎలా ఉంది.

! : మండలంలో 3700 ఎకరాల్లో ఖరీఫ్‌కు సంబంధించి వరి సాగవుతోంది. పెన్నా పరీ వాహక ప్రాంతం సూరాయపాలెం, విరువూ రు, తాటిపర్తి, నల్లబాలెంతో పాటు డేగ పూడి, ఇనుకుర్తి, దుగ్గుంటలో వరి సాగవుతోంది.

? : కొన్ని చోట్ల యూరియా కొరత ఉంది. ఈ ప్రాంతంలో పరిస్థితి ఏంటి

! : మండలంలో ఇప్పటికే 200 మెట్రిక్ టన్నులు యూరియా అందజేశాం. మరో 60 మెట్రిక్ టన్నులు సిద్ధంగా ఉంది. మండలం లో యూరియా కొరత లేదు.

? : 'పొలం బడి' ఎలా సాగుతోంది

! : మంగళ, బుధవారాల్లో వ్యవ సాయ, అనుబంధ శాఖల సహాయంతో పొ లం బడి మండలంలో విజయవంతంగా సాగుతోంది.

? : ఇప్పటివరకు ఎన్ని మట్టి పరీక్షలు నిర్వహించారు. భూసారం ఎలా పెంచుకోవాలి.

! : 1080 శాంపిల్స్ సేకరించి పరీక్షలకు పంపాం. సహజంగా భూసారాన్ని పొలానికి చెరువు మట్టిని తోలి సారవంతం చేసుకోవ చ్చు. తద్వారా రసాయన ఎరువులు కూడా తగ్గించుకోవచ్చు.

అన్నా.. వెళ్తొస్తా.. మీ అభిమానానికి థ్యాంక్స్!



మనది యువశక్తి.. ఇలా ఉండాలి అంటున్న లోకేష్



పార్టీ శ్రేణులకు అభివాదం చేస్తున్న మంత్రి లోకేష్, పక్కన ఎమ్మెల్యే సోమిరెడ్డి

మనది యువశక్తి: నారా లోకేష్

మనుబోలు, వెంకటాచలం జూలై 7(ఆంధ్రజ్యోతి): అన్నా...అందరూ బాగున్నారా? మీ అభిమానానికి థ్యాంక్స్! అంటూ టీడీపీ జాతీయ కార్యదర్శి, రాష్ట్ర విద్యాశాఖ, ఐటీ మంత్రి నారా లోకేష్ టీడీపీ శ్రేణులను ఆప్యాయంగా పలకరించారు. దీంతో కార్యకర్తలు విజయ సంకేతం చూపడంతో.. 'అది బాబు గారిది.. మనది యువ శక్తి.. ఇలా ఉండాలి' అంటూ కుడిచేయి పిడికిలి బిగించి కార్యకర్తలకు చూపించారు. నెల్లూరు పర్యటన ముగించుకుని తిరుపతి తిరుగు ప్రయాణంలో మనుబోలు వద్ద లోకేష్ ఆగుతారని తెలియడంతో మనుబోలు, పొదలకూరు మండలాల నాయకులు, కార్యకర్తలు భారీగా సోమవారం మనుబోలు పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకున్నారు. లోకేష్ రాగానే కార్యకర్తలు జోష్‌తో నినాదాలు చేశారు. కార్యకర్తలు, నాయకులతో లోకేష్ కరచాలనం చేశారు. మనుబోలు, పొదలకూరు మండలాధ్యక్షులు పొన్నూరు రామకృష్ణయ్య, తలచీరు మస్తాన్ బాబు, ఏఎంసీ ఛైర్మన్ గాలి రామకృష్ణారెడ్డిలు బొకేలు అందించారు. ఎమ్మెల్యే తనయుడు, సర్వేపల్లి సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి లోకేష్‌కు నాయకులను పరిచయం చేశారు. కార్యకర్తల కోరిక మేరకు సెల్ఫీలు దిగారు. 'మనది యువశక్తి, ఇలానే ఉండాలన్నా.. వెళ్ళొస్తా' అంటూ అందరికీ నమస్కరించి అక్కడినుంచి లోకేశ్ బయలుదేరారు.

నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు, సీఐ శివరామకృష్ణారెడ్డి, ఎస్ఐ శివరాకేష్ బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేసీపీసీ ఛైర్మన్ వద్దినేని మస్తాన్‌నాయుడు, ఉపాధ్యక్షుడు మధునాయుడు, నాయకులుసాని వెంకటరమణయ్య, పచ్చిపాల రామి రెడ్డి, దండు చంద్రశేఖర్ రెడ్డి, రాయపాటి కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటాచలంలో లోకేష్‌కు ఘన స్వాగతం

వెంకటాచలంలోని సర్వేపల్లి క్రాస్ రోడ్డు వద్ద జాతీయ రహదారిపై సోమవారం సాయంత్రం రాష్ట్ర విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌కు సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, టీడీపీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. పార్టీ శ్రేణులు, ప్రజలు భారీగా తరలివచ్చారు. నెల్లూరు నుంచి రేణిగుంట విమానాశ్రయానికి రోడ్డు మార్గంలో వెళ్తున్న లోకేష్ కాన్వాయ్‌ని నిలిపి మరీ తమ అభిమానాన్ని చాటుకున్నారు. పార్టీ నేతలు లోకేష్‌కు పుష్పగుచ్ఛాన్ని అందించి శాలువాలతో సన్మానించారు. లోకేష్ నాయకత్వం వర్ధిల్లాలి.. అంటూ నినాదాలు చేశారు. కారులో నుంచి ఆ పార్టీ నేతలు, కార్యకర్తలకు అభివాదం చేస్తూ ఆప్యాయంగా పలకరించారు. భారీగా బాణసంచా కాల్చారు. కార్యక్రమంలో వెంకటాచలం, తోటపల్లి గూడూరు, ముత్తుకూరు మండలాల పార్టీ శ్రేణులు ఉన్నారు.

డీఆర్సీ ఉందా... లేదా ?



● సమావేశాలను మరిచిన అధికారులు, ప్రజాప్రతినిధులు
● వెంటనే నిర్వహించాలని సీఎం ఆదేశం

నెల్లూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా రివ్యూ కమిటీ(డీఆర్సీ) ఒకటి ఉందని, ప్రతి మూడు నెలలకు ఒకసారి దాన్ని సమావేశపరచాలన్న విషయాన్ని ఇటు అధికారులు, అటు ప్రజాప్రతినిధులు మరిచినట్లున్నారు. గత ఎనిమిది నెలల కాలంలో ఒక్క సమావేశం కూడా నిర్వహించలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలో ఒకే ఒకసారి (గత నవంబరులో) డీఆర్సీ సమావేశం నిర్వహించారు. ఆ సందర్భంగా అనేక అభివృద్ధి పనులు, వివిధ సమస్యలపై చర్చించారు. ఆ తర్వాత ఎవరికీ తీరికలేదన్నట్లు వ్యవహరిస్తూ డీఆర్సీని విస్మరించారు. జిల్లా అభివృద్ధికి సంబంధించి కీలక అంశాలపై చర్చించే ప్రధాన వేదిక డీఆర్సీ సమావేశం. ఇన్‌చార్జ్ మంత్రి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో ఇటు జిల్లా స్థాయి అధికారులతోపాటు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు సభ్యులుగా ఉంటారు. ఈ సమావేశంలో అన్ని శాఖలపై సమీక్ష జరుగుతుంది. ఆయా శాఖల్లో పురోగతి సాధించేందుకు కమిటీ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకుంటారు. అలానే క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను కూడా పరిష్కరించేందుకు చర్చిస్తారు. ఇక ఎమ్మెల్యేలు కూడా వారి నియోజకవర్గాల్లోని కీలక సమస్యలను కమిటీ దృష్టికి తీసుకొస్తారు. డీఆర్సీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను అవసరం మేరకు ప్రభుత్వానికి పంపుతారు. ఇన్‌చార్జ్ మంత్రి ఉంటారు కాబట్టి చాలా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు డీఆర్సీ ఒక మంచి వేదికగా ప్రజా ప్రతినిధులకు నిలుస్తుంది. ఇంతటి కీలకమైన రివ్యూ కమిటీ సమావేశాలు రెగ్యులర్‌గా జరగడం లేదు. సాధారణంగా ప్రతి మూడు నెలలకు ఒకసారి డీఆర్సీ సమావేశాలు నిర్వహిస్తూ ఆ మూడు నెలల కాలంలో జిల్లా ప్రగతిపై సమీక్షిస్తుంటారు. అప్పుడే మెరుగైన ఫలితాలు సాధించేందుకు అవకాశం ఏర్పడుతుంది.

చర్చించాల్సిన అంశాలు ఎన్నో..!

గతేడాది నవంబరు 3న చివరగా డీఆర్సీ సమావేశం జరిగింది. ఇన్‌చార్జ్ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డిలతోపాటు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, జిల్లాలోని అందరు ఎమ్మెల్యేలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రధాన శాఖలపై సుదీర్ఘంగా చర్చించారు. కీలక సమస్యలను ఎమ్మెల్యేలు ప్రస్తావించారు. ఆమంచర్ల వద్ద ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు సమస్య, ఇరిగేషన్‌లో ఓఅండ్ఎం పనుల్లో అవినీతిపై చర్చ జరగ్గా, వీటిపై దృష్టి పెట్టాలని కలెక్టర్‌కు ఇన్‌చార్జ్ మంత్రి ఆదేశాలు ఇచ్చారు. వెంటనే ఆమంచర్ల ఇండస్ట్రియల్ పార్కు సమస్య పరిష్కారం కాగా ఇరిగేషన్ శాఖలోని అవినీతిపై విచారణ మొదలవడం గమనార్హం. అదే విధంగా ప్రస్తుతం జిల్లా అభివృద్ధికి సంబంధించి చర్చించాల్సిన అంశాలు అనేకం ఉన్నాయి. సోమశిల ఆప్రాన్ పనులు, ఇరిగేషన్, రైల్వే ప్రాజెక్టులకు భూసేకరణ, సంగం, నెల్లూరు బ్యారేజీల నిర్వహణ, కొత్త కలెక్టరేట్ నిర్మాణం, నెల్లూరు నగరంలో అసంపూర్తిగా ఉన్న యూజీడీ పనులు, పంటల సాగు పరిస్థితులు, రోడ్లను బాగు చేయడం, పెండింగ్ బిల్లులు, కీలక ప్రాజెక్టులకు నిధులు సాధించడం... వంటి అనేక అంశాలు డీఆర్సీ సమావేశం కోసం ఎదురుచూస్తున్నాయి.

గిరిజన సమస్యలు పరిష్కరిస్తాం : ఎమ్మెల్యే సోమిరెడ్డి



ఎమ్మెల్యే సోమిరెడ్డిని కలిసిన గిరిజనులు

మనుబోలు, జూలై 7(ఆంధ్రజ్యోతి): గిరిజన సమస్యలను తప్పకుండా పరిష్కరిస్తామని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం మనుబోలులో ఎమ్మెల్యేని మనుబోలు నీటిసంఘం అధ్యక్షుడు పచ్చిపాల రామిరెడ్డి ఆధ్వర్యంలో చంద్రమౌళినగర్ గిరిజనులు కలిశారు. పెద్దచెరువులో చేపలు పట్టుకునే విషయంలో నెలకొన్న సమస్యలను గిరిజనులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. త్వరలోనే అధికారులతో చర్చించి, సమస్యను పరిష్కారిస్తామని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. రాయ పాటి కిరణ్, కలికి రమేష్‌రెడ్డి, చింతల వెంక టేశ్వర్లు, చెల్లగిరి ప్రసాద్, కలికి వినీల్‌రెడ్డి, పాశం నాగరాజు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలి

మాజీ ఎమ్మెల్యే ప్రసన్న కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న ప్రసన్నకుమార్ రెడ్డి

కోవూరు, జూలై 7(ఆంధ్రజ్యోతి): కోవూరు నియోజకవర్గ అభివృద్ధికి ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి కృషి చేయాల్సిందిగా మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి కోరారు. స్థానిక రుక్మిణీ కళ్యాణ మండపంలో సోమవారం జరిగిన వైసీపీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయ వైరాన్ని మాని అభివృద్ధికి కృషి చేయా లన్నారు. ఎన్నికల సమయంలో మాత్రమే పార్టీల గురించి ఆలోచించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి అనిల్ కుమార్‌యాదవ్, ఎమ్మెల్సీ చంద్రశేఖర రెడ్డి, వైసీపీ నాయకులు అనూప్‌రెడ్డి, శివుని నరసింహులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత వైద్య శిబిరం

రాపూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు ఎత్తు, బరువు, బ్లడ్ గ్రూపు, హిమోగ్లోబిన్ పర్సెంట్ పరీక్షలు నిర్వహించారు. ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ బి కృష్ణవేణి మాట్లాడుతూ విద్యార్థులు పౌష్టికాహారం తీసుకోవాలని, ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని సూచించారు. రాపూరు ప్రభుత్వ ఆరోగ్య సామాజిక కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జూహిషాన్ సిద్ధిఖీబాను, ఎన్ఎస్ఎస్ యూనిట్ అధికారి జి సాయికిరణ్, ఎంఎల్‌టీ అధ్యాపకులు పి మీనాకుమారి, పి రామలింగయ్య, అధ్యాపకులు, వైద్యసిబ్బంది, ఆశా సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీటీసీ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

విడవలూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): విడవలూరు బిట్ 1 ఎంపీటీసీ ఎన్నికలు త్వరలో జరగనున్నాయని, అధికారులు, బీఎల్‌వోలు సిద్ధంగా ఉండాలని తహసీల్దారు చంద్రశేఖర్, ఎంపీ డీవో నగేష్‌కుమారిలు తెలి పారు. ఎన్నికల ఓటర్ల జాబితాను తహసీల్దారు, విడవలూరు సచివాలయం, ఎంపీడీవో కార్యాలయంలోని నోటీసు బోర్డులో సోమవారం ప్రచు రించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విడవలూరు బిట్ 1 ఎంపీ టీసీగా ఉన్న భవానమ్మ మృతి చెందటంతో ఈ సెగ్మెంట్‌లో ఎన్నికలను నిర్వహించాలని ఎన్నికల సంఘం నిర్ణయించిందన్నారు. జాబితాలో తప్పులు, అభ్యంతరాలు ఉంటే తెలపాలని వారు తెలిపారు. ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి

సైదాపురం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ పలుగోటి పెంచలమ్మ అధ్యక్షతన సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మండలంలో అభివృద్ధి పనులపై శాఖల వారీగా అధికారులు వివరించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని ఎంపీపీ పెంచలమ్మ సూచించారు. అధికారులు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రవీంద్ర, తహసీల్దారు సుభద్ర, జడ్పీటీసీ పోలయ్య, మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు వీరాంజనేయుడికి పూజలు

పొదలకూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మారుతీనగర్ శ్రీఅభయాంజనేయ స్వామి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహిస్తారు. మంగళవారం కమ్మ జన సేవా సంఘం ఆధ్వర్యంలో స్వామికి సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్యనాయుడు పూజలు, అన్నదానం నిర్వహిస్తారు.

పారా అథ్లెట్ భవానీకి ఘన సన్మానం



భవానీని సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

ముత్తుకూరు, జూలై7 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ అథ్లెటిక్ మహిళల గ్రాండ్ ప్రీలో బంగారు పతకాలు సాధించిన భవానీని ముత్తుకూరు మండల టీడీపీ నేతలు సోమవారం రాత్రి ఘనంగా సన్మానించారు. స్థానిక ఆంజనేయ స్వామి దేవస్థానం వద్ద ఏర్పాటు చేసిన సన్మానసభలో మండల టీడీపీ అధ్యక్షులు నీలం మల్లికార్జున యాదవ్ సీనియర్ నేత ఈదూరు రామ్మోహన్ రెడ్డిలు మాట్లాడుతూ భవానీ అథ్లెటిక్ రంగంలో భారతదేశ ప్రతిభను ప్రపంచవ్యాప్తంగా చాటిందని కొనియాడారు. భవానీని మత్స్యకార కాపులు శాలువలు కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి మాచిరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నాయకులు అక్కయ్యగారి ఏడుకొండలు, బొలిగర్ల శ్రీనివాసులు, కోలంగారి రమణయ్య పాల్గొన్నారు.

లోకేష్‌ను కలిసేందుకు తరలివెళ్లిన టీడీపీ నేతలు



ముత్తుకూరు కూడలిలో టీడీపీ నేతల ర్యాలీ

ముత్తుకూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను కలిసేందుకు సోమవారం ముత్తుకూరు మండల టీడీపీ నేతలు తరలి వెళ్లారు. సీనియర్ టీడీపీ నేత ఈదూరు రామ్మోహన్‌రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షులు నీలం మల్లికార్జున్ యాదవ్ ఆధ్వర్యంలో ప్రధాన కూడలి నుండి కార్లు, బైక్‌లతో ర్యాలీ నిర్వహిం చారు. నెల్లూరులో పర్యటన ముగించుకుని తిరిగి వెళుతున్న లోకేష్‌ను వెంకటాచలం వద్ద కలిసి వీడ్కోలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి మాచిరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు బొలికర్ల శ్రీనివాసులు, నాయకులు దినకర్‌రెడ్డి, సుంకర శ్రీనివాసులు, అక్కయ్యగారి ఏడుకొండలు, గుంజి శ్రీనివాసులు, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మొహర్రం వేడుకలు

రాపూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలు, పట్టణంలో మొహర్రం వేడుకలు సోమవారం ఘనంగా ముగిశాయి. పెద్ద పీర్ల చావిడి, పోస్టాఫీస్ వీధి, అగర్తకోట, ప్రభుత్వ బాలికల పాఠశాల పక్కన ఉన్న చావిడి తదితర ప్రాంతాల్లో కొలువుదీరిన పీర్లను ఏటికి తరలిం చారు.

మంత్రి లోకేష్‌ను కలిసిన

వీఎస్‌యూ వీసీ, రిజిస్ట్రార్



మంత్రి లోకేష్‌ను కలిసిన వీసీ అల్లం శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ సునీత

వెంకటాచలం, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగరానికి విచ్చేసిన రాష్ట్ర విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌ను సోమ వారం వీఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు మర్యాదపూర్వకంగా కలిశారు. పలు విషయాలను చర్చించారు. వీసీ వెంట వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే. సునీత ఉన్నారు.


రావిప్రోలు సుబ్రహ్మణ్యం

సంతాప సభ

ఇందుకూరుపేట, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పల్లిపాడు పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో గాంధీ ఆశ్రమానికి సేవలందించిన రావిప్రోలు సుబ్రహ్మణ్యం సంతాపసభ సోమవారం జరిగింది. ప్రముఖ గాంధేయవాది, పల్లిపాడు గ్రామవాసి డాక్టర్ రావిప్రోలు సుబ్రహ్మణ్యం విశాఖపట్నంలో స్వర్గస్తులయ్యారు. పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమానికి కమిటీ మెంబర్‌గా, ఆహ్వాన కమిటీ ఛైర్మన్‌గా పనిచేశారు. ప్రముఖ గాంధేయవాదులు, ప్రముఖులను ఆశ్రమానికి ప్రతి సందర్భంలోనూ తీసుకొస్తుండేవారు. ఆశ్రమం అభివృద్ధి కోసం నిరంతరం ఆలోచించేవారన్నారు. ఆశ్రమ నిర్వాహకులు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమం కో కన్వీనర్ నెల్లూరు రవీంద్రరెడ్డి, కమిటీ సభ్యులు జీవీ రామిరెడ్డి, కందికట్టు రాజేశ్వరి, గంపల మంజుల, గంట విజయశ్రీ, షేక్ అల్లాబక్షు, రెడ్‌క్రాస్ మాజీ ఛైర్మన్ ఏవీ సుబ్రహ్మణ్యం, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను

జయప్రదం చేయండి



మాట్లాడుతున్న అంకయ్య

ముత్తుకూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మెలో కార్మిక వర్గం మొత్తం పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ కృష్ణపట్నం క్లస్టర్ అధ్యక్షులు గడ్డం అంకయ్య పిలుపునిచ్చారు. ముత్తుకూరులో సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం ఆటో జాతా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధ వారం ఉదయం 10 గంటలకు ముత్తుకూరు తహసీల్దారు కార్యాలయం నుండి ముత్తు కూరు బజార్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షులు విజయ్‌కుమార్, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

పేలిన గ్యాస్ సిలిండర్...

తప్పిన ప్రమాదం

మనుబోలు, జూలై 7(ఆంధ్రజ్యోతి): స్థానిక బీసీ కాలనీలో ఓ ఇంట్లో సోమవారం గ్యాస్ సిలిండర్ పేలింది. మీరావలి అద్దె ఇం ట్లో నివాసం ఉంటున్నాడు. వంట వండే క్రమంలో గ్యాస్ వెలిగించగానే పెద్దమంటలు రావడంతో అప్రమత్తంగా వ్యవహరించి సిలిండర్‌ను బయటతెచ్చి పడేశాడు. కొద్దిసేపు మండిన తరువాత భారీ శబ్దంతో పేలింది. దీంతో కాలనీవాసులు హడలిపోయారు.

గిరిజన కాలనీలో అన్నదానం

కోవూరు, జూలై7 (ఆంధ్రజ్యోతి): జనతా ఫౌండేషన్ సభ్యులు ఇనమడుగు గిరిజన కాలనీలో సోమవారం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షుడు దాసరి ప్రసాద్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు జనతా ఫౌండేషన్ కృషి చేస్తోందన్నారు. ఫౌండేషన్ సభ్యులు సేవా కార్యక్రమాల్లో భాగంగా అన్నదానం చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు నరేంద్ర, కోటేశ్వరరావు, మనోజ్, అనిల్, మురళి, సుమన్, మాల్యాద్రి, అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

కనిగిరి రిజర్వాయర్ వద్ద భక్తుల సందడి

చెట్ల నీడలో విందు భోజనాలు... వాగుల్లో జలకాలాటలు

బుచ్చిరెడ్డిపాళెం,జూలై7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి నెల్లూరులోని బారాషాహిద్ దర్గాకు రొట్టెల పండుగకు హాజరైన భక్తులు, పర్యాటకులతో బుచ్చిరెడ్డిపాళెంలోని కనిగిరి రిజర్వాయర్ పరిసరాల్లో సందడి నెలకొంది. కర్నాటక, కర్నూలు, కడప జిల్లాల నుంచి బుచ్చి మీదుగా వచ్చే భక్తులు ముందుగా ఏఎస్‌పేట దర్గా దర్శించుకుని బుచ్చిలోని కనిగిరి రిజర్వాయర్, జొన్నవాడలోని పెన్నానది, ఆ పరిసర ప్రాంతాలను సందర్శిస్తారు. తెలంగాణ, విజయవాడలమీదుగా వచ్చే భక్తులు, చెన్నై తదితర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు ఏఎస్‌పేటలో అహ్మదాబాదు దర్గా దర్శనానికి వెళ్తూ ముందుగా కనిగిరి రిజర్వాయర్‌ను సందర్శించి అక్కడే సేద తీరుతున్నారు. పిల్లలు, పెద్దలు విందుభోజనాలు చేసి రిజర్వాయర్ వద్ద కాలువలు, వాగుల్లో ఆనందోత్సాహాలతో స్నానాలు చేస్తున్నారు. ఏటా రొటెల పండుగకు వచ్చి నెల్లూరులో బారాషా హిద్ దర్గాను దర్శించి, నెల్లూరు చెరువులో రొట్టెలు వదిలి తరువాత ఏఎస్ పేటలోని అహ్మదాబాదు దర్గా, కసుమూరు దర్గా, వేనాడు దర్గాలను దర్శించుకుంటారు. ఇలా ప్రతి ఏటా మైపాడు, రామతీర్థం, కొత్తకోడూరు బీచ్‌లతోపాటు కనిగిరి రిజర్వాయర్‌ను సందర్శించి వెళ్తుంటామని పలువురు పర్యాటకులు ఆంధ్రజ్యోతితో తమ అనుభవాలు పంచుకున్నారు.





కనిగిరి రిజర్వాయర్ వద్ద వాగులో జలకాలాడుతున్న చిన్నారులు, రిజర్వాయర్ వద్ద వంటలు చేసుకుని తింటున్న రొట్టెల పండుగ భక్తులు

ప్రైవేటు బడుల్లో విద్యాహక్కు చట్టానికి

తిలోదకాలు

● పేద విద్యార్థులకు అందని ఉచిత విద్య



కొడవలూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : పేద విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత విద్య అందించడానికి ప్రవేశపెట్టిన నూతన విద్యాహక్కు చట్టం మండలంలో సక్రమంగా అమలు కావడంలేదు. పేద విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలల్లో 25శాతం సీట్లు ఉచితంగా కేటాయించాల్సి ఉంది. అయితే ఈ చట్టంపై విద్యాశాఖ అధికారులు సరైన ప్రచారం, అవగాహన కల్పించక పోవడంతో ప్రతి ఏటా ఉచితంగా ఇవ్వాల్సిన సీట్లు చాలా ప్రైవేటు పాఠశాలల్లో మిగిలిపోతున్నాయి. ఉచిత విద్య కోసం ముందుగా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని సమీప పాఠశాలలను ఎంచుకుని ప్రవేశం పొందాలి. విద్యాహక్కు చట్టం ద్వారా ఒకటో తరగతిలో ప్రవేశం పొందితే పదో తరగతి వరకు ఉచిత విద్యను పొందవచ్చు.

తల్లిదండ్రుల్లో అవగాహన లేక...

విద్యాహక్కు చట్టంపై పేద విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన లేకపోవడంతో ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు. ఉచిత సీట్ల కోసం పిల్లల పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకునేవారి సంఖ్య చాలా తక్కువగా ఉంటోంది. అధికారులు విద్యాహక్కు చట్టంపై విద్యార్థులకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించడంపై శ్రద్ధ చూపడం లేదు. దీంతో పేద విద్యార్థులకు ఉచిత విద్య మిథ్యగానే మిగులుతోంది. చాలామంది తల్లిదండ్రులకు ఇందుకోసం ఏ విధంగా దరఖాస్తు చేసుకోవాలో తెలియడం లేదు. దీంతో గత ఐదేళ్లగా ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత సీట్లు మిగిలిపోయాయి.

ముందుకు రాని ప్రైవేటు విద్యా సంస్థలు

మండల పరిధిలోని నార్తురాజుపాలెం, కొడవలూరు, తదితర గ్రామాల్లో సుమారు 18 ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. అయితే ఈ విద్యా సంస్థలు, ఉచిత సీట్లు ఇవ్వడానికి ముందుకు రావడం లేదని సమాచారం. విద్యాశాఖ అధికారులు చెబు తున్నా పెడచెవిన పెడుతున్నారని తెలు స్తోంది. విద్యాహక్కు చట్టం అమలు చేయని ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు. పాఠశాలలు ప్రారంభించి సుమారు నెలరోజులవుతోంది. ఈ నేపథ్యం లో విద్యా శాఖ అధికారులు ఈ చట్టంపై అవగాహన కల్పించి పేద విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత విద్య అందేలా చూడాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

రెండు కార్లు ఢీకొని వ్యక్తి మృతి



మృతిచెందిన వెంకటేశ్వర్లు (ఫైల్)

దుత్తలూరు (ఉదయగిరి రూరల్), జూలై 7 (ఆంధ్రజ్యోతి): రెండు కార్లు ఢీకొని ఓ వ్యక్తిపైకి దూసుకెళ్లడంతో అతను అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన మండలంలోని నందిపాడు సెంటర్‌లో 565 జాతీయ రహదారిపై సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నందిపాడు గ్రామానికి చెందిన నల్లబోతుల వెంకటేశ్వర్లు(54) ఉదయగిరికి వెళ్లేందుకు బస్సు కోసం రోడ్డు మార్జిన్‌లో వేచి ఉన్నాడు. ఈ తరుణంలో ప్రకాశం జిల్లా కనిగిరి నుంచి తిరుపతికి వెళుతున్న కారు నందిపాడు సెంటర్ వద్దకు రాగానే ఉదయగిరి నుంచి సంగంకు వెళుతున్న కారును ఢీకొట్టి రోడ్డుపక్కన ఉన్న వెంకటేశ్వర్లపైకి దూసుకెళ్లడంతో అతనికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. అనంతరం కారు రోడ్డుపక్కనే ఉన్న గృహాలపైకి దూసుకెళ్లింది. ఉదయగిరి ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి తన సిబ్బందితో ప్రమాద స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉదయగిరి తరలించి అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	125
స్కిన్ చికెన్	228
స్కిన్‌లెస్	250

కోడిగుడ్ల ధర (100): 570



విద్యార్థులతో లోకేష్ మాటామంతీ

నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి దంపతుల ఆహ్వానం మేరకు రాష్ట్ర మంత్రి నారా లోకేష్ సోమవారం వీపీఆర్ నివాసానికి వెళ్లారు. అక్కడ ఇందుకూరుపేట విద్యార్థులు, వీపీఆర్ కుటుంబ సభ్యులు లోకేష్‌బాబుకు గులాబీలతో స్వాగతం పలికారు. లోకేష్ విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. మీ పేరేమిటి, ఏ స్కూలులో చదువుతున్నారు తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. తల్లికి వందనం డబ్బు అందిందా..? అని అడగ్గా మా ఇంట్లో ఇద్దరికి వచ్చిందని, ముగ్గురికి వచ్చిందని పిల్లలు సమాధానం చెప్పడంతో లోకేష్ సంతోషం వ్యక్తం చేశారు. - నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)

రొట్టెల పండుగ న్యూస్

నో పార్కింగ్‌లో ఉంచితే పట్టుకెళ్తాం... !



రొట్టెల పండుగ సందర్భంగా నగరంలోకి భారీగా వాహనాలొచ్చాయి. దీంతో తీవ్ర ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. ప్రజలు, ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలను కఠినంగా అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా కొన్ని ప్రాంతాల్లో నో పార్కింగ్ బోర్డులు ఏర్పాటు చేశారు. అయినా కొందరు అక్కడే తమ వాహనాలను అలాంటి చోటే పెడుతున్నారు. అలాంటివాటిని ట్రాఫిక్ పోలీసులు రికవరీ వ్యాన్లతో తీసుకెళ్లి ఖాళీ స్థలాల్లో వదిలేస్తున్నారు.

- నెల్లూరు(సిటీ,ఆంధ్రజ్యోతి)

నిరంతరం ఘాట్ శుభ్రత



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూలై 7 (ఆంధ్రజ్యోతి): బారాషాహీద్ దర్గాలో జరుగుతున్న రొట్టెల పండుగకు రాష్ట్రంలోని జిల్లాలు, ఇతర రాష్ట్రాలు, దేశాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివస్తున్నారు. వారు స్వర్ణాల చెరువు ఘాట్ వద్ద రొట్టెలు మార్చుకుంటూ, కోరికలు తీరాలని ప్రార్థనలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఘాట్‌ను శుభ్రంగా ఉంచేలా అగ్నిమాపక సిబ్బంది నిరంతరం శ్రమిస్తున్నారు. మోటార్ల ద్వారా ఎప్పటికప్పుడు ఘాట్ ప్రాంగణాన్ని శుభ్రపరుస్తున్నారు.

తప్పిపోయిన చిన్నారులు తల్లిదండ్రులకు అప్పగింత

ఏఎస్ పేట, జూలై 7 (ఆంధ్రజ్యోతి): నగరంలో రొట్టెల పండుగ సందర్భంగా జిల్లాలోని ఏఎస్ పేట దర్గాకు వేలాదిగా భక్తులు తరలివస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం ఏఎస్‌పేటలో చిత్తూరుకు చెందిన రెండు సంవత్సరాల వయసున్న పాప, హైదరాబాదుకు చెందిన మూడేళ్ల బాబు, మహారాష్ట్రకు చెందిన రెండేళ్ల పాప తప్పిపోయారు. వారిని గుర్తించిన పోలీసులు దర్గాలోని పోలీస్ అవుట్‌పోస్టుకు తీసుకొచ్చి చిన్నారుల దుస్తులు, ఆనవాళ్లను మైక్‌లో తెలుపడంతో తల్లిదండ్రులు వచ్చారు. వారిని చిన్నారులను గుర్తించడంతో తల్లిదండ్రులకు అప్పగించారు.

అక్రమంగా మట్టి తవ్వకాలు

నెల్లూరు(రూరల్, జూలై 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని ములుమూడి చెరువులో అక్రమంగా మట్టి తవ్వకాలు జోరందుకున్నాయి. సోమవారం ఎక్స్‌కవేటర్ సాయంతో ట్రాక్టర్లను రంగంలోకి దింపిన వ్యక్తులు మట్టిని తవ్వేసి సమీప ప్రాంతంలోని లేఅవుట్ల యజమానులకు విక్రయించారు. పట్టపగలే ఈ దందాను మొదలుపెట్టిన అక్రమార్కులు పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా గమ్యానికి మట్టిని చేర్చారు. మార్గాన్ని ముందుగానే ఏర్పాటు చేసుకున్న సదరు వ్యక్తులు ఎవరికీ అనుమానం రాకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. లేఅవుట్లలోని ప్లాట్లను లెవలింగ్ చేసేందుకు మట్టి అవసరం. దీంతో చెరువులు, కాలువల వెంబడి సహజ వనరులను లక్ష్యంగా చేసుకుని మట్టిని తరలిస్తున్నారు. ఈ విషయమై ఇరిగేషన్ ఏఈ వాసుదేవరావును వివరణ కోరిన కొంత సేపటికే తవ్వకాలు ఆపేశారు.


కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రానికి మంచి భవిష్యత్

● రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరురూరల్, జూలై 7(ఆంధ్రజ్యోతి): రానున్న రోజుల్లో రాష్ట్రానికి మంచి భవిష్యత్ ఉండాలంటే కూటమి ప్రభుత్వమే అధికారంలో ఉండాలని రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి అన్నారు. సోమవారం 31వ డివిజన్ టైలర్స్ కాలనీలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికి వెళ్లి ఆయన కరపత్రాలను అందచేశారు. అనంతరం మాట్లాడుతూ గత ఏడాది కాలంలో రాష్ట్రానికి అనేక అభివృద్ధి పనులు వచ్చాయన్నారు. రానున్న నాలుగేళ్లలో మరింత అభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఎన్ని ఉన్నా ప్రతి నెలా ఒకటినే పెంచిన పింఛన్ అందచేస్తున్నామన్నారు. ఆగస్టు నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందుబాటులోకి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటరు, నాయకులు, క్లస్టర్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

మాటలతో మస్కా!

- సైబర్ నేరగాళ్ల ఉచ్చులో ప్రజలు
- షేర్ మార్కెట్ పేరుతో ఆశలు రేపుతూ..
- రూ. కోట్లు కాజేస్తున్న వైనం
- డిజిటల్ అరెస్టు పేరుతో నగదు కాజేసే యత్నం
- పోలీసులు అవగాహన కల్పిస్తున్నా మార్పేది ?



నెల్లూరు(క్రైం), జూలై 7 (ఆంధ్రజ్యోతి) : ఆన్‌లైన్‌లో నగదు పెట్టుబడిగా పెడితే అధిక ఆదాయం పొందవచ్చు... మేము షేర్ మార్కెట్‌కు సంబంధించిన సూచనలు, సలహాలు ఇస్తాము....మా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోండి.... తక్కువ సమయంలో సులువుగా ఎక్కువగా డబ్బులు సంపాదించవచ్చు.. అంటూ మాటలు చెబుతారు మాయగాళ్లు. మీపై ఢిల్లీలో కేసు నమోదు అయింది... మిమ్మల్ని హౌస్ అరెస్ట్ చేస్తున్నాం...మేము అడిగినంత నగదు ఇస్తే కేసు మాఫీ చేస్తాం.. అని కేటుగాళ్ల బెదిరింపులు...ఇలా చెప్పుకుంటూపోతే జిల్లాలో సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కుకొని రూ.కోట్లు పోగొట్టుకునే వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతూ ఉంది. ఓ పక్క పోలీసులు సైబర్ నేరాలపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నా ప్రజలు మాత్రం సైబర్ నేరగాళ్ల వలలో చిక్కి మోసపోతూనే ఉన్నారు.

ఇటీవల జరిగిన సైబర్ నేరాలు

- షేర్‌మార్కెట్‌లో అధిక ఆదాయం చూపిస్తామని ఓ వ్యక్తిని నమ్మించి రూ.30 లక్షలకుపైగా సైబర్ నేరగాళ్లు దోచేశారు.
- ఓ మహిళ ఇన్‌స్టాగ్రామ్‌లో ఆన్‌లైన్ మార్కెటింగ్‌లో నగదు పెడితే షేర్స్‌లో మంచి ఆదాయం వస్తుందని సైబర్ నేరగాళ్లు చెప్పిన మాటలు నమ్మి పలు దఫాలుగా రూ.2.46 కోట్లకు పైగా నగదు డిపాజిట్ చేసి మోసపోయింది.
- డిజిటల్ అరెస్ట్ ద్వారా జిల్లాలో ఓ వ్యక్తి రూ.7.8 కోట్లు పోగొట్టుకున్నారు. మరో వ్యక్తి రూ.98 లక్షలు పోగొట్టుకున్నారు.
- వాట్సాప్ చాట్ ద్వారా సైబర్ నేరగాళ్లు ఓ వ్యక్తి నుంచి రూ.1.96 కోట్లు కాజేశారు.
- పీఎం కిసాన్ పేరుతో ఏపీకే ఫైల్ ఫ్రాడ్స్ ద్వారా నగదు పోగొట్టుకున్నారు.
- ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్ ద్వారా రూ.10 లక్షల నగదును ఓ వ్యక్తి పోగొట్టుకున్నారు.

వెంటనే ఫిర్యాదు చేయాలి



సైబర్ నేరాలు, ఇతర ఆన్‌లైన్ మోసాల బారిన పడిన ప్రజలు వెంటనే రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన సైబర్ మిత్ర వాట్సాప్ నెంబరు 91212 11100, 1930, ఎన్‌సీఆర్‌పీ పోర్టల్ అయిన సైబర్‌క్రైమ్.జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌లకు సమాచారం తెలియజేయాలి. వెంటనే ఫిర్యాదు చేయడం ద్వారా సమస్య పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవచ్చు.సైబర్ నేరాల పట్ల ప్రజల అప్రమత్తంగా ఉండాలి.

- జీ కృష్ణకాంత్, ఎస్పీ

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- మీ బ్యాంకు ఖాతాను వేరేవాళ్లు ఆపరేట్ చేయడం లేదా కమీషన్ తీసుకొని మీ ఖాతాను రెంట్‌కి ఇవ్వడాన్ని మనీమ్యుల్స్ అంటారు. ఇలాంటివి చేయరాదు.
- సైబర్ నేరగాళ్లు నిరక్షరాస్యులని, నిరుద్యోగులను, ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నవారిని లక్ష్యంగా చేసుకొని వాళ్లకి డబ్బు ఆశ చూపించి వాళ్లతో బ్యాంకు ఖాతా తెరిపిస్తారు. ఆ ఖాతాను నేరం చేయడానికి ఉపయోగిస్తారు.
- సైబర్ నేరగాళ్లు ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకోమని చెప్పి ప్రజల వద్ద నుంచి డాక్యుమెంట్స్ సేకరిస్తారు. వాళ్లకి తెలియకుండానే బ్యాంకు ఖాతాను ఓపెన్ చేస్తారు. సైబర్ నేరాలలో నగదు పోగొట్టుకున్న వారు పెట్టిన కేసుల్లో అనేక కేసుల్లో అమాయకులు, ఖాతాను రెంట్‌కు ఇచ్చిన వాళ్లే ఇరుక్కుంటున్నారు. వాళ్ల అకౌంట్స్ ఫ్రీజ్ అవ్వడం, వారు అరెస్ట్ కావడం జరుగుతుంది.
- పార్ట్ టైమ్ జాబ్ అని చెప్పి మీ ఖాతాను వాడుకోవడానికి ఇవ్వాలని కోరడం, ఎక్కువ డబ్బులు ఇస్తామని ఎవరైనా సంప్రదిస్తే పోలీసులకు తెలియజేయాలి.
- మీకు తెలియని వారి నుంచి డబ్బులు స్వీకరించడం లేదా చెల్లింపులు చేయడం వంటివి చేయకూడదు.
- ఫ్రీ పెయిడ్ టాస్కుల ఫ్రాడ్, నకిలీ వెబ్ సైట్స్‌లో ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్, యూట్యూబ్‌లో వీడియోలకు లైక్స్, రివ్యూల ద్వారా అధిక నగదు సంపాదించవచ్చని, ఫ్లైట్ టికెట్స్ బుక్ చేస్తే అధిక నగదు సంపాదించవచ్చని, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ ద్వారా అపరిచిత వ్యక్తులు స్నేహితులుగా మారి ఫారెన్ నుంచి గిఫ్ట్ పంపుతామంటే నమ్మకూడదు.
- ప్రజలకు అనుమానిత నెంబర్స్ నుంచి వచ్చే మెసేజ్‌లను ఎట్టి పరిస్థితుల్లో స్పందించకూడదు.
- ప్రజలు వ్యక్తిగత వివరాలను అనవసరంగా అనామకులకు, తెలియని వ్యక్తులకు ఇవ్వడం మంచిది కాదు.
- వ్యక్తిగత వివరాలను సోషల్ మీడియాలో గోప్యంగా ఉంచాలి, ప్రొఫైల్ లాక్ పెట్టుకోవాలి.
- సైబర్ నేరం జరిగిందని తెలిసిన వెంటనే సైబర్ క్రైమ్ కంప్లైంట్ గోల్డెన్ అవర్స్‌లో ఫిర్యాదు చేస్తే మోసపోయిన వారి అమౌంట్ రీఫండ్ అయ్యే చాన్స్ ఎక్కువగా ఉంది.

విన్నపాలు వినవలె!

మంత్రి లోకేష్‌కు వినతుల వెల్లువ

ఒక్కరోజు పర్యటనకు నెల్లూరుకి వచ్చిన ఐటీ, విద్యాశాఖామంత్రి నారా లోకేష్‌ను సోమవారం వివిధ సమస్యలపై పలువురు కలిసి వినతిపత్రాలు అందచేశారు. ఆయా సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు.

● డిజిటల్ లైబ్రరీగా మార్చండి

నెల్లూరు(హరనాథపురం); జూలై 7 (ఆంధ్ర జ్యోతి): మంత్రి నారా లోకేష్‌ను సోమవారం ఎంపీ వేమిరెడ్డి నివాసంలో నగరంలోని జాషు వా గ్రంథాలయ కమిటీ సభ్యులు కలిశారు. జా షువా గ్రంథాలయాన్ని డిజిటల్ లైబ్రరీగా మా ర్చి, ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీ4 విధానాన్ని అమలు చేయాలని కోరారు. గ్రంథాలయం ద్వారా పేద విద్యార్థులకు కంప్యూటర్ సైన్సు కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇప్పించాలని కోరారు. లోకేష్ స్పందిస్తూ త్వరలో ఈ విషయమై నిర్ణయం తీసు కుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ కమిటీ అధ్యక్షుడు షేక్ ఖాసీం, ఆర్గనైజింగ్ కార్యదర్శి కొమ్మల కృష్ణయ్య, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు ఏవీ సుబ్బారావు, జనార్దన్, గంధం అంకయ్య తదితరులు పాల్గొన్నారు

● విద్యారంగ సమస్యలు పరిష్కరించండి

నెల్లూరు(విద్య), జూలై 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ నేతలు లోకేష్‌కు విజ్ఞప్తి చేశారు. నగరంలోని అనిల్‌గార్డెన్స్ వద్ద సోమవారం ఏఐఎస్ఎఫ్ నేతలు ఆయనకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్య దర్శి మస్తాన్‌షరీఫ్ మాట్లాడుతూ నగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళా శాల లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయడంతోపాటు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తరగతి గదులు పెంచాలన్నారు.హాస్టళ్లలో వార్డెన్లను పూర్తిస్థాయిలో నియమించడంతోపాటు జీవో నెంబర్ 77ను రద్దు చేయాలని కోరారు. మంత్రి స్పందిస్తూ అన్ని సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి శివం, తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో మల్లయుద్ధం

నెల్లూరు (సాంస్కృతికం) జూలై 7 (ఆంధ్రజ్యోతి): నగరంలోని శ్రీకృష్ణధర్మరాజులస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం హోమం, పూజలు, చప్పర ఉత్సవం నిర్వహించారు. అనంతరం భగవద్గీత పారాయణం జరిగింది. సాయంత్రం పూలంగిసేవ, మహాభారతం ప్రవచనం, మల్లయుద్ధం అలంకరణ జరిగాయి. మల్ల యుద్ధ అలంకరణ భక్తులను ఆకట్టుకుంది. నిర్వహిం చిన సాంస్కృతిక ప్రదర్శనలు కూడా అలరించాయి.



అభివృద్ధి కమిటీ సభ్యులకు సన్మానం



నెల్లూరు(హరనాథపురం), జూలై 7(ఆంధ్రజ్యోతి): జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీలో సభ్యులుగా ఎంపికైన మారెళ్ల గురుప్రసాద్, పోట్లూరి శ్రీనివాసులును గిరిజన సంఘాల ప్రతినిధులు సోమవారం నగరరంలోని జయభారత్ ఆసుపత్రి సమావేశ మందిరంలో సన్మానించారు. గిరిజన సంఘాల ప్రతినిధులు చచ్చాల్ ప్రసాద్, దాసరి శరవణ, ఏండోటి సురేంద్ర, ఇండ్ల సురేంద్ర తదితరులు వారిని శాలువాలతో సత్కరించి, పూలమొక్కలు అందచేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గురుప్రసాద్, శ్రీనివాసులు గిరిజనులకు ఉచితవైద్యంతోపాటు, ఉచిత నేత్ర, వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. గిరిజన బాలబాలికలకు బాల సంస్కార్ కేంద్రాల ద్వారా విద్యాదానం అందిస్తున్నారని కొనియాడారు.

10న కరేడుకు సీపీఐ నేత రామకృష్ణ రాక

కందుకూరు, జూలై 7(ఆంధ్రజ్యోతి): సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ఈనెల 10వ తేదీన ఉలవపాడు మండలం కరేడుకు రానున్నట్లు ఆపార్టీ నాయకులు తెలిపారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో సోమవారం ఆపార్టీ రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీ.హనుమారెడ్డి, నెల్లూరు జిల్లా సహా యకార్యదర్శి పీ.మాలకొండయ్య తదితరు లు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఇండోసోల్ కంపెనీ కోసం కరేడులో భూసేకరణకు జరుగుతున్న ప్రయత్నాన్ని రైతులు ముక్తకంఠంతో వ్యతిరేకిస్తూ పోరుబాట పట్టిన నేపథ్యంలో రైతులకు మద్ధతుగా వారితో ముఖాముఖి నిర్వహించి వారి సమస్యలు తెలుసుకునేందుకు రామకృష్ణ వస్తున్నట్లు తెలిపారు.

స్వర నిలయంలో అపస్వరాలు

- అధ్వానంగా ప్రభుత్వం సంగీత, నృత్య పాఠశాల
- మరమ్మతులకు నోచని వాయిద్య పరికరాలు
- 50 ఏళ్లుగా అద్దె భవనంలో నిర్వహణ
- ఆపై ఉపాధ్యాయుల కొరత



నెల్లూరు (సాంస్కృతికం), జూలై 7 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ప్రభుత్వ సంగీత పాఠశాల్లో సుస్వరాలు పలకడంలేదు. అక్కడ అపస్వరాలే వినిపిస్తున్నాయి. పాఠశాలను ఏర్పాటు చేసి 50 ఏళ్లు అయినా అద్దె భవనంలోనే నడుస్తున్నది. పలు వాయిద్య పరికరాలు మరమ్మతులకు నోచక మూలకు చేరాయి. ఉపాధ్యాయుల కొరత వెంటాడుతూనే ఉంది.

ప్రభుత్వ సంగీత పాఠశాలను 1974లో ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని కోట గ్రామంలో అప్పటి మంత్రి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి కుటుంబీకులు స్థాపించి నిర్వహించారు. సీఎం నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి హయాంలో మాజీ గవర్నర్ బెజవాడ గోపాలరెడ్డి కోరిక మేరకు 1991లో ఈ పాఠశాలను నెల్లూరుకి మార్చారు. నగరంలోని పలుచోట్ల అద్దె భవనాల్లోనే ఈ పాఠశాల నడుస్తూ వస్తున్నది. ప్రస్తుతం డాక్టర్ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ప్రభుత్వ సంగీత పాఠశాలగా రూపాంతరం చెంది రోటరీక్లబ్ పక్కనున్న భవనంలో నిర్వహిస్తున్నారు. ఈ భవనానికి నెలకు అద్దె రూ.1,13,532లను రాష్ట్ర సృజనాత్మక, సంస్కృతి సమితి చెల్లిస్తోంది. నగరంలో ప్రభుత్వ భవనాలు ఎన్నో ఉన్నప్పటికీ సంగీత పాఠశాలను ప్రైవేటు భవంతిలో నిర్వహిస్తూ ఏటా రూ.13లక్షలకుపైగా ప్రజా ధనాన్ని అద్దె రూపంలో చెల్లిస్తుండటం గమనార్హం.



ప్రభుత్వ సంగీత పాఠశాలలో పనిచేయని వాద్య పరికరాలు

● కోర్సులివే..

ఈ పాఠశాలలో గాత్రం (కర్ణాటక సంగీతం), వయోలిన్, భరతనాట్యం, మృదంగం, వీణ వాయిద్యాలతో 4 ఏళ్ల సర్టిఫికెట్ కోర్సు, రెండేళ్ల డిప్లమో కోర్సులు ఉన్నాయి. ప్రతీ ఏటా 300 నుంచి 350 మంది ఈ కళల్ని నేర్చుకుంటున్నారు. ప్రిన్సిపాళ్లుగా కోమాండూరు శేషాద్రి, అన్నాజీరావు, అరుణ అసఫ్‌అలీ, రంగనాయకమ్మ, దుడ్డు సీతారామయ్య, మునికుమార్, మద్దెల సాయిబాబా వంటి వారు పనిచేశారు. ప్రస్తుతం సీ జ్యోతిర్మయి పనిచేస్తున్నారు.

● ఎదుగూబొదుగూ లేక...

జిల్లాలో ఎంతోమంది కళాకారులు, కళాభిమానులు ఉన్నారు. అయినా 50 ఏళ్లుగా ఈ పాఠశాల ఎదుగూబొదుగూ లేకుండా కొనసాగుతోంది. అరకొర వసతులతో ఇక్కడ కళలను కష్టపడి నేర్చుకున్న కళాకారులు విశ్వవ్యాప్తంగా స్థిరపడ్డారు. పలువురు ప్రభుత్వ ఉద్యోగాల్లో రాణిస్తున్నారు.సొంత భవనం కావాలని జిల్లా ప్రజలు కొన్నేళ్లుగా డిమాండ్ చేస్తున్నారు.

● స్థలం కేటాయించినా...

ఈ పాఠశాలకు జానకి కలెక్టర్‌గా ఉన్న సమయంలో కస్తూర్బా కళాక్షేత్రంలో 3సెంట్ల స్థలం కేటాయించారు. అందులో భవన నిర్మాణాలకు ప్లాను, ఎస్టిమేట్‌లు ప్రభుత్వానికి పంపారు. ఆమె తర్వాత వచ్చిన కలెక్టర్ కళాక్షేత్రాన్ని 99 సంవత్సరాల లీజుకు ప్రైవేటు సంస్థకు ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. ప్రజా ఆందోళనతో అది రద్దు అయింది. కానీ ప్రభుత్వ సంగీత పాఠశాల నిర్మాణం మాత్రం జరగలేదు.

● మోగని వాయిద్య పరికరాలు

ఉపాధ్యాయులు కొరత కారణంగా పలు వాయిద్య పరికరాలు మరమ్మతులకు నోచుకోక మూలపడ్డాయి. వీణలు, మృదంగాలు, వయోలిన్‌లు శృతి బాక్స్ తదితర వాయిద్య పరికరాలు ఉన్నాయి. ఈ పరికరాలకు మరమ్మతులు చేయించాలంటే ఒక్కొక్కదానికి రూ.10వేలు ఖర్చవుతుంది. మరమ్మతులకు కోసం ప్రతీ ఏటా ప్రతిపాదనలు పంపుతున్నా నిధులు విడుదల కాకపోతుండటంతో అవి వినియోగంలోకి రావడం లేదు.

సొంత భవనం కావాలి..

రాష్ట్రంలోని అన్నీ ప్రభుత్వ సంగీత పాఠశాలల కన్నా నెల్లూరు సంగీత పాఠశాలకు గుర్తింపు ఉంది.



ఈ పాఠశాలకు సొంత భవనం లేకపోవడం లోపంగా ఉంది. నగరం నడిబొడ్డులో ప్రభుత్వం స్థలం కేటాయించి సొంత భవనం నిర్మిస్తే ఎంతో మంది కళాకారులను తీర్చిదిద్ద వచ్చు.

- సీ.జ్యోతిర్మయి, ప్రిన్సిపాల్

ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలి

జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు దృష్టి సారించి ప్రభుత్వ సంగీత పాఠశాలకు సొంత భవనం నిర్మించి అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పేరు 10 కాలాలు నిలబడాలంటే సొంత భవనం కొత్త కోర్సులు ఉండాలి.



- మద్దెల సాయిబాబా, విశ్రాంత ప్రిన్సిపాల్

పూర్వ వైభవం తీసుకురావాలి..

ఈ పాఠశాలలో గాత్రం డిప్లమో చేశా. అప్పట్లో అన్నీ సబ్జెక్టులకు ఉపాధ్యాయులతో బాగుండేది. వీణ టీచరు మాదేశ్వరకుమార్ చనిపోయిన తర్వాత వీణలన్నీ మూలపడ్డాయి. ఇటీవల నేను, నా ఫ్రెండ్ పాఠశాలకు వెళ్లాం. వీణలన్నీ మూలపడ్డాయని తెలిసి బాధపడ్డాం.



- వేదాంతం హర్షవర్ధిని, పూర్వ విద్యార్థిని

గంధోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు



దర్గా ప్రాంగణంలో బందోబస్తును పరిశీలిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

● డ్రోన్ కెమెరాల నిఘా నీడలో దర్గా : ఎస్పీ

నెల్లూరు(క్రైం), జూలై 7 (ఆంధ్రజ్యోతి): రొట్టెల పండుగలో ప్రధాన ఘట్టమైన గంధ మహోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు చేశామని ఎస్పీ జీ. కృష్ణకాంత్ తెలిపారు. దర్గా ప్రాంగణంలో ఆయన సోమవారం బందోబస్తును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డ్రోన్ కెమెరాల నిఘా నీడలో బారాషాహీద్ దర్గా ప్రాంగణం, పరిసరాలు ఉన్నాయన్నారు. దర్గాలో ఏర్పాటు చేసిన తాత్కాలిక కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానంగా చేసిన డ్రోన్, పీటీజెడ్, సీసీటీవీ ఫుటేజ్‌లను నిరంతరం పరిశీలిస్తూ బందోబస్తులో ఉన్న సిబ్బందికి సూచనలు ఇస్తున్నామని తెలిపారు. రెండోరోజు 31 మంది తప్పిపోయిన చిన్నారులను తల్లిదండ్రుల వద్దకు చేర్చామని, డాగ్‌స్క్వాడ్, బీడీ టీమ్‌లతో నిరంతరం తనిఖీలు చేస్తున్నామన్నారు. సుమారు 3500 యాత్రికుల వాహనాలను ఎలాంటి ట్రాఫిక్ సమస్య లేకుండా పార్కింగ్ చేసుకునేట్లు చర్యలు చేపట్టామని ఎస్పీ వివరించారు.

సంతానం రొట్టె వదిలాం



కొన్నేళ్లుగా రొట్టెల పండుగకు వస్తున్నాం. గత ఏడాది సంతానం కలగాలని నా భార్య రొట్టె పట్టుకుంది. సంతానం కలగడంతో ఈ ఏడాది సంతానం రొట్టె విడిచి పెట్టాం. గతంతో పోల్చుకుంటే రొట్టెల పండుగలో ఏర్పాట్లు అద్భుతంగా ఉన్నాయి.

- జీ రవి, తిరుపతి

పదేళ్లుగా వస్తున్నాం



పదేళ్లుగా కుటుంబమంతా రొట్టెల పండుగకు వస్తున్నాం. మనసులో బలంగా కోర్కెలు కోరుకుని స్వర్ణాల చెరువులో రొట్టెలు పట్టుకుంటే మా కోర్కెలు నెరవేరుతున్నాయి. గత ఏడాది మేము కోరుకున్న కోరిక నెరవేరడంతో ఈ ఏడాది అందరం మళ్లీ వచ్చాం.

- ముజాహిద్, హైదరాబాద్

వ్యాపార రొట్టె పట్టుకున్నా..



నెల్లూరులో జరిగే రొట్టెల పండుగ గురించి బంధువులు ఎంతో గొప్పగా చెప్పడం విన్నా. అందుకే ఈ ఏడాది వారితో కలిసి వచ్చా. ఇక్కడకు వచ్చిన తర్వాత వేలాది మంది భక్తుల నమ్మకం చూశాక రొట్టెల పండుగకు ఉన్న ప్రాధాన్యత అర్థమైంది.

- వశీమ్, నాగపూర్

ఆర్థికంగా స్థిరపడాలని కోరుకున్నా...



రొట్టెల పండుగ గురించి ఎన్నోఏళ్లుగా చుట్టుపక్కల వారు, బంధువులు చెబుతుంటే వింటున్నా. కొంతకాలంగా మా కుటుంబాన్ని ఆర్థిక ఇబ్బందులు వెంటాడుతున్నాయి. అప్పులు తీసుకున్న వారు తిరిగి ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. ఈ క్రమంలో రొట్టెల పండుగకు వెళ్లమని కొందరు సూచించడంతో వచ్చాం. మా ఆర్థిక ఇబ్బందులు తీరాలని రొట్టె పట్టుకున్నా.

- రామలక్ష్మమ్మ, కడప

హలో.. హలో.. నో సిగ్నల్స్ !

● దర్గా ప్రాంగణంలో సెల్‌ఫోన్లు పనిచేయక భక్తుల ఇక్కట్లు



హలో... హలో... ఎక్కడున్నారు....? ప్చ్.. నో.. సిగ్నల్స్... ఈ సమస్య బారా షహీద్ దర్గా వద్ద జరుగుతున్న రొట్టెల పండుగకు వచ్చిన ప్రతి భక్తుడిని వెంటాడుతోంది. రొట్టెల పండుగలో పాల్గొనేందుకు భక్తులు భారీ సంఖ్యలో వచ్చారు.సెల్ టవర్ల సామర్థ్యం సరిపోకపోవడంతో ఫోన్లకు సిగ్నల్స్ రావడంలేదు. దీంతో ఫోన్లు మాట్లాడుకోలేక, వాట్సాప్‌ల ద్వారా సందేశాలు పంపుకోలేక భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పండుగ పూర్తయ్యే వరకు సెల్‌టవర్ల సామర్థ్యం పెంచాలని భక్తులు కోరుతున్నారు.

- నెల్లూరు(సిటీ,ఆంధ్రజ్యోతి)



కసుమూరులో భక్తుల రద్దీ

వెంకటాచలం, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు బారాషాహీద్ దర్గాలో జరుగుతున్న రొట్టెల పండుగ సందర్భంగా దక్షిణ భారతదేశంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కసుమూరు మస్తాన్ వలి దర్గా సోమవారం భక్తులతో కిక్కిరిసిపోతోంది. వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు వేలాదిగా తరలిరావడంతో సోమవారం భక్తుల సంఖ్య గణనీయంగా పెరిగింది. దీంతో గ్రామంలోని ప్రధాన మార్గం రద్దీగా మారింది. భక్తులు మస్తాన్ వలీ దర్గాను దర్శించుకుని ప్రార్థనలు చేశారు. మొక్కులు తీర్చుకుని స్వామికి తలనీలాలు సమర్పించారు. అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. భక్తులు దర్గా ఆవరణతో పాటు చందన్ మహల్, కొండపై దర్గాల వద్ద, చెట్ల కింద సేద తీరారు. షాఫాబావి వద్ద పుణ్యస్నానాలు ఆచరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కసుమూరు ప్రభుత్వ ఆరోగ్య శాఖ అధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆర్టీసీ సంస్థ నెల్లూరు నుంచి కసుమూరు వరకు నడుపుతున్న ప్రత్యేక బస్సులను సోమవారం కూడా కొనసాగించారు. వక్ఫ్ బోర్డు అధికారులు పలుచోట్ల తాగునీటి చల్లివేంద్రాలు, షామియాలు, తదితర మౌలిక వసతులు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ సమస్య ఏర్పడకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు.



భూసమస్యలను ప్రత్యేక శ్రద్ధతో పరిష్కరించాలి

జాయింట్ కలెక్టర్ కార్తీక్

కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌కి 127 వినతులు

నెల్లూరు(హరనాథపురం), జూలై 7(ఆంధ్ర జ్యోతి): భూ సమస్యలను ప్రత్యేకశ్రద్ధతో పరిష్కరించాలని జేసీ కే కార్తీక్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కనభవన్‌లో పీజీఆర్ఎస్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జేసీ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి, వాటిని క్షుణ్ణంగా పరిశీలించారు. సంబంధిత అధికారులను పిలిచి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం జేసీ మాట్లాడుతూ వివిధ సమస్యలపై ప్రజలు అందించిన అర్జీలను వెంటనే పరిష్కరించేందుకు ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. భూస మస్యలు, ఇతర రెవెన్యూ సమస్యలపై అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని, వాటిని పరిష్కరించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. నిర్దిష్ట గడువులోగా అర్జీలను పరిష్కరించాలని, ఒకవేళ పరిష్కరించలేకపోతే ఎందుకు పరిష్కరించలేదో అర్జీదారులకు వివరించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి 127 వినతులు అందగా, వాటిలో 120 రెవెన్యూ శాఖకు సంబంధించినవి ఉన్నాయి.

● ఇసుక మాఫియాపై చర్యలు తీసుకోవాలి



కలెక్టరేట్‌లో మాట్లాడుతున్న దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు మల్లి

చేజర్ల మండలం మడపల్లికి చెందిన వసంతమ్మ భూమిని ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని దళిత సంఘర్షణ సమితి నాయకులు సోమవారం జేసీకి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి మాట్లాడుతూ 20 ఏళ్ల నుంచి సాగు చేసుకుంటున్న వసంతమ్మ భూమిని ఇసుక మాఫియా ధ్వంసం చేసిందని ఆరోపించారు. ఆ మాఫియాపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిల్లర మస్తానయ్య, లింగంగుంట శ్రీనివాసులు, కోవూరు దాసు తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ పీజీఆర్ఎస్‌కి 47 ఫిర్యాదులు

నెల్లూరు(క్రైం), జూలై 7 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం జరిగిన ఎస్పీ పీజీఆర్ఎస్‌కి జిల్లా వ్యాప్తంగా 47 మంది తరలివచ్చి ఫిర్యాదులు అందించారు. కావలి డీఎస్పీ శ్రీధర్, డీటీసీ సీఐ నాగేశ్వరమ్మ, ఎస్‌బీ సీఐ శ్రీనివాసరెడ్డి బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం డీఎస్పీ శ్రీధర్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్ ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించి పరిష్కరించాలని పోలీసులను ఆదేశించారు.



ఫిర్యాదును పరిశీలిస్తున్న కావలి డీఎస్పీ శ్రీధర్

చంపేస్తామంటున్నారు.. కాపాడండి !

నెల్లూరు (లీగల్), జూలై 7 (ఆంధ్రజ్యోతి) : పొలం విషయమై గొడవపడి కొంతమంది తనను చంపేస్తామని బెదిరిస్తున్నారని, తనకు రక్షణ కల్పించాలని నగరంలోని బాలాజీనగర్ పరిధి పద్మావతి నగర్‌కి చెందిన అయితా సురేష్ ఎస్పీని కోరారు. సోమవారం జరిగిన పోలీసు పీజీఆర్ఎస్‌లో వినతిపత్రం ఇచ్చారు. బాధితుడి కథనం మేరకు... గత నెల 19న దగదర్తి మండలం దామవరంలోని తన తండ్రికి చెందిన పొలంలో రెవెన్యూ అధికారులు విమానాశ్రయం కోసం సర్వే చేస్తున్నారని తెలిసి తాను అక్కడికి వెళ్లానన్నారు. అక్కడ కొండ్రగుంట శ్రీనివాసులు, రామస్వామి ఇరవైమంది మనుషులను తీసుకువచ్చి పొలం విషయమై గొడవపడి, చంపివేస్తామని బెదిరించారని పేర్కొన్నారు. ఈ విషయమై అదే రోజు దగదర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని చెప్పారు. అయితే వారు ఎలాంటి చర్య తీసుకోలేదని, తమపై రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయని చెప్పారని తెలిపారు. బాధితుడి ఫిర్యాదును కావలి రూరల్ సర్కిల్‌కి పంపుతూ ఎస్పీ కార్యాలయం ఉత్తర్వు చేసింది.

ఎక్కడివారు అక్కడే!

● బదిలీల రద్దుపై సచివాలయ ఏఎన్ఎంల ఆందోళన ● మూడురోజులపాటు అధికారుల కౌన్సెలింగ్

● అవకతవకలు జరిగాయని ఆరోపణలు ● మరోసారి నిర్వహణకు కమిషనర్ ఆదేశం

నెల్లూరు (వైద్యం) జూలై 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సచివాలయాల ఏఎన్ఎంల బదిలీలను రద్దు చేస్తూ వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ వీరపాండియన్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం కలెక్టర్ ఆనంద్‌ను కలిశారు. తమకు న్యాయం చేయాలని కోరారు. కలెక్టర్ మాట్లాడుతూ వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ నుంచి మరోసారి కౌన్సెలింగ్ జరగకుండా ఉత్తర్వులు తెచ్చుకోమని, ఇందుకు రెండు రోజులు గడువు ఇస్తున్నానని పేర్కొన్నారు. ఆ తర్వాత ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు మరోసారి కౌన్సెలింగ్ తప్పదని స్పష్టం చేశారు. దీంతో ఏఎన్ఎంలు ఉన్నతాధికారులను కలిసేందుకు సిద్ధమవుతున్నారు.

● అర్ధరాత్రి వరకు కౌన్సెలింగ్

జిల్లాలోని సచివాలయాల్లో 459 మంది ఏఎన్ఎంలకు ఈనెల 2 నుంచి 4 వరకు బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. అర్ధరాత్రి వరకు ఈ ప్రక్రియను నిర్వహించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత ఆధ్వర్యంలో జూమ్ ద్వారా కౌన్సెలింగ్ నిర్వహించారు. అర్ధరాత్రులు ఈ కౌన్సెలింగ్ ఏమిటంటూ ఏఎన్ఎంలు అప్పట్లో ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే వ్యవహారంలో అధికారులు పెద్ద ఎత్తున ముడుపులు తీసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ముడుపులు ఇచ్చిన వారు తాము కోరుకున్న స్థానాల్లోనే ఉండిపోయారు.

● కౌన్సెలింగ్ రద్దుకు వీరే కారణమా...?

ఈ కౌన్సెలింగ్ రద్దుకు ఫిబ్రవరిలో జరిగిన సచివాయం ఏఎన్ఎంల ఉద్యోగోన్నతులే కారణమని తెలుస్తోంది. అప్పట్లో సచివాయం ఏఎన్ఎంలు గ్రేడ్ 3 నుంచి గ్రేడ్ 2గా 289 మంది పదోన్నతులు పొందారు. వీరిని సచివాలయం నుంచి వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోని పీహెచ్‌సీలకు మార్చారు. ఉద్యోన్నతులు పొందిన సచివాలయం ఏఎన్ఎంలు ఆయా ఆరోగ్య కేంద్రాలకు వెళ్లలేదు. అయితే వైద్య ఆరోగ్యశాఖ నిర్వహించిన బదిలీల కౌన్సెలింగ్‌లో ఈ సచివాలయాల ఖాళీలను కూడా చూపించారు. దీనిపై కమిషర్‌ను కలిసిన ఉద్యోన్నతి పొందిన ఏఎన్ఎంలు తమకు ఉద్యోన్నతి వచ్చినా సచివాలయం నుంచి రిలీవ్ చేస్తున్నట్లు ఎలాంటి ఉత్తర్వులు రాలేదని, అందుకే పీహెచ్‌సీలకు వెళ్లటం లేదన్నారు. స్పందించిన కమిషనర్ జరిగిన కౌన్సెలింగ్‌ను రద్దు చేస్తున్నట్లు ఆదేశాలు ఇచ్చారు.

మరోసారి కౌన్సెలింగ్

వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు సచివాయం ఏఎన్ఎంలకు మరోసారి బదిలీల కౌన్సెలింగ్ జరుగుతుంది. తమకు అన్యాయం జరిగిందని ఏఎన్ఎంలు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు తెచ్చుకుంటే కౌన్సెలింగ్ జరిగే అవకాశం ఉండదని భావిస్తున్నాం .

- డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత

30శాతం ఐఆర్ ప్రకటించకుంటే ఉద్యమం



కావలి(టౌన్), జూలై 7(ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులకు 30 శాతం ఐఆర్ ప్రకటించకపోతే ఉద్యమం తప్పదని ఎస్టీయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి తెలిపారు. సోమ వారం స్థానిక ఎస్టీయు కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు అశోక్‌బాబు అధ్యక్షతన జరిగిన విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయ న మాట్లాడుతూ ఉద్యమాల పుట్టినిల్లు, ఉపా ధ్యాయుల సమస్యల పరిష్కారం, సంక్షేమం కోసం ముందుండి ఉద్యమాలు నడిపించిన ఘనత ఎస్టీయుకే దక్కుతుందన్నారు. గతంలో ప్రభుత్వాలపై పోరాడి సాధించుకున్న ప్రయోజనాలను నేటి ప్రభుత్వం తూ ట్లు పొడిచేలా వ్యవహరించ డం సరికాదన్నారు. రాష్ట్ర అద నపు ప్రధాన కార్యదర్శి పీ రమణారెడ్డి మాట్లాడుతూ 11వ పీఆర్సీ గడువు ముగిసి రెండేళ్లు కావస్తున్నప్పటికీ నేటికీ పీఆర్సీ కమిషన్ నియ మించకపోవడం మధ్యంతర భృతి ప్రకటించకపోవడం అన్యాయమన్నారు. పెండింగ్‌లో ఉన్న 4డీఏలు వెంటనే ప్రకటించా లని 11వ పీఆర్సీ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ మొండివైఖరి వీడకపోతే పెద్దఎత్తున ఉద్యమానికి శ్రీకారం చుట్టాల్సివస్తుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు సుదర్శనరావు, మాల్యాద్రి, కె రాజ్‌కుమార్, రాజు, సురేష్, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశాలు పెంచాలి



గోడపత్రికలు ఆవిష్కరిస్తున్న డీఆర్వో, డీఈవో తదితరులు

నెల్లూరు (విద్య), జూలై 7 (ఆంధ్ర జ్యోతి) : జిల్లాలో ఏపీ ఓపెన్ స్కూల్ ప్రవేశాలను పెంచేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఇన్‌చార్జి డీఆర్వో హుస్సేన్‌సాహెబ్ అన్నారు. డీ ఆర్వో చాంబర్‌లో సోమవారం జిల్లా విద్యాశాఖ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. విద్యపై ఆసక్తి ఉన్న ఉద్యోగులు, గృహి ణులు, అభ్యాసకులు ఓపెన్‌స్కూల్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునే లా అవగాహన కల్పించాలన్నారు. ఏపీ సార్వ త్రిక విద్యావిధానంలో టెన్త్, ఇంటర్ కోర్సులను విజయవంతంగా నిర్వహిస్తున్న తరుణంలో చదువుకోలేని వారు, చదువును మధ్యలో ఆపేసి న వారికి ఇది సువర్ణవకాశమని తెలిపారు. 14 ఏళ్ల వయసు నిండి చదవగలిగి, రాయగలిగిన వారంతా కూడా ఇందుకు అర్హులేనని చెప్పారు. అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో అధికారులు, ఇతర స్వచ్ఛంద సంస్థలు వారు కలిసి ఓపెన్‌స్కూల్ టెన్త్, ఇంటర్‌లో నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. దరఖాస్తులు ఏపీఓపెన్‌స్కూల్ డాట్ ఏపీ డాట్ జీవోవీ డాట్ వెబ్‌సైట్‌లో చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు సమీపంలోని విద్యాశాఖ కార్యాలయాలు, పాఠశాలల్లో సంప్రదించాలన్నా రు. అనంతరం ఓపెన్‌స్కూల్ అడ్మిషన్లకు సం బంధించిన గోడపత్రికను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీఈవో బాలాజీరావు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

10న మెగా పేరెంట్, టీచర్ మీటింగ్

● అందరూ పాల్గొని విజయవంతం చేయాలి

● కలెక్టర్ ఆనంద్ పిలుపు

నెల్లూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 10న జిల్లా వ్యాప్తంగా మెగా పేరెంట్, టీచర్ మీటింగ్‌లు నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఓ ఆనంద్ తెలిపారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ మీటింగ్‌లో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సోమవారం నెల్లూరులోని కలెక్టరేట్‌లో కలెక్టర్ విలేకరులతో మాట్లాడారు. మెగా పేరెంట్, టీచర్ మీటింగ్‌ను ఇప్పటికే ఒకసారి నిర్వహించామని, 10న నిర్వహించబోయేది రెండో మీటింగ్ అని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 3600 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలతోపాటు 143 కళాశాలల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. మీటింగ్ రోజున విద్యార్థుల తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు విద్యార్థుల బోధనా సామర్థ్యాలను వివరిస్తారని చెప్పారు. తమ పిల్లలు ఎలా చదువుతున్నారో తెలుసుకునే అవకాశం తల్లిదండ్రులకు కలుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యే విద్యార్థులు, తల్లిదండ్రులతో సోషల్ ఫారెస్ట్ ద్వారా మొక్కలు నాటే కార్యక్రమాలను కూడా నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. జిల్లాలో 3.50 లక్షల మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని, వారి ప్రతిభా సామర్థ్యాలను మెరుగు పరచడమే లక్ష్యంగా మెగా పేరెంట్, టీచర్ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో డీఈవో బాలాజీరావు, ఎస్ఎస్ఏ ఏపీడీ వెంకటప్పయ్య పాల్గొన్నారు.

వీఎస్‌యూ లేటరల్ ఎంట్రీ నోటిఫికేషన్ విడుదల

వెంకటాచలం, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : విక్రమ సింహపురి యూనివర్సిటీ లేటరల్ ఎంట్రీ ద్వారా పీజీ ద్వితీయ సంవత్సరంలో ప్రవేశానికి సోమవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. డిగ్రీ నాలుగు సంవత్సరాల ఆనర్స్ విత్ రీసెర్చ్ కోర్సును పూర్తి చేసిన విద్యార్థులు ఈ లేటరల్ ఎంట్రీకి అర్హులని వర్సిటీ డీఓఏ డైరెక్టర్ ఎం హనుమారెడ్డి తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. జూలై 7 నుంచి జూలై 21వ తేదీ వరకు అప్లికేషన్లు స్వీకరిస్తారన్నారు. ఈ కోర్సుల్లో చేరిన అర్హత గల విద్యార్థులకు ప్రభుత్వ నిబంధనల మేరకు ఫీజు రీఎంబర్స్‌మెంట్ వర్తిస్తుందన్నారు. పూర్తి వివరాలు యూనివర్సిటీ అధికారిక వెబ్‌సైట్ ద్వారా పొందవచ్చన్నారు. లేనిపక్షంలో యూనివర్సిటీలోని డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ విభాగంలో సంప్రదించాలన్నారు.

ఏసీబీ రహస్య విచారణ?

● అధికారులు, సిబ్బందిలో అలజడి

ఉదయగిరి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఉదయ గిరి పట్టణంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల వద్ద సోమవారం ఏసీబీ అధికారులు సాధారణ వ్యక్తుల వేషధారణలో రహస్య విచారణ చేపట్టి నట్లు తెలిసింది. స్థానిక తహసీల్దారు కార్యాల యం వద్దకు వాహనంలో అధికారులు వచ్చారు. అనంతరం తహసీల్దారు, సబ్ ట్రెజరీ, సబ్ రిజిస్ట్రార్, పోలీస్ స్టేషన్‌కు వివిధ పనులపై వచ్చిన వారితో సాధారణ వ్యక్తుల్లా మాట్లాడుతూ ఇక్క డ అధికారులు, సిబ్బంది పని తీరు ఎలా ఉంది.. సమస్యలు పరిష్కరిస్తున్నారా.. ఏమైనా ఇబ్బం దులకు గురిచేస్తున్నారా... తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. కాగా, ఏసీబీ అధికా రులు వచ్చి కార్యాలయాల ఆవరణలో సంచరి స్తున్నారనే విషయం అధికారులు, సిబ్బందికి తెలియడంతో వారిలో అలజడి నెలకొంది. ఏసీబీ అధికారులు కొన్ని గంటలపాటు కార్యాలయాల ఆవరణలోనే వివిధ విషయాలపై ఆరా తీసి వెళ్లి నట్లు సమాచారం.

నెలాఖరులోపు నామినేటెడ్ పోస్టుల భర్తీ

● పనిచేసే వారికే పదవులిస్తాం..

● నెల్లూరు నగర కార్యకర్తల సమావేశంలో మంత్రి లోకేష్

నెల్లూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఈనెలాఖరులోపు మార్కెట్, ఆలయ కమిటీల వంటి నామినేటెడ్ పదవులను భర్తీ చేస్తామని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రకటించారు. పార్టీలో పనిచేసే వారికే పదవుల్లో ప్రాధాన్యత ఉంటుందని స్పష్టం చేశారు. ఈ విషయంలో రాజీ పడేది లేదని ఆయన పేర్కొన్నారు. సోమవారం నెల్లూరు పర్యటనకు విచ్చేసిన ఆయన నగరంలోని అనిల్ గార్డెన్స్‌లో సిటీ నియోజకవర్గ నేతలు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ముందుగా ఉత్తమ కార్యకర్తలకు ప్రశంసాపత్రాలను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ గతంలో మాదిరిగా మరోసారి నష్టపోవడానికి సిద్ధంగా లేమని, ప్రతి నాలుగు నెలలకు ఒకసారి కేడర్ మొత్తం ప్రజల్లోకి వెళ్లేలా కార్యక్రమాలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. 'చంద్రబాబు కూడా చెబితే వింటారు. నాలుగోసారి సీఎం అయినా ఆయన వినడానికి సిద్ధంగా ఉన్నారు. కార్యకర్తల అభీష్టం మేరకే పదవుల భర్తీ జరుగుతుంది. కుటుంబం అన్నాక అనేక సమస్యలుంటాయి. కలిసి కూర్చొని వాటిని పరిష్కరించుకుందాం. నాలుగు గోడల మధ్య సమ స్యలు చర్చిద్దాం. నమ్ముకున్న సిద్ధాంతం కోసం పో రాడుదాం. చంద్రబాబు కూడా నియోజకవర్గాలకు వెళ్లినప్పుడు కార్యకర్తలను కలుస్తున్నారు. నిరంత రం కేడర్ నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకుంటాం' అని లోకేష్ వ్యాఖ్యానించారు. మంత్రి పొంగూరు నారాయణ అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎన్ఎండీ ఫరూక్, ఎంపీ వేమిరెడ్డి ప్రభాక రరెడ్డి, పార్టీ నెల్లూరు పార్లమెంటు అధ్యక్షు డు అబ్దుల్ అజీజ్, ఎమ్మెల్సీలు భూమిరెడ్డి రాంభూపాల్‌రెడ్డి, బీద రవిచంద్ర, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తదిత రులు పాల్గొన్నారు.



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నారా లోకేష్



టీడీపీ యువ కార్యకర్తలకు అభివాదం చేస్తూ..

● ఉపాధ్యాయుల కొరత తీర్చండి

నెల్లూరు(సిటీ) జూలై 7,(ఆంధ్రజ్యోతి): నగర కార్పొరేషన్ పరిధిలో ఉన్న పాఠశా లల్లో ఉపాధ్యాయుల కొరత తీర్చాలని మున్సిపల్ టీచర్స్ ఫెడరేషన్ నాయకులు ధనరాజు, వీరభద్రుడు, రవికుమార్ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేష్‌ను కోరారు. ఈ మేరకు సోమవారం ఆయనకు వారు వినతిపత్రం అందచేశారు.

రేపు పంచాయతీ సమగ్ర అభివృద్ధిపై శిక్షణ

సంగం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ సమగ్ర అభివృద్ధి, పనితీరు, పురోగతి (పంచాయతీ అడ్వాన్స్‌మెంట్ ఇన్‌డెక్స్)పై బుధవారం ఒక్కరోజు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో షాలెట్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమానికి అన్ని శాఖల మండల స్థాయి అధికారులు, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్, ఇంజనీరింగ్ అసిస్టెంట్, ఏఎన్ఎంలు తప్పక హాజరు కావాలని ఆమె ఒక ప్రకటనలో తెలిపారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9280
వెండి కిలో ధర	రూ. 110400
వెండి ఒక గ్రాము	రూ. 113.40

నిబంధనలకు విరుద్ధంగా పల్లెల్లో మద్యం విక్రయాలు

● బార్లుగా మారుతున్న బ్రాందీషాపులు ● పట్టించుకోని అధికారులు



దుకాణం వద్ద మద్యం సేవించి గుట్టగా పడేసిన ఖాళీ సీసాలు

ఉదయగిరి రూరల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా పల్లెల్లో మద్యం విక్రయాలు జరుగుతున్నా పట్టించుకునే నాథుడే లేడని గ్రామస్థులు విమర్శిస్తున్నారు. ఉదయగిరి మండలం కృష్ణంపల్లి, అప్పసముద్రం, దాసరిపల్లి, కుర్రపల్లి, దుత్తలూరు మండలం సోమలరేగడ, భైరవరం, నందిపాడు, ఏరుకొల్లు, నర్రవాడ, బ్రహ్మేశ్వరం, వరికుంటపాడు మండలం ఇస్కపల్లి, కాంచెరువు, గువ్వాడి, వరికుంటపాడు, తిమ్మారెడ్డిపల్లి, తూర్పుకొండారెడ్డిపల్లి, తూర్పురొంపిదొడ్ల, గణేశ్వరాపురం, నారసింహపురం, విరువూరు, జీ.కొండారెడ్డిపల్లి, సీతారామపురం మండలం బోడసిద్ధాయపల్లి, సీతారామపురం, అయ్యవారిపల్లి, చిన్నాగంపల్లి, వింజమూరు మండలం కాటేపల్లి, తమిదపాడు, కిస్తీపురం, బుక్కాపురం, చాకలికొండ, గుండెమడగల, నల్లగొండ్ల, చింతలపాళెం తదితర గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం విక్రయాలు సాగుతున్నాయి. అంతేగాక నిబంధనలకు విరుద్ధంగా మద్యం దుకాణాల ప్రాంగణాల్లోనే దాబాలు, టిఫిన్ సెంటర్లు, కూల్‌డ్రింక్స్ దుకాణాలను ఏర్పాటుచేసి మందుబాబులు కూర్చునేందుకు వీలుగా ఏర్పాట్లు చేసి బార్లుగా మారుస్తున్నారు. దుకాణాల సమయం ముగిసినప్పటికీ సమీప కూల్‌డ్రింక్స్ దుకాణాల్లో మద్యం విక్రయిస్తూ రూ. 50 నుంచి రూ. 100 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. ఫోన్‌చేసిన వారికి సైతం ఇతర ప్రాంతాలకు వెళ్లి మద్యం అందిస్తూ అదనపు నగదు వసూలు చేస్తుండడం గమనార్హం. కాగా, మర్రిపాడు తదితర మండలాల్లో బెల్టు షాపుల కారణంగా తరచూ వివాదాలు తలెత్తుతున్నాయని గ్రామస్థులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ప్రత్యేక నిఘా ఉంచి అనధికార బెల్టు దుకాణాలను అరికట్టి నిబంధనల మేరకు మద్యం విక్రయాలు సాగేలా చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.



పీఎంజేఏవై కోసం ఈకేవైసీ చేయించుకోవాలి

● డాక్టర్ అశోక్, పీహెచ్‌సీ వైద్యాధికారి

సంగం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రతిఒక్కరూ ప్రధానమంత్రి జన ఆరోగ్యయోజన కార్డు (పీఎంజేఏవైసీ) కోసం ఏఎన్ఎం వద్ద ఈకేవైసీ చేయించుకోవాలని వైద్యాధికారి డాక్టర్ అశోక్ తెలిపారు.

? పీఎంజేఏవైసీ వల్ల ఉపయోగాలు ఏమిటి.

! ఈ కార్డు వల్ల కుటుంబానికి ఏడాదికి రూ. 5 లక్షల బీమాతో కార్పొరేటు వైద్యశాలలో ఉచితంగా చికిత్స చేయించుకోవచ్చు. కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పథకం. ఎంతో ఉపయోగకరం.

? పీహెచ్‌సీలో అత్యవసర కేసులకు చికిత్స జరుగుతుందా, రక్త పరీక్షలు చేస్తున్నారా.

! అన్నిరకాల అత్యవసర కేసులకు ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం మెరుగైన చికిత్స కోసం ఆత్మకూరు జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు రెఫర్ చేస్తాం. 14 రకాల రక్త పరీక్షలు నిర్వహిస్తున్నాం.

? క్షయ వ్యాధి నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

! క్షయ నివారణకు టీబీ ముక్తాభారత్ 100 కార్యక్రమంలో భాగంగా రోగుల గళ్లను పరీక్షించి టీబీ వ్యాధి నిర్ధారణ అయితే వారికి చికిత్స ప్రారంభిస్తాం.

? కేన్సర్ స్ర్కీనింగ్ (ఎన్‌సీడీసీ) పరీక్షలు చేస్తున్నారా.

! కేన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు మండలంలోని చాలా గ్రామాల్లో జరుగుతున్నాయి. తమ క్షేత్రస్థాయి ఆరోగ్య సిబ్బంది ఇళ్ల వద్దకు వెళ్లి పరీక్షలు చేస్తున్నారు.

న్యూస్ బాక్స్


అభయాంజనేయుడికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న అభయాంజనేయస్వామి

ఆత్మకూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హనుమాన్ జంక్షన్‌లో ఉన్న అభయాంజనేయస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి వేకువజామున పంచామృతాభిషేకం చేశారు. అనంతరం సహస్ర నామార్చన, ఆకుపూజ గావించి హనుమాన్‌చాలీసా పఠించారు. అధికసంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు.

విద్యుదాఘాతానికి గేదెల మృతి



విద్యుదాఘాతానికి గురై మృతిచెందిన గేదెలు

దుత్తలూరు (ఉదయగిరి), జూలై 7 (ఆంధ్రజ్యోతి): దుత్తలూరు పంచాయతీ కమ్మవారిపాలెం గ్రామ సమీపంలో విద్యుదాఘాతానికి గురై రెండు గేదెలు మృతిచెందిన సంఘటన సోమవారం వెలుగుచూసింది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన నూతేటి రామకృష్ణ, నూతేటి ఓబయ్యలకు చెందిన గేదెలు ఆదివారం మేత కోసం సమీప పొలాల్లోకి వెళ్లాయి. మేతకెళ్లిన గేదెలు రాత్రికి ఇంటికి రాకపోవడంతో గాలింపు చర్యలు చేపట్టగా గ్రామ సమీపాన గల పొలాల్లో విద్యుత్ తీగపడి గేదెలు మృతిచెంది ఉండడాన్ని గుర్తించారు. రూ.1.60 లక్షల విలువ గేదెలు మృత్యువాతపడడంతో రైతులు ఆవేదనకు గురయ్యారు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని కోరారు. ఈమేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పూరిల్లు దగ్ధం

అనంతసాగరం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పలపాడులో తారాజువ్వ పడి పూరిల్లు దగ్ధమైంది. వివరాలిలా ఉన్నాయి. సోమవారం తెల్లవారుజామున పీర్లచావిడి వద్ద పీర్లు ఊరేగింపు సమయంలో బాణాసంచా కాలుస్తుండగా ఒక తారాజువ్వ మస్తాన్ అనే వ్యక్తి ఇంటిపై పడడంతో దగ్ధమైంది. ఇంట్లోని వస్తుసామాగ్రి కాలి బూడిదయ్యాయి. స్థానికులు మంటలను అదుపు చేశారు.

ముగిసిన మొహర్రం వేడుకలు



వరికుంటపాడు: అగ్నిగుండ ప్రవేశం చేస్తున్న భక్తులు

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తోటలచెరువుపల్లిలో నిర్వహిస్తున్న మొహర్రం వేడుకలు సోమవారం ముగిశాయి. తెల్లవారుజామున భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేసి తమ భక్తి భావాన్ని చాటుకున్నారు. ఈసందర్భంగా పీర్లను ప్రత్యేకంగా అలంకరించి మేళతాళాలు, బాణాసంచా వేడుకల నడుమ గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం సాయంత్రం ప్రత్యేక ప్రార్థనలు చేపట్టిన ముజావర్లు పీర్లను బావిస్నానం చేయించి చావిడికి తరలించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

●**అనంతసాగరం:** మండల కేంద్రం అనంతసాగరంలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న పీర్లపండుగ వేడుకలు సోమవారం ముగిశాయి. పెద్దపీర్లచావిడి వద్ద షహదత్ వేడుకల్లో భాగంగా పీర్లను ఊరేగించి బావికి తరలించారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొని ప్రసాదాలు స్వీకరించారు.

భూమిని అప్పగించాలని లబ్ధిదారుల ధర్నా



తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న లబ్ధిదారులు

సంగం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తలుపూరుపాడులో పేదలకు పంపిణీ చేసిన ప్రభుత్వ భూమిని ఆక్రమణదారుల నుంచి విడిపించి లబ్ధిదారులకు అప్పగించాలని సోమవారం తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా చేశారు. గతంలో ఎనిమిది ఎకరాల ప్రభుత్వ భూమిని కొంతమంది పేదలకు పంపిణీ చేసింది. కాగా, వారికి ఆర్థిక స్థోమతలేక బీడుగా వదిలేయడంతో గ్రామానికి చెందిన ఓ భూస్వామి ఆక్రమించారు. ప్రభుత్వం స్పందించి తమ భూమిని తమకు అప్పగించాలని రైతు సంఘం నాయకుల ఆధ్వర్యంలో లబ్ధిదారులు ధర్నా నిర్వహించారు. ఈమేరకు తహసీల్దారు సోమ్లానాయక్‌కు వినతిపత్రం అందచేశారు.

డిప్యూటీ ఎంపీడీవోకి ఘన సన్మానం



డిప్యూటీ ఎంపీడీవో భార్గవిరెడ్డిని సన్మానిస్తున్న అధికారులు, నాయకులు

సీతారామపురం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ అభివృద్ధి అధికారిణిగా పూర్తి అదనపు బాధ్యతలతో విధులు నిర్వహిస్తున్న డిప్యూటీ ఎంపీడీవో భార్గవిరెడ్డి బాపట్లలోని ఈటీసీ శిక్షణ కేంద్రానికి బదిలీ అయ్యారు. ఈసందర్భంగా సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది, మండల నాయకులు డిప్యూటీ ఎంపీడీవో భార్గవిరెడ్డిని ఘనంగా సన్మానించారు. అలాగే మండల పరిషత్ కార్యాలయంలో నూతన ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా అప్పాజి బాధ్యతలు స్వీకరించారు.

తప్పిపోయిన చిన్నారులు తల్లిదండ్రులకు అప్పగింత



తప్పిపోయిన బాబును తల్లికి అప్పగించిన పోలీసులు

ఏఎస్ పేట, జూలై 7 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు బారాషాహీద్ దర్గాలో జరిగే రొట్టెల పండుగ సందర్భంగా ఏఎస్ పేట దర్గాకు వేలాదిగా భక్తులు తరలి వస్తున్నారు. దీంతో సోమవారం చిత్తూరుకు చెందిన రెండు సంవత్సరాల వయస్సున్న పాప, హైదారాబాదుకు చెందిన 3సంవత్సరాల బాబు, మహరాష్ట్రకు చెందిన 2సంవత్సరాల పాప తప్పిపోయారు. వారిని గుర్తించిన పోలీసులు దర్గాలోని పోలీస్ అవుట్‌పోస్టుకు తీసుకొచ్చి చిన్నారుల దుస్తులు, ఆనవాళ్లను మైక్‌లో తెలపడంతో వారి తల్లిదండ్రులు చిన్నారులను గుర్తించడంతో వారికి అప్పగించారు. దీంతో తల్లిదండ్రులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

పదో తరగతి విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

ఏఎస్ పేట, జూలై 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాగూర్ పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరంలో 10వ తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు సోమవారం ప్రోత్సాహక బహుమతులు అందించారు. పాఠశాల ప్రథమ స్థానంలో నిలిచిన ఎండి అప్సాకు పోనుగోటి మధుసూధన్‌రెడ్డి, మహేష్‌రెడ్డి, మనోహర్‌రెడ్డిలు రూ. 10వేలు నగదు అందించారు. రెండవ స్థానంలో నిలిచిన సోమల సంజీవనికి పూర్వ ఉపాధ్యాయుడు తన భార్య సత్యవతమ్మ జ్ఞాపకార్థం రూ. 10వేలు నగదు అందించారు. అదేవిధంగా ఆత్మకూరు నియోజకవర్గ వైసీపీ మైనార్టీ నాయకుడు సయ్యద్ సందాని బాష ప్రథమ, ద్వితీయ స్థానం సాధించిన ఒక్కొక్కరికి రూ. 10వేలు నగదు, తృతీయ స్థానం సాధించిన మద్దు హనీప్రియ, జొన్నగడ్డ మధులేఖకు ఒక్కొకరికి రూ. 3వేలు చొప్పున అందించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ రమరెడ్డి, హెచ్ఎం దొరస్వామిరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమం, అభివృద్ధి కూటమి ప్రభుత్వ లక్ష్యం



ఆత్మకూరు: కరపత్రాలను అందజేసి ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న టీడీపీ పట్టణ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి

ఆత్మకూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమం, అభివృద్ధి ఎన్డీఏ కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ పట్టణ అధ్యక్షుడు, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ తుమ్మల చంద్రారెడ్డి, రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి పులిమి శైలజారెడ్డి అన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా వారు సోమవారం ఆత్మకూరు పట్టణంలోని 14, 15, 9వ వార్డుల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ జి వెంకటరమణమ్మ, స్థానిక టీడీపీ శ్రేణులతో కలిసి పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను, ఆత్మకూరు అభివృద్ధికి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చేస్తున్న కృషిని వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ సాగర్, టీడీపీ నాయకులు కొప్పోలు చిన్నపురెడ్డి, తోట సందీప్, సుమతి, పి సామ్రాజ్యం, టి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

●**ఉదయగిరి:** అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేయడమే ప్రభుత్వ లక్ష్యమని మండల టీడీపీ కన్వీనర్ చింతనబోయిన బయ్యన్న పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని హరిజనవాడలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొజ్జా నరసింహులు, నల్లిపోగు రాజా, ఉప్పుటూరి పెదవెంకటయ్య, నల్లిపోగు నరసింహా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం



ఉదయగిరిలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఉదయగిరి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గన్నేపల్లి, ఉదయగిరి పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సోమవారం ఎమ్మార్పీఎస్ నాయకులు ఘనంగా నిర్వహించి జెండాలను ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ జన్మదినం సందర్భంగా స్థానిక పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో కేక్ కట్‌చేసి సంబరాలు నిర్వహించి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు బకీరు జాషువా, బెజవాడ బాలగురయ్య, గడ్డం రాజా, నాయుడు, మరియదాసు, సర్పంచ్ వెంకటస్వామి, జేవీవీ నాయకుడు దస్తగిరిఅహ్మద్, మైనారిటీ నాయకులు రియాజ్ పాల్గొన్నారు.

●**సీతారామపురం:** ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోంపల్లి గ్రామంలో యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం జెండా ఆవిష్కరణ అనంతరం బహిరంగ సభ నిర్వహించారు. వేడుకలకు సీనియర్ నాయకులు నేలటూరి జాషువా అధ్యక్షత వహించగా ఎమ్మార్పీఎస్ జాతీయ సలహాదారులు డాక్టర్ కలివెల ఎలీషా కుమార్, ఉపాధ్యాయ నాయకులు ఏవి రమణయ్య, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

●**అనంతసాగరం:** మండలంలోని పాత దేవరాయపల్లిలో సోమవారం ఎమ్మార్పీఎస్ జెండాను నాయకులు ఆవిష్కరించారు.కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో మహేష్ మాదిగ, రవి తదితరులు పాల్గొన్నారు.

●**వింజమూరు:** ఎంఎస్పీ మండల ఇన్‌చార్జ్ గోచిపాతల ఆనందరావు మాదిగ, మల్లెల తిరుమలేష్ మాదిగ, గంగపట్ల వెంగళరావు మాదిగల ఆధ్వర్యంలో స్థానిక బంగ్లా సెంటర్, అశోక్‌నగర్, శంఖవరం, బుక్కాపురం, మాధవ్‌నగర్, నందిగుంట, అరుంధతివాడ, నేరేడుపల్లి గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ముందుగా గ్రామాల్లో జెండా ఎగురవేసి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈసందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన జిల్లా ఇన్‌చార్జ్ మందా వెంకటేశ్వరరావు మాదిగ, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు పందిటి అంబేడ్కర్ మాదిగలు మాట్లాడారు. అనంతరం ఎంఆర్‌పీఎస్ ఉద్యమ నాయకులను సత్కరించారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు, ఎంఎంఎస్ జిల్లా అధ్యక్షులు మంద సుజాత మాదిగ, బూదాల ప్రేమ్‌దాస్ మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న రహదారుల పరిశీలన



దెబ్బతిన్న రహదారులను పరిశీలిస్తున్న అధికారులు

ఉదయగిరి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో దశాబ్దాల క్రితం నిర్మించి దెబ్బతిన్న సిమెంట్ రోడ్లను పంచాయతీరాజ్ డీఈ సీహెచ్ మణికుమార్, ఏఈ శ్రీనివాసరాజులు సోమవారం టీడీపీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పట్టణంలోని నాగులబావి వీధి, వాల్మీకి వీధి, యాదవపాళెం, దిలావర్‌భాయ్ వీధి, బ్రాహ్మణ వీధుల్లో దెబ్బతిన్న సిమెంట్ రహదారులను పరిశీలించి నూతన రహదారుల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారని, దీంతో ఆయా ప్రాంతాల్లో రహదారుల నిర్మాణానికి కొలతలు సేకరించినట్లు తెలిపారు. నిధులు మంజూరు కాగానే రహదారుల నిర్మాణానికి చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ చింతనబోయిన బయ్యన్న, టీడీపీ నాయకులు రియాజ్, ఉప్పుటూరి పెదవెంకటయ్య, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు, కార్మికులు

ఆత్మకూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ మున్సిపల్ ఇంజనీరింగ్ ఒప్పంద కార్మికుల వేతనాలను పెంచి, సంక్షేమ పథకాలు వర్తింపచేయాలని కోరారు. రిటైర్డ్ కార్మికులకు గ్రాట్యుటీ విడుదల చేయా లని డిమాండ్ చేశారు. ఈమేరకు వారు మున్సిపల్ కమిషనర్ సి గంగాప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయ కులు జె నాగరాజు, బి హజరత్తయ్య, ఎం పెంచలయ్య, టి నాగరాజులు, ఎస్‌డి షఫీ, షేక్ సుభాన్ పాల్గొన్నారు.

డీఆర్సీ ఉందా... లేదా ?



● సమావేశాలను మరిచిన అధికారులు, ప్రజాప్రతినిధులు
● వెంటనే నిర్వహించాలని సీఎం ఆదేశం

నెల్లూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా రివ్యూ కమిటీ(డీఆర్సీ) ఒకటి ఉందని, ప్రతి మూడు నెలలకు ఒకసారి దాన్ని సమావేశపరచాలన్న విషయాన్ని ఇటు అధికారులు, అటు ప్రజాప్రతినిధులు మరిచినట్లున్నారు. గత ఎనిమిది నెలల కాలంలో ఒక్క సమావేశం కూడా నిర్వహించలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలో ఒకే ఒకసారి (గత నవంబరులో) డీఆర్సీ సమావేశం నిర్వహించారు. ఆ సందర్భంగా అనేక అభివృద్ధి పనులు, వివిధ సమస్యలపై చర్చించారు. ఆ తర్వాత ఎవరికీ తీరికలేదన్నట్లు వ్యవహరిస్తూ డీఆర్సీని విస్మరించారు. జిల్లా అభివృద్ధికి సంబంధించి కీలక అంశాలపై చర్చించే ప్రధాన వేదిక డీఆర్సీ సమావేశం. ఇన్‌చార్జ్ మంత్రి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో ఇటు జిల్లా స్థాయి అధికారులతోపాటు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు సభ్యులుగా ఉంటారు. ఈ సమావేశంలో అన్ని శాఖలపై సమీక్ష జరుగుతుంది. ఆయా శాఖల్లో పురోగతి సాధించేందుకు కమిటీ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకుంటారు. అలానే క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను కూడా పరిష్కరించేందుకు చర్చిస్తారు. ఇక ఎమ్మెల్యేలు కూడా వారి నియోజకవర్గాల్లోని కీలక సమస్యలను కమిటీ దృష్టికి తీసుకొస్తారు. డీఆర్సీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను అవసరం మేరకు ప్రభుత్వానికి పంపుతారు. ఇన్‌చార్జ్ మంత్రి ఉంటారు కాబట్టి చాలా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు డీఆర్సీ ఒక మంచి వేదికగా ప్రజా ప్రతినిధులకు నిలుస్తుంది. ఇంతటి కీలకమైన రివ్యూ కమిటీ సమావేశాలు రెగ్యులర్‌గా జరగడం లేదు. సాధారణంగా ప్రతి మూడు నెలలకు ఒకసారి డీఆర్సీ సమావేశాలు నిర్వహిస్తూ ఆ మూడు నెలల కాలంలో జిల్లా ప్రగతిపై సమీక్షిస్తుంటారు. అప్పుడే మెరుగైన ఫలితాలు సాధించేందుకు అవకాశం ఏర్పడుతుంది.

చర్చించాల్సిన అంశాలు ఎన్నో..!

గతేడాది నవంబరు 3న చివరగా డీఆర్సీ సమావేశం జరిగింది. ఇన్‌చార్జ్ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డిలతో పాటు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, జిల్లాలోని అందరు ఎమ్మెల్యేలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రధాన శాఖలపై సుదీర్ఘంగా చర్చించారు. కీలక సమస్యలను ఎమ్మెల్యేలు ప్రస్తావించారు. ఆమంచర్ల వద్ద ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు సమస్య, ఇరిగేషన్‌లో ఓఅండ్ఎం పనుల్లో అవినీతిపై చర్చ జరగ్గా, వీటిపై దృష్టి పెట్టాలని కలెక్టర్‌కు ఇన్‌చార్జ్ మంత్రి ఆదేశాలు ఇచ్చారు. వెంటనే ఆమంచర్ల ఇండస్ట్రియల్ పార్కు సమస్య పరిష్కారం కాగా ఇరిగేషన్ శాఖలోని అవినీతిపై విచారణ మొదలవడం గమనార్హం. అదే విధంగా ప్రస్తుతం జిల్లా అభివృద్ధికి సంబంధించి చర్చించాల్సిన అంశాలు అనేకం ఉన్నాయి. సోమశిల ఆప్రాన్ పనులు, ఇరిగేషన్, రైల్వే ప్రాజెక్టులకు భూసేకరణ, సంగం, నెల్లూరు బ్యారేజీల నిర్వహణ, కొత్త కలెక్టరేట్ నిర్మాణం, నెల్లూరు నగరంలో అసంపూర్తిగా ఉన్న యూజీడీ పనులు, పంటల సాగు పరిస్థితులు, రోడ్లను బాగు చేయడం, పెండింగ్ బిల్లులు, కీలక ప్రాజెక్టులకు నిధులు సాధించడం... వంటి అనేక అంశాలు డీఆర్సీ సమావేశం కోసం ఎదురుచూస్తున్నాయి.

ప్రైవేటు బడుల్లో విద్యాహక్కు చట్టానికి తిలోదకాలు

●పేద విద్యార్థులకు అందని ఉచిత విద్య



కొడవలూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : పేద విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత విద్య అందించడానికి ప్రవేశపెట్టిన నూతన విద్యాహక్కు చట్టం మండలంలో సక్రమంగా అమలు కావడంలేదు. పేద విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలల్లో 25శాతం సీట్లు ఉచితంగా కేటాయించాల్సి ఉంది. అయితే ఈ చట్టంపై విద్యాశాఖ అధికారులు సరైన ప్రచారం, అవగాహన కల్పించక పోవడంతో ప్రతి ఏటా ఉచితంగా ఇవ్వాల్సిన సీట్లు చాలా ప్రైవేటు పాఠశాలల్లో మిగిలిపోతున్నాయి. ఉచిత విద్య కోసం ముందుగా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని సమీప పాఠశాలలను ఎంచుకుని ప్రవేశం పొందాలి. విద్యాహక్కు చట్టం ద్వారా ఒకటో తరగతిలో ప్రవేశం పొందితే పదో తరగతి వరకు ఉచిత విద్యను పొందవచ్చు.

తల్లిదండ్రుల్లో అవగాహన లేక...

విద్యాహక్కు చట్టంపై పేద విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన లేకపోవడంతో ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు. ఉచిత సీట్ల కోసం పిల్లల పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకునేవారి సంఖ్య చాలా తక్కువగా ఉంటోంది. అధికారులు విద్యాహక్కు చట్టంపై విద్యార్థులకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించడంపై శ్రద్ధ చూపడం లేదు. దీంతో పేద విద్యార్థులకు ఉచిత విద్య మిథ్యగానే మిగులుతోంది. చాలామంది తల్లిదండ్రులకు ఇందుకోసం ఏ విధంగా దరఖాస్తు చేసుకోవాలో తెలియడం లేదు. దీంతో గత ఐదేళ్లుగా ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత సీట్లు మిగిలిపోయాయి.

ముందుకు రాని ప్రైవేటు విద్యా సంస్థలు

మండల పరిధిలోని నార్సురాజుపాలెం, కొడవలూరు, తదితర గ్రామాల్లో సుమారు 18 ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. అయితే ఈ విద్యా సంస్థలు, ఉచిత సీట్లు ఇవ్వడానికి ముందుకు రావడం లేదని సమాచారం. విద్యాశాఖ అధికారులు చెబు తున్నా పెడచెవిన పెడుతున్నారని తెలు స్తోంది. విద్యాహక్కు చట్టం అమలు చేయని ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు. పాఠశాలలు ప్రారంభించి సుమారు నెలరోజులవుతోంది. ఈ నేపథ్యం లో విద్యా శాఖ అధికారులు ఈ చట్టంపై అవగాహన కల్పించి పేద విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత విద్య అందేలా చూడాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

రెండు కార్లు ఢీకొని ఒకరి మృతి



మృతిచెందిన వెంకటేశ్వర్లు (ఫైల్)

దుత్తలూరు (ఉదయగిరి రూరల్), జూలై 7 (ఆంధ్రజ్యోతి): రెండు కార్లు ఢీకొని ఓ వ్యక్తిపైకి దూసుకెళ్లడంతో అతను అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన మండలంలోని నందిపాడు సెంటర్‌లో 565 జాతీయ రహదారిపై సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నందిపాడు గ్రామానికి చెందిన నల్లబోతుల వెంకటేశ్వర్లు(54) ఉదయగిరికి వెళ్లేందుకు బస్సు కోసం రోడ్డు మార్జిన్‌లో వేచి ఉన్నాడు. ఈ తరుణంలో ప్రకాశం జిల్లా కనిగిరి నుంచి తిరుపతికి వెళుతున్న కారు నందిపాడు సెంటర్ వద్దకు రాగానే ఉదయగిరి నుంచి సంగంకు వెళుతున్న కారును ఢీకొట్టి రోడ్డుపక్కన ఉన్న వెంకటేశ్వర్లపైకి దూసుకెళ్లడంతో అతనికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. అనంతరం కారు రోడ్డుపక్కనే ఉన్న గృహాలపైకి దూసుకెళ్లింది. ఉదయగిరి ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి తన సిబ్బందితో ప్రమాద స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉదయగిరి తరలించి అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	125
స్కిన్ చికెన్	228
స్కిన్‌లెస్	250

కోడిగుడ్ల ధర (100): 570

టీఆర్ఆర్‌లో 10 నుంచి ఉచిత శిక్షణ

కందుకూరు, జూలై 7(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పూర్తయిన విద్యార్థినీ విద్యార్థుల కోసం ఇంగ్లీష్ కమ్యూనికేషన్స్, బేసిక్స్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్, జనరల్ అవేర్నెస్ అంశాలపై ఈనెల 10వ తేదీ నుంచి ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు ఎం.రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజు ఉదయం 10 గంటల నుంచి ఉచిత శిక్షణ తరగతులు కళాశాలలో జరుగుతాయని తెలిపారు. పాతికేళ్ల బోధనానుభవం, పీహెచ్‌డీ, ఎన్ఈటీ క్వాలిఫైడ్ అధ్యాపకులు ఆయా అంశాలలో శిక్షణ ఇస్తారని, పరిసర ప్రాంత విద్యార్థినీ విద్యార్థులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

10న మెగా పేరెంట్, టీచర్ సమావేశం

లింగసముద్రం, జూలై 7(ఆంధ్రజ్యోతి) : ఈనెల 10వ తేదీన నిర్వహించనున్న పేరెంట్స్, టీచర్స్ మెగా సమావేశాన్ని జయప్రదం చేయాలని ఎంఈవో-2 ఎంవీ శివకుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి విద్యార్థుల తల్లిదండ్రులు వచ్చేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని పేర్కొన్నారు. పాఠశాలల అభివృద్ధిలో తల్లిదండ్రులను భాగస్వాములుగా చేసి వారి సలహాలు, సూచనలు తీసుకొనేందుకు ఈ సమావేశం ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

న్యూస్ బాక్స్

ముగిసిన ప్రపంచ రక్తదాతల దినోత్సవం

కావలి/కందుకూరు, జూలై 7(ఆంధ్రజ్యోతి): రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ప్రపంచ రక్తదాతల దినోత్సవాలు-2025 కార్యక్రమాలు ఆదివారం రాత్రి ముగిశాయి. కావలి వాయునందన ప్రెస్‌వీధిలోని ఓ కల్యాణ మండపంలో జరిగిన ముగింపు కార్యక్రమంలో రెడ్‌క్రాస్ విశిష్ట సేవలు అందించిన, అధిక పర్యాయాలు రక్తదానం చేసిన, రక్తదాతలను ప్రోత్సహించిన వారిని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి సత్కరించి మెమొంటోలు అందచేశారు. కందుకూరులో రక్తదాతలను ప్రోత్సహిస్తూ ప్రతిఏటా క్రమం తప్పకుండా రక్తదాన శిబిరాల నిర్వహణకు కృషి చేస్తున్న పట్టణానికి చెందిన మహాత్మాగాంధీ విగ్రహ కమిటీప్రతినిధి పబ్బిశెట్టి వరదరాజా, బీసీ హాస్టల్ వార్డెన్ జీ.తిరుపతిరావులను ఘనంగా సత్కరించారు. విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కావలి ఆర్డీవో ఎం. సన్నీ వంశీకృష్ణ, రెడ్‌క్రాస్ రాష్ట్రకోశాధికారి పీ.రామచంద్రరాజు, జిల్లా చైర్మన్ వాకాటి విజయకుమార్‌రెడ్డి, రోటరీ ఇంటర్నేషనల్-3160 జిల్లా కార్యదర్శి డాక్టర్ మాధవరెడ్డి, ఐఎంఏ కార్యదర్శి వీ.గోపి, రెడ్‌క్రాస్ బాధ్యులు డీ.రవిప్రకాష్, కే.హరినారపరెడ్డి, ఆరికట్ల మధుసూదన రావు, డాక్టర్ పీ.శ్రీధర్ పాల్గొన్నారు.

చెంచులక్ష్మీపురంలో వెలగని వీధి దీపాలు

బిట్రగుంట, జూలై 7(ఆంధ్రజ్యోతి): బోగోలు మేజర్ పంచాయతీ చెంచులక్ష్మీపురంలో వీధి దీపాలు వెలగక వీధులు అంధకారంగా మారాయి. ఇటీవల కాలంలో విద్యుత్ అతరాయం వలన చీకటి పడితే అడుగు బయట పెట్టాలంటే స్థానికులు భయపడుతున్నారు. పంటపొలాలు గ్రామ సమీపంలో ఉండటంతో పాముల సంచారం పెరిగింది. పంచాయతీ అధికారులు వెంటనే స్పందించి వీధి దీపాలు వెలిగేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

విట్స్ వార్షిక వార్త లేఖ ఆవిష్కరణ

కావలి(టౌన్), జూలై 7(ఆంధ్రజ్యోతి) : పట్టణ విట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం వార్షిక వార్త లేఖను విట్స్ చైర్మన్ దొడ్ల విద్యాధర్‌కుమార్ రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ ప్రత్యూషా రెడ్డిలు ఆవిష్కరించారు. సంపాదకులుగా వ్యవహరించిన డాక్టర్ గిరీష్ గాంధీ డాక్టర్ హయాత్ రజ్వీలు మాట్లాడుతూ గత సంవత్సరం వివిధ విభాగాల్లో నిర్వహించిన కార్యక్రమాలు దేశంలోని ప్రసిద్ధి చెందిన యూనివర్శిటీలు కళాశాలలో తమ విద్యార్థులు సాధించిన విజయాలు, జాతీయ సెమినార్ల నిర్వహణ అందులో పాల్గొన్న వక్తలు నిపుణుల సమాచారం తదితర అంశాలను లేఖలో పొందుపరిచామన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ అనిల్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అకడమిక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ లిఖిత్‌రెడ్డి, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కి 7 వినతులు

కందుకూరు, జూలై 7(ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో 7 అర్జీలు వచ్చినట్లు మున్సిపల్ కమిషనర్ కె. అనూష తెలిపారు. ఆ సమస్యల తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయా సెక్షన్ హెడ్స్‌కు ఆదేశాలు జారీచేసినట్లు తెలిపారు. మున్సిపాలిటీలో పారిశుధ్యం, వీధిలైట్లు ఇతర సమస్యల పరిష్కారం కోసం 9177700267కు ఫోన్‌లో తెలిపినా తక్షణ చర్యలు చేపట్టడం జరుగుతుందని పేర్కొన్నారు.

నేడు మండల, సచివాలయ అధికారులకు శిక్షణ

కలిగిరి, జూలై 7(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం మండల స్థాయి అధికారులతోపాటు, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్, ఇంజనీరింగ్ అసిస్టెంట్, ఏఎన్ఎం, పంచాయతీ కార్యదర్శులకు పంచాయతీ అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్ 2023-24 కార్యక్రమంపై శిక్షణ కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీవో ప్రత్యూష ఓ ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమం ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరుగుతుందని, పైన తెలిపిన శాఖాధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని పేర్కొన్నారు.

విద్యుదాఘాతానికి గేదె మృతి

కొండాపురం, జూలై 7(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో గేదె మృతి చెందిన ఘటన సోమవారం మండలంలోని సాయిపేటలో జరిగింది. గ్రామానికి చెందిన పాటిబండ్ల చిన అంకయ్య తన గేదెలను మేతకోసం పొలాలకు తోలుకొనిపోతుండగా స్థానిక ఎస్సీ కాలనీలోని వీధిలో విద్యుత్‌వైరు తెగిపడి ఉండటంతో గేదె పొరపాటున దానికి తగిలి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందింది. ఈ మేరకు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సుమారు రూ.80 వేల నష్టం జరిగిందని, ప్రభుత్వం ఆదుకోవాలని పశుపోషకుడు చిన అంకయ్య కోరారు.

మడుగు కాదు.. రోడ్డే..!

- పైపులైను పగిలి సైడు కాలువలు లేక రోడ్డుపై నిలిచిన నీరు
- ఇబ్బందుల్లో వాహనదారులు, పాదచారులు

లింగసముద్రం, జూలై 7(ఆంధ్రజ్యోతి) : ఈ ఫొటోలో కపిస్తున్నది మడుగు కాదండి.. ఆర్అండ్‌బీ రోడ్డే. మూడు రోజుల క్రితం రోడ్డు పక్కన విద్యుత్ స్తంభం కోసం ఎక్స్ కవేటర్‌తో గుంత తీశారు. ఆ సమయంలో అక్కడ ఉన్న తాగునీటి పైపులైను పగిలిపోయింది. దీంతో మంచినీరు వృథాగా పోతూ రోడ్డుపై మడుగు కట్టింది. కాగా దశాబ్దాలుగా రోడ్డుకి ఇరువైపుల డ్రైనేజీ కాలువలు లేక పోవడంతో వర్షం వచ్చిన ప్రతిసారి, ఇళ్లల్లో నుంచి వచ్చే మురుగు నీరు ఇలా రోడ్డుపై చేరి దర్శనమిస్తోంది. ఇది ఎక్కడో మారుమూల పల్లెలో కాదండోయ్.. లింగసముద్రం మండల కేంద్రంలోనే. వివరాల మేరకు లింగసముద్రం ప్రధాన ఆర్అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా సైడు కాలువలు లేక పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని మసీదు సెంటరు నుంచి బస్టాండ్ సెంటరు వరకు మాత్రమే ఆర్అండ్‌బీ రోడ్డుకు ఒక వైపు సైడు కాలువ ఉంది. ఈ కాలువ కూడా కేవలం 200 మీటర్ల దూరం మాత్రమే ఉంది. కానీ రోడ్డు రెండో వైపున సైడు కాలువ లేదు. దీంతో తిరుమణిశెట్టి కోటయ్య మందిరం సమీపంలో ఉంటున్న నివాసాల వారు కొందరు తమ ఇళ్లలోని వ్యర్థపు నీటిని ప్రతిరోజూ ఆర్అండ్‌బీ రోడ్డుపైకి వదులుతున్నారు. దీంతో ప్రతిరోజూ వాహనదారులు, ప్రజలు ఈ బురదనీటిలో నడవలేక ఇబ్బందులు పడుతుండగా వాహనాలు వచ్చినప్పుడు ఆ నీరు ప్రజలపైకి పడుతోంది. దీంతో దుర్వాసన పడలేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. అలాగే వర్షం కురిసిన ప్రతిసారీ స్థానిక మీసేవా కేంద్రం నుంచి దక్షి ణం వైపు ఉన్న వాటర్ ప్లాంటు వరకు ఆర్అండ్‌బీ రోడ్డుపై నీరు నిలిచిపోతోంది. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.


లింగసముద్రం మీసేవా కేంద్రం సమీపంలో ఆర్అండ్‌బీ రోడ్డుపై నిలిచిన పైపులైన్ లీకేజీ నీరు

● కాలువల నిర్మాణానికి ప్రతిపాదనలు

5 నెలల క్రితం డాక్టర్ పీవీ కృష్ణమోహన్ ప్రజా వైద్యశాల నుంచి బస్టాండ్ సెంటరు మీదుగా కోళ్లపారం వరకు రోడ్డుకు ఇరువైపులా సైడు కాలువల నిర్మాణానికి రూ.50 లక్షలతో ప్రతిపాదనలు పంపించినట్టు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సీహెచ్ రాజశేఖర్ చెప్పారు.

మురుగు గుంత కాదండీ.. రోడ్డే!

- సిమెంట్ రోడ్డుపై నిల్వ చేరిన నీరు
- ఇబ్బందుల్లో అయ్యవారిపల్లె ప్రజలు

వలేటి వారిపాలెం, జూలై 7(ఆంధ్రజ్యోతి) : మండలంలోని అయ్యవారిపల్లె జాతీయ రహదారి నుంచి ఎస్సీ కాలనీలోకి వెళ్లే సిమెంట్‌రోడ్డుపై మురుగు నీరు ప్రవహిస్తోంది. ఎస్సీ కాలనీల్లో డ్రైనేజీలు లేకపోవడంతో కాలనీ వాసులు ఇళ్లలోని వృథా నీరంతా సిమెంట్‌రోడ్డు పైకి వదిలేస్తున్నారు. గతంలో జాతీయరహదారి లేకపోవడంతో కాలనీ వాసులు వదిలేసిన వృథా నీరంతా రోడ్డు పక్కన దిగువకు పోయేది. ఇప్పుడు రోడ్డు ఎత్తు పెరగడంతో మురుగు నీరు దిగువకు పోయే అవకాశం లేక హైవే రోడ్డు పక్కన ఎస్సీ కాలనీల్లోకి వెళ్లే సిమెంట్ రోడ్డుపై నిల్వ ఉండి మురుగుకుంటలా మారింది. దీంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అంతేగాకుండా మురుగు నిల్వ ఉండి దుర్వాసన వస్తుందని ఆ ప్రాంతీయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయినప్పటికీ పంచాయతీ పాలకులు అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా సంబంధిత పాలకులు, అధికారులు స్పందించి డ్రైనేజీలు నిర్మించి మురుగునీరు సిమెంట్ రోడ్డుపై నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.


అయ్యవారిపల్లెలో సిమెంటు రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికుల ధర్నా

కావలి, జూలై 7(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ అవుట్‌సోర్సింగ్ కార్మికులకు సంక్షేమ పథకాలు వర్తింపచేయాలని, పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో చేట్టిన ఈ ధర్నా అనంతరం మున్సిపల్ మేనేజరు ఫణీంద్రకు వినతిపత్రం అందచేశారు. అనంతరం యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఆది నారాయణ, వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మున్సిపాల్టీలో శానిటేషన్, ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ విభాగాలలో అవుట్‌సోర్సింగ్ కింద పనిచేస్తున్న కార్మికులకు జీవోఎంఎస్ 36 ప్రకారం వేతనాలు పెంచాలన్నారు. పర్మినెంట్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలు ఇవ్వాలని, ఉద్యోగ విరమణ చెందిన కార్మికుల గ్రాడ్యుటీ రాష్ట్రప్రభుత్వం సత్వరం విడుదల చేయాలన్నారు. కొవిడ్-19లో తీసుకున్న డైలీవేజస్ కార్మికులను అవుట్‌సోర్సింగ్ కార్మికులుగా గుర్తించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని కోరారు. ఈనెల 9వ తేదీన జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మల్లె అంకయ్య, ఏఐటీయూసీ నియోజక వర్గ కార్యదర్శి రవి, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి కే.నాగరాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు దమ్ము దర్గాబాబు, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

చంద్రబాబునాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి


ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

కందుకూరు, జూలై 7(ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ నేతలు పేర్కొన్నారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో క్లస్టర్, బూత్ ఇంచార్జిల ఆధ్వర్యంలో సోమవారం ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేస్తూ ఏడాది కాలంలో చేసిన అభివృద్ధి, సంక్షేమంపై ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని నందావారివీధిలో పార్టీ నాయకులు చీదెళ్ల పిచ్చయ్య, వలేటివెంకటేశ్వర్లు, యోగేశ్వరరావు తదితరుల ఆధ్వర్యంలో ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు. తూర్పుపాలెం ప్రాంతంలో తెలుగు మహిళ నియోజకవర్గ అధ్యక్షురాలు కల్లూరి శైలజ ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు.

ఎన్నికల జాబితా నిర్వహణపై బీఎల్వోలకు శిక్షణ


శిక్షణలో పాల్గొన్న బీఎల్వోలు

కావలి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): భారత ఎన్నికల సంఘం, ఇండియా ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెమోక్రసీ, అండ్‌ఎలక్షన్ మేనేజ్‌మెంట్ ఆదేశాల మేరకు కావలి అసెంబ్లీ నియోజకవర్గం ఓటర్ల జాబితా నిర్వహణపై 45 మంది బీఎల్వోలకు తొలిరోజు సోమవారం కావలి ఆర్డీవో కార్యాలయ సమావేశ మందిరంలో శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి కావలి తహసీల్దార్ పీ.శ్రావణ్‌కుమార్ సర్టిఫికెట్లు అందచేశారు.

10న కరేడుకు సీపీఐ నేత రామకృష్ణ రాక

కందుకూరు, జూలై 7(ఆంధ్రజ్యోతి): సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ఈనెల 10వ తేదీన ఉలవపాడు మండలం కరేడుకు రానున్నట్లు ఆపార్టీ నాయకులు తెలిపారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో సోమవారం ఆపార్టీ రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీ.హనుమారెడ్డి, నెల్లూరు జిల్లా సహాయకార్యదర్శి పీ.మాలకొండయ్య తదితరులు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఇండోసోల్ కంపెనీ కోసం కరేడులో భూసేకరణకు జరుగుతున్న ప్రయత్నాన్ని రైతులు ముక్తకంఠంతో వ్యతిరేకిస్తూ పోరుబాట పట్టిన నేపథ్యంలో రైతులకు మద్దతుగా వారితో ముఖాముఖి నిర్వహించి వారి సమస్యలు తెలుసుకునేందుకు రామకృష్ణ వస్తున్నట్లు తెలిపారు. 8,400 ఎకరాల్లో మూడు పంటలు పండుతూ కరేడు చుట్టుపక్కల గ్రామాలన్నింటికీ అన్నం పెడుతున్న భూములను ఇండోసోల్ కంపెనీకి అప్పగించాలనే ప్రయత్నాన్ని విరమించుకోవాలని, లేనిపక్షంలో రైతులపక్షాన సీపీఐ ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తుందని తెలిపారు. సబ్ కలెక్టరు, భూసేకరణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టరు సమక్షంలో ఇండోసోల్ వద్దు మా భూములే మాకు ముద్దు అంటూ గ్రామస్థులు ఏకాభిప్రాయంతో నినాదాలు చేయటమే గాక మా భూములు ఇచ్చే ప్రశ్నేలేదని గ్రామసభలో ఏకగ్రీవంగా తీర్మానం చేసినప్పటికీ ప్రభుత్వం ఎలాంటి ప్రకటన చేయకుండా నిమ్మకునీరెత్తినట్లు ఉండటం శోచనీయమన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ కరేడులో పర్యటనకు రైతులంతా అందుబాటులో ఉండాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బూసి సురేష్‌బాబు, వీ.తిరుపతిరావు పాల్గొన్నారు.

కావలిలో సుపరిపాలనలో తొలి అడుగు


సుపరిపాలన కరపత్రాలు అందచేస్తున్న టీడీపీ నేతలు

కావలి, జూలై 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 3వ క్లస్టర్, 33వ వార్డులోని 65, 66 బూత్‌లలో సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా సోమవారం ప్రభుత్వ పథకాలకు సంబంధించిన కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేశారు. క్లస్టర్ ఇన్‌చార్జి గుంటుపల్లి రాజకుమార్ చౌదరి, కో ఇన్‌చార్జి తిరువీధి ప్రసాద్, వార్డు ఇన్‌చార్జి జ్వాలా సుబ్రహ్మణ్యం, మాజీ కౌన్సిలర్ అమరా వేదగిరిల ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను గురించి వివరిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బూత్‌కన్వీనర్లు పట్నం శివ, కంచర్ల కల్యాణచక్రవర్తి, గట్టం శ్రీను, భవనాసి వెంకటేశ్వర్లు, పానుగంటి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ దినోత్సవం



ఉలవపాడు : కరేడులో పీఎం మోదీ, సీఎం బాబు, మంద కృష్ణ ఫొటోలకు పాలభిషేకం చేస్తున్న ఎమార్పీఎస్ నాయకులు


బిట్రగుంట : వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నేత గోవిందరాజులు

ఉలవపాడు, జూలై 7(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మండలంలోని దళిత వాడల్లో ఎమ్మార్పీఎస్ శ్రేణులు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. కరేడు, ఉలవపాడు, మన్నేటికోట, భీమవరం, చాకిచర్ల గ్రామాల్లో జెండా ఆవిష్కరించారు. ఈ సందర్బంగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ పుట్టినరోజు వేడుకలు కోలాహలంగా నిర్వహించారు. ఉలవపాడు ప్రధాన రహదారిలో ఎమ్మార్పీఎస్ నాయకులు, శ్రేణులు ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. కరేడులో ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, మందకృష్ణ ఫొటోలకు పాలభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో గడ్డం నవీన్, కరేటి గోపాల్, సత్యం, శ్రీనివాసులు, గోపాల్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

● బిట్రగుంట : మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఏర్పడి 31 ఏళ్ల పూర్తిన రోజు కావడం, మాదిగ హక్కులను కాపాడేందుకు నడుం బిగించిన మంద కృష్ణమాదిగ పుట్టిన రోజు కావడం ఆనందదాయకమని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు గోచిపాతల వెంకటేశ్వర్లు మాదిగ అన్నారు. బోగోలు మండలం బేతనీపేట క్రీడామైదానంలో జెండా ఆవిష్కరణ బోగోలు టౌన్ ఎమ్మార్పీఎస్ నేతలు శ్యాంసుందర్, ఫిలోమెన్‌రాజ్, మర్లపాటిబాబుల ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా కేక్‌కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు టీ.ఇజ్రాయేల్, పీ.గోవిందరాజులు, సీహెచ్.రవి, జీ.సంజయ్, రాజన్న, శంకర్, పాపారావు, తదితరులు పాల్గొన్నారు.

దగదర్తిలో మండే మార్కెట్


కూరగాయలు, ఆకుకూరలు అమ్ముతున్న మహిళా రైతులు

దగదర్తి(బిట్రగుంట) జూలై 7(ఆంధ్రజ్యోతి): దగదర్తి ప్రభుత్వ వైద్యశాల ఆవరణంలో రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పండించిన ఆకుకూరలు, కూరగాయల విక్రయానికి మండే మార్కెట్ సోమవారం నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల్లో మహిళలు పండించిన వాటిని కొనుగోలు చేసేందుకు గ్రామస్థులే కాకుండా పలువురు ఉద్యోగులు ఆసక్తి చూపారు. ఈ సందర్భంగా మోడల్ మండల టీం లీడర్ హరిచందన మాట్లాడుతూ ఎటువంటి కెమికల్, పురుగు మందులు వాడకుండా ప్రకృతి ఎరువులతో పండించినవి తినడం ఆరోగ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సాధికార సంస్థ సభ్యులు, పలుగ్రామాలకు చెందిన మహిళా రైతులు తదితరులు పాల్గొన్నారు.


'కరేడు' జోలికొస్తే కూటమి కూలడం ఖాయం

- రైతుల తరపున ఐలూ న్యాయపోరాటం
- అమరావతి రైతులతో పెట్టుకొన్న వైసీపీ గతే కూటమి ప్రభుత్వానికి పడుతుంది
- కరేడు గ్రామ రైతులకు అండగా హైకోర్టున్యాయవాదులు
- ప్రజల పక్షాలన న్యాయపోరాటానికి సిద్ధం
- ఐలూ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర రాజేంద్రప్రసాద్

విజయవాడ లీగల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : కరేడు జోలికొస్తే కూటమి ప్రభుత్వం కూలిపోతుందని ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలూ) జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర రాజేంద్ర ప్రసాద్ అన్నారు. రైతుల పక్షాన తాము న్యాయపోరాటానికి సిద్ధంగా ఉన్నామని ఆయన ప్రకటించారు. కరేడు గ్రామంలోని రైతుల భూములలో దాగి ఉన్న ఖనిజ సంపద దోచుకోనేందుకే ప్రభుత్వం వేలాది ఎకరాలు కార్పొరేట్ కంపెనీలకు అప్పగించేందుకు సిద్ధంగా వుందన్న అనుమానంగా వుందని ఐలూ న్యాయవాదులు కూడా మండిపడుతున్నారు. ఆదివారం విజయవాడ, గుంటూరు, నెల్లూరుకు చెందిన దాదాపు 25 మంది ఐలూ న్యాయవాదుల బృందం కరేడు గ్రామానికి వెళ్లి రైతులతో మాట్లాడింది. సోమవారం విజయవాడలో ఐలూ న్యాయవాదులు 'ఆంధ్ర జ్యోతి' తో మాట్లాడారు. తదనంతర పరిణామాలపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. నెల్లూరు జిల్లా కందుకూరు మండలం కరేడు గ్రామంలోని దాదాపు 8,348 ఎకరాలు ప్రభుత్వం ఇండోసోల్ సోలార్ ప్రాజెక్టుకు కట్టబెట్టేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసిందని, ఇదే జరిగితే అమరావతి రైతులతో పెట్టుకొన్న వైసీపీకి పట్టిన గతే కూటమి ప్రభుత్వానికి కూడా పడుతుందని అన్నారు. ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో బంజరు, బీడు భూములనేకం వుండగా ఏడాదికి మూడు పంటలు పండే సశ్యశ్యామలమైన కరేడు గ్రామంలోని భూములను ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీకి కట్టబెట్టడం వెనుక భూములలో వుండే ఖనిజ సంపద దోచుకోనేందుకా అన్న అనుమానం కలుగుతోందన్నారు. ప్రజల పక్షాన ఐలూ న్యాయవాదులు నిలబడి న్యాయపోరాటం చేసేందుకు కూడా సిద్ధంగా వున్నట్లు సుంకర తెలిపారు. ఐలూ న్యాయవాదులు సంపర దుర్గా శ్రీనివాసరావు, బొమ్మసాని రవి. ఆలూరి సుధాకరరావు, సప్పా రమేష్‌కుమార్, సీవీ సుబ్రమణ్యేశ్వరరావు, వడ్లమూడి రామకృష్ణ తదితరులు మాట్లాడుతూ, రైతులు, తమతో మాట్లాడుతూ చావనైనా చస్తాం కానీ తమ భూముల్ని ప్రభుత్వానికి అప్పగించేది లేదని తేల్చిచెప్పారని తెలిపారు. కరేడు ప్రాంతంలో సశ్యశ్యామలమైన మూడు పంటలు అందించే భూములు న్నాయన్నారు. కరేడు గ్రామంలోని రైతులకు మూడు పంటలిచ్చే భూములే కావలనడం వెనుక ఏదో అంతరార్థం దాగి వున్నట్లు అనుమానంగా వుందన్నారు. తమ భూముల్లో ఖనిజ సంపద నిక్షిప్తమై వుందని, దానిని కొల్లగొట్టేందుకే ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు అప్పగించేందుకు సిద్ధమైందనే అనుమానాలు తలెత్తుతున్నాయని రైతులు తమ దృష్టికి తీసుకు వచ్చినట్టు తెలిపారు. ప్రభుత్వం ఇండోసోల్ సోలార్ కంపెనీకి తమ భూముల్ని కట్టబెట్టేందుకు ఇప్పటికే నోటిఫికేషన్ కూడా జారీ చేసిందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం ఇండోసోల్ కంపెనీకి భూమిని కేటాయించగా అప్పటి ప్రతిపక్షంలో వున్న ఇప్పటి పాలకపక్షం ఆ సంస్థ అప్పటి సీఎం జగన్ బినామీ సంస్థ అని, అది ఒక సూట్‌కేసు కంపెనీ అని దానిని తాము అధికారంలోకి వస్తే రద్దు చేస్తామని అప్పట్లో ప్రకటించిందని , కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గత ప్రభుత్వం కంటే ఎక్కువగా కరేడు గ్రామ భూములను గుర్తించి వాటిని ఇండోసోల్ కంపెనీకి ధారాదత్తం చేసేందుకు ప్రయత్నిస్తోందని రైతులు తమకు తెలిపారన్నారు. ప్రభుత్వం ఈ ప్రతిపాదన విరమించేంత వరకు తమ పోరాటం ఆగదని రైతులు చెబుతున్నారని, వారికి మద్దతుగా తాము కూడా వారి పక్షాన నిలబడి వారికి ఉచితంగా న్యాయసహాయం అందించేందుకు కూడా సిద్ధంగా వున్నట్లు ఐలూ న్యాయవాదులు చెప్పారు.. రైతులను హింసించిన ప్రభుత్వం బాగున్నట్లు చరిత్రలో లేదని, అమరావతి రైతుల ఉసురు పోసుకున్న గత ప్రభుత్వానికి పట్టిన గతే కూటమి ప్రభుత్వానికి కూడా పడుతుందని న్యాయవాదులు మండిపడ్డారు. సామాజిక సమస్యలపై పోరాటాలు చేస్తూ సమాజంలో అట్టడుగు వర్గాలు, మహిళలు ఎదుర్కొనే సమస్యల పరిష్కారానికి వారి గొంతుకై ఐలూ ప్రశ్నిస్తుందని, వారికి అండగా ఉంటామని న్యాయవాదులు చెప్పారు.


కరేడు రైతులతో మాట్లాడుతున్న సుంకర రాజేంద్రప్రసాద్ తదితరులు (ఫైల్)






మృతిచెందిన భిక్షగాడు - గాయపడిన కల్పన, సుబ్రహ్మణ్యం - నిందితుడి వద్ద దొరికిన కత్తులు

సైకో కలకలం

దాడిలో భిక్షగాడి మృతి.. మరో ఇద్దరికి గాయాలు

- తిరుపతిలో పెరిగిపోతున్న మతిస్థిమితం లేని వ్యక్తులు
- స్థానికులు, భక్తుల్లో ఆందోళన



సైకోను తీసుకెళుతున్న పోలీసులు

వాళ్లలో వాళ్లే మాట్లాడుకుంటూ ఉంటారు. జనం గుమికూడిన చోటికి వచ్చి బూతులతో తిడుతుంటారు. కుక్క లేదా ఏదైనా జంతువు కనిపిస్తే రోడ్డుపైకి రాళ్లు విసురుతారు. ఆ రాయి ఎక్కడ తగులుతుందోనని జనం, వాహనదారుల్లో ఆందోళన వ్యక్తమవుతుంటుంది. పిచ్చోళ్లలా ఉంటూ చేతిలో పెద్ద కర్రతో తిరిగే వారిని చూసి భయపడుతుంటారు. ఇలాంటి వారు తిరుపతి నగరంలో ఎక్కువవుతున్నారు. సోమవారం నాటి ఘటనతో ఆధ్యాత్మిక క్షేత్రంలో కలకలం రేగింది.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

కుటుంబంలో అనాదరణకు గురైన వారు. పక్కరాష్ట్రాలు, జిల్లాల్లోని కొందరు యాచకులు. మతిస్థిమితం లేని వారు. వీరందరికీ ప్రముఖ పుణ్యక్షేత్రమైన తిరుపతి కేరాఫ్‌గా మారుతోంది. ఇలా వచ్చిన వారిలో కొందరి విపరీత పోకడలు స్థానికులు, భక్తులను ఇబ్బందులకు గురిచేస్తోంది. మాసిన ముఖం...పెరిగిన గడ్డం...చిరిగిన దుస్తులు ధరించి వీరు ఇటీవల తుడా సర్కిల్, లీలామహల్ రోడ్డు, మంగళం రోడ్డు, తిలక్ రోడ్డు, నంది సర్కిల్, అన్నారావు సర్కిల్, కపిలతీర్థం, గోవిందరాజ స్వామి ఆలయం, బస్టాండు, రైల్వే స్టేషన్ రోడ్డు, బాలాజీ కాలనీ, అలిపిరి రోడ్డు తదితర ప్రాంతాల్లో ఎక్కువగా సంచరిస్తున్నారు. ఎవరైనా వీరిలో కొందరి జోలికి వెళ్లినా, వారిని పలకరించినా వెంటనే కర్రలు, కత్తులతో దాడులకు దిగుతున్నారు. కొన్ని సర్కిళ్లలో వాహనదారులకు అడ్డండపడి భిక్షాటన చేస్తూ ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించేలా ప్రవర్తిస్తున్నారు. ఇక, ఓ మహిళ భిక్షాటన సమయంలో ఎవరైనా డబ్బులు ఇవ్వకుంటే వారిని నానా బూతులతో తిడుతుంది. ఇప్పటి వరకు అందిన సమాచారం మేరకు తిరుపతిలో 60 నుంచి 70 మంది వరకు భిక్షగాళ్ళు మతిస్థిమితం కోల్పోయిన వారు ఉన్నట్లు సమాచారం. ఈ మతిస్థిమితం కోల్పోయిన వారే ప్రవర్తనే కొన్ని సమయాల్లో సైకోల్లా ఉంటుంది. ఇలాంటి వారి ప్రవర్తనపై నిఘా ఉంచి.. వీరిని మానసిక వికలాంగుల ఆస్పత్రికి తీసుకెళ్లి చేర్పించాల్సిన పోలీసులు, మున్సిపల్ అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఇవీ ఘటనలు

- 15 రోజుల క్రితం తుడా సర్కిల్ వద్ద ఉదయం సమయంలో దినసరి కూలీగా పనిచేస్తున్న రామస్వామిపై ఓ యాచకుడు దాడి చేశాడు. ఈ ఘటనలో అతను స్వల్పంగా గాయపడ్డారు.
- లీలామహల్ సర్కిల్ వద్ద ఫుట్‌పాత్‌పై భోజనం చేస్తున్న ఇద్దరు మహిళల వద్దకు వెళ్లిన ఒక మతిస్థిమితం కోల్పోయిన వ్యక్తి అన్నం పెట్టాలని అడిగాడు. వారు లేదని చెప్పడంతో తన చేతిలో ఉన్న కర్రతో కొట్టాడు. దీంతో ఒక మహిళ గాయపడింది.
- మూడు నెలల క్రితం లీలామహల్ నుంచి శివజ్యోతినగర్ వైపు నడచి వెళుతున్న ఒక యువతి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఆ సమయంలో ఇద్దరు యువకులు అడ్డం పడ్డారు.

వలేసి సైకోను పట్టుకుని..



సమాచారం తెలిసిన వెంటనే అలిపిరి పోలీసులు అప్రమత్తమయ్యారు. భిక్షగాడిని హతమార్చిన సైకోను పట్టుకోవడానికి నానా తంటాలు పడ్డారు. మున్సిపల్ ఆరోగ్య శాఖ అధికారి సమక్షంలో సిబ్బంది, అలిపిరి ఎస్ఐ లోకేష్ బాబు, స్థానికులతో కలిసి వలవేసి పట్టుకున్నారు. అలిపిరి పోలీసు స్టేషన్‌కు తరలించారు. అతడి బ్యాగులో కత్తులు, కర్రలను సీజ్ చేశారు. నిందితుడిపై లునటిక్ యాక్టు కింద కేసు నమోదు చేశారు. వైద్య పరీక్షల నిమిత్తం మంగళవారం రుయాకు తీసుకెళ్ళి కోర్టు ఎదుట హాజరుపరచి న్యాయమూర్తి ఆదేశాలతో వైజాగ్‌లోని పిచ్చాసుపత్రికి తరలిస్తామని అలిపిరి సీఐ రాంకిషోర్ ఆంధ్రజ్యోతికి చెప్పారు.

తాజా ఘటనతో కలవరం

చాలామందిలాగే తమిళనాడు నుంచి తిరుపతికి చేరిన ఓ మతి స్థిమితంలేని వ్యక్తి.. సోమవారం ఉదయం 7.15 గంటల ప్రాంతంలో నంది సర్కిల్ వద్ద వీరంగం చేశాడు. భిక్షగాడు శేఖర్‌తో గొడవకు దిగి తన చేతిలో ఉన్న కర్ర, కత్తితో తలపై మోదాడు. అడ్డొచ్చిన భిక్షగత్తె కల్పనను.. పార్కింగ్ ఫీజు వసూలు చేస్తున్న తారకరామానగర్‌కు చెందిన సుబ్రమ్మణ్యంపైనా దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన శేఖర్ మృతిచెందగా, మిగిలిన ఇద్దరు చికిత్స పొందుతున్నారు. ఈ ఘటన స్థానికులు, భక్తులను కలవరపాటుకు గురిచేసింది.

ప్రతి అర్జీకి సమాధానమివ్వండి



పీజీఆర్ఎస్‌కు వచ్చే ప్రతి అర్జీకి సమాధానం ఇవ్వాలని మంత్రి అనగాని సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్ ఆయన కలెక్టర్‌తో కలిసి వినతులు స్వీకరించారు. వేదిక కింద ఉన్న దివ్యాంగుల వద్దకు వెళ్లి నేలపై కూర్చుని వారి సమస్యలు తెలుసుకున్నారు.

- 6లో

అభివృద్ధిలో జిల్లాను మొదట నిలుపుదాం

- ఐదు రంగాల్లో వనరులు, అవకాశాలను అందిపుచ్చుకోవాలి
- బంగారు కుటుంబాల అభివృద్ధికి శ్రద్ధ చూపాలి
- ప్రజాప్రతినిధులు, అధికారులకు ఇంఛార్జి మంత్రి పిలుపు

- 6లో




ప్రభుత్వాస్పత్రి అత్యవసర విభాగం వద్ద కర్రలు, రాళ్లతో దాడి చేస్తున్న యువకులు - అత్యవసర విభాగం వద్ద ధ్వంసమైన రెండు ద్విచక్ర వాహనాలు

రణరంగం

ధర్మరాజస్వామి ఉత్సవాల్లో ఇరువర్గాల మధ్య ఘర్షణ

- అనంతరం శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రిలో భీకర దాడులు
- పరుగులు తీసిన రోగులు

శ్రీకాళహస్తి, జూలై 7(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ఆదివారం అర్ధరాత్రి ఇరువర్గాల మధ్య దాడులు.. వీధి పోరాటాన్ని తలపించింది. సిబ్బంది ప్రాణరక్షణ కోసం గదిలోకి వెళ్లి దాక్కోవాల్సి వచ్చింది. రోగులు, వారి సంబంధీకులు ఏం జరుగుతుందో అర్థం కాక పరుగులు తీశారు. ఈ రణరంగం ఎందుకు జరిగిందంటే... ద్రౌపది సమేత ధర్మరాజస్వామి ఆలయం వద్ద ఆదివారం రాత్రి అగ్నిగుండం తర్వాత జరిగిన కురుక్షేత్ర సంగ్రామం (యుద్ధపర్వం) ఘట్టం జరుగుతోంది. ఆ ఉత్సవ సమయంలో ఆలయం వెనుక.. తొట్టంబేడు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట పట్టణానికి చెందిన రోహిత్, ధనుష్ ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళుతున్నారు. అదే సమయంలో భాను, కిరణ్, చరణ్ ధర్మరాజస్వామి ఆలయం వైపు వెళుతుండగా వారితో వాగ్వాదం జరిగి ఘర్షణకు దారి తీసింది. రోహిత్, ధనుష్ కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారి కుటుంబసభ్యులైన మునిరత్నం, సుధాకర్, మునిరాజా గాయపడిన రోహిత్, ధనుష్‌ను చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాసేపటికి భాను తన ఇద్దరు సోదరులతో పాటు మరి కొంత మందిని వెంటబెట్టుకుని ఆస్పత్రికి వెళ్లారు. ఇరువర్గాలు కత్తులు, దుడ్డుకర్రలు, రాళ్లతో ఒకరిపై ఒకరు విరుచకపడ్డారు. కొందరు ప్రాణభయంతో తప్పించుకునే క్రమంలో కాన్పుల రూంలోకి చొరబడ్డారు. అక్కడ బాలింతలు, గర్భిణులు, నవజాత శిశువులు ఉన్నారు. ఆస్పత్రిలో రోగులంతా వణికిపోయారు. అక్కడే సమీపంలోనే నర్సింగ్‌స్టేషన్‌లో ఉన్న స్టాఫ్‌నర్సులు ప్రాణభయంతో గదిలోకి వెళ్లి తలుపులు వేసుకున్నారు కొందరు సెలైన్ స్టాండ్లతోనూ దాడికి దిగారు. ఆస్పత్రి సిబ్బంది సమాచారంతో శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి, తన సిబ్బందితో ఆస్పత్రికి చేరుకున్నారు. ఇరువర్గాలు గాయాలతో రక్తస్రావం జరుగుతున్నా పోరు తగ్గలేదు. డీఎస్పీ చొరవతో అల్లరి మూకలను అదుపు చేశారు. ఇదే వైద్యశాలలో చికిత్సలందిస్తే మళ్లీ దాడులకు దిగుతారని భావించి.. మునిరత్నం, సుధాకర్, మునిరాజాను





ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. రెండేళ్ల కిందట కూడా ఈ రెండు ప్రాంతాల మధ్య ఆస్పత్రి వద్ద జరిగిన దాడుల నేపథ్యంలో వీటిపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఆస్పత్రి యంత్రాంగం స్పందనేదీ?

అందుబాటులో ఉండాల్సిన ఆస్పత్రి సూపరింటెండెంట్ మణి, ఇన్‌చార్జి ఆర్ఎంవో మురళీకృష్ణ తిరుపతిలో నివాసం. నర్సింగ్ సూపరింటెండెంట్ పోస్టు ఖాళీ. ఆ తరువాత స్థానంలోని ముగ్గురు హెడ్‌నర్సులు ఉండేదీ తిరుపతిలోనే. అర్ధరాత్రి ఒంటి గంటకు ఇంత పెద్ద ఘటన జరిగితే సోమవారం ఉదయం ఆస్పత్రికి వచ్చారు. సీసీ కెమెరాల్లోని గొడవ దృశ్యాలను సెల్‌ఫోన్‌లో రికార్డు చేసి.. పోలీసుల వైఫల్యంగా చూపేలా సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేయించారన్న విమర్శలున్నాయి. ఇంత బీభత్సంపై నిరసన తెలపలేదు. కనీసం అవుట్ పోస్టు కావాలని పోలీసు అధికారులకు విజ్ఞప్తి కూడా చేయకపోవడం గమనార్హం.

ఇప్పుడొచ్చి చేసేదేమిటి జగన్?



ముగుస్తున్న మామిడి సీజన్

- ఇప్పటికే 2.42 లక్షల టన్నుల కొనుగోళ్లు
- 15 రోజుల్లో మిగిలిన కాయల అమ్మకాలు

మామిడి సీజన్ రెండు వారాల్లో ముగియనుంది. కష్టకాలమంతా వదిలేసి, ఆఖరి రోజుల్లో మామిడి రైతు కన్నీళ్లు తుడవడానికంటూ వైసీపీ అధినేత జగన్.. చిత్తూరు జిల్లా పర్యటనకు వస్తుండడం పట్ల అంతా విస్మయం వ్యక్తం చేస్తున్నారు. 9న ఆయన బంగారుపాళ్యంలోని ఒక మామిడికాయల మండీని సందర్శించనున్నారు. నిజానికి గుజ్జు పరిశ్రమలు మామిడి కాయలు కొనుగోలు చేయడానికి సుముఖంగా లేని రోజుల్లో రైతులు అల్లాడిపోయారు. చంద్రబాబు చొరవతో రాష్ట్ర ప్రభుత్వం నాలుగు రూపాయల సబ్సిడీ ప్రకటించాకే పరిశ్రమల్లో కొనుగోళ్లు మొదలయ్యాయి. దీంతో మామిడిలోడ్లతో ట్రాక్టర్లు బారులు తీరాయి. ఈ కాలమంతా ప్రకటనలకే పరిమితం అయిన మాజీ సీఎం జగన్‌రెడ్డి సీజన్ ముగిసే సమయానికి వచ్చి ఓదార్చడం వల్ల రైతులకు ఏమి ప్రయోజనం ఉంటుందనే చర్చ జరుగుతోంది.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

ఫ్యాక్టరీల్లో, ర్యాంపుల్లో కలిపి ఇప్పటికే 2.42 లక్షల టన్నుల మామిడి కాయల్ని కొనుగోలు చేశారు. 1.48 లక్షల టన్నుల కాయలు ఇంకా పొలాల్లో ఉన్నాయని అంచనా. రెండు వారాల్లో మొత్తం కొనుగోళ్ల ప్రక్రియ పూర్తవుతుందని అధికారులు చెబుతున్నారు. ఇక తిరుపతి, అన్నమయ్య జిల్లాలతో పోల్చుకుంటే చిత్తూరు జిల్లాలోనే మామిడి అధికం. చిత్తూరు జిల్లాలో ఈ మామిడి ప్రాసెసింగ్ ప్రక్రియ ఇంకా రెండు వారాలకు సైబడి ఉండేలా కాయలు మిగిలి ఉన్నాయి. అన్నమయ్య జిల్లాలో ఇప్పటికే ప్రక్రియ పూర్తయింది. తిరుపతి జిల్లాలో నాలుగైదు రోజులు ఉండే అవకాశం ఉంది. చిత్తూరు జిల్లాలో ఈసారి 5 లక్షల టన్నుల తోతాపురి దిగుబడి వచ్చినట్లు అంచనా. ఇందులో సీజన్ ప్రారంభంలోనే పచ్చళ్ల కోసం కొన్ని మామిడి కాయలు అమ్ముడైపోయాయి. అలాగే కలర్ తోతాపురిని మంచి ధరలకు బయట అమ్ముకున్నారు. పచ్చళ్లకు, కలర్ కాయలు కలిపి 40వేల టన్నులు అమ్ముడయ్యాయి. 1.76 లక్షల టన్నుల కాయల్ని ఆయా ఫ్యాక్టరీలు కొనుగోలు చేయగా.. కిలోకు రూ.5 నుంచి రూ.6 మధ్యలో ఫ్యాక్టరీలు రైతులకు ఇచ్చాయి.

తోతాపురి అమ్మకాలు ఇలా...

జిల్లా	మొత్తం సేకరణ (టన్నుల్లో..)	ఫ్యాక్టరీల్లో (టన్నుల్లో..)	ర్యాంపులు (టన్నుల్లో..)
చిత్తూరు	2.42 లక్షలు	1.76 లక్షలు	66 వేలు
తిరుపతి	62 వేలు	41వేలు	21 వేలు
అన్నమయ్య	16 వేలు	15వేలు	వెయ్యి

బయటి ప్రాంతాల ర్యాంపులకు తరలింపు

జిల్లాలోని ర్యాంపులు రూ.2, రూ.3 మాత్రమే ఇస్తున్న సమయంలో రైతులు కృష్ణగిరి వంటి బయటి ప్రాంతాల్లోని ర్యాంపులకు కాయలు తరలించారు. ఇలా 66వేల టన్నుల కాయల్ని బయటి ప్రాంతాల ర్యాంపుల్లో అమ్ముకున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

70వేల టన్నుల కాయల వేస్టేజ్

సుమారు 70వేల టన్నుల కాయలు తొందరపాటు/ఆలస్యంగా కోత వల్ల, కుళ్లిపోవడం వల్ల పాడైపోయాయి. ప్రతి సంవత్సరం వచ్చిన దిగుబడిలో 10 నుంచి 12 శాతం మధ్యలో ఇలాంటి వేస్టేజ్ ఉంటుంది. ఈసారి దిగుబడి అధికంగా ఉండడంతో వేస్టేజ్ కూడా ఎక్కువగా ఉంది. ఇక మిగిలిన 1.48 లక్షల టన్నుల కాయల్ని ప్రాసెసింగ్ చేస్తున్నారు. సుమారు రెండు వారాల్లో ప్రాసెసింగ్ ప్రక్రియ పూర్తవుతుందని తెలుస్తోంది.

క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు క్రీడలు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లాలోని వైఎస్ఆర్ క్రీడా పాఠశాలలో 4, 5వ తరగతులప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎస్‌డీవో బాలాజి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 11వ తేదీలోపు https://apsportsschool.ap.gov.in/ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. నాల్గవ తరగతికి బాలురు 20, బాలికలు 20 మొత్తం 40, 5వ తరగతికి బాలురకు 20, బాలికలకు 20 చొప్పున 40 సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. ఇతర వివరాలకు పైనున్న వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

శ్రీవారి సేవలో తమిళనాడు గవర్నర్


తమిళనాడు గవర్నర్‌కు జ్ఞాపిక అందజేస్తున్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు

తిరుమల, జూలై 7 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు గవర్నర్ రవీంద్ర నారాయణన్ రవి సోమవారం ఉదయం బ్రేక్ సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అలాగే మాజీ డీజీపీ ఆర్పీ ఠాకూర్, ఇండియన్ మిలటరీ అధికారి పరమవీర్‌చక్ర అవార్డు గ్రహీత యోగేంద్ర సింగ్ యాదవ్ కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.


ఆర్పీ ఠాకూర్


యోగేంద్ర సింగ్ యాదవ్

సర్వదర్శనానికి 12 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 2 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.4.39 కోట్లు
ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 88,938
తలనీలాలు సమర్పించినవారు: 28,548

67,988 టన్నుల తోతాపురి కొనుగోలు

- **10,046 మంది మమిడి రైతులకు ప్రయోజనం**
- **చివరి పంట వరకూ రాయితీ అందిస్తామన్న కలెక్టర్**

తిరుపతి(కలెక్టరేట్), జూలై 7(ఆంధ్రజ్యోతి): 'జిల్లాలో ఈనెల నాటికి 67,988 టన్నుల తోతాపురి రకం మామిడి కాయలు కొనుగోలు అయ్యాయి. వీటిలో 45,338 టన్నులను మామిడిగుజ్జు పరిశ్రమలు సేకరించగా, మిగిలిన 22,650 టన్నులను ర్యాంపులు, మండీల్లో విక్రయించారు. తద్వారా 10,046మంది రైతులకు ప్రయోజనం చేకూరింది' అని కలెక్టర్ వెంకటేశ్వర్ సోమవారం వివరించారు. మామిడి రైతులను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటోందన్నారు. తోతాపురి మామిడి సేకరణ ప్రక్రియను జిల్లా యంత్రాంగం నిరంతరం పర్యవేక్షిస్తోందన్నారు. నిర్దేశిత ధరకు కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. మామిడి గుజ్జు పరిశ్రమల వద్ద క్యూలైన్లలో వేచి ఉన్న ట్రాక్టర్లు, ట్రక్కుల డ్రైవర్లు, రైతులకు ప్రత్యేక గదులు ఏర్పాటు చేసి సౌకర్యాలు కల్పించామన్నారు. తోతాపురి మామిడి సేకరణ కోసం బ్యాంకులు 20 ప్రాసెసింగ్ యూనిట్లకు టాప్ ఆప్ మొత్తాన్ని ఇచ్చాయని, రైతులు తమ మొత్తం దిగుబడిని అమ్మవచ్చని తెలిపారు. చివరి పంట వరకూ ప్రభుత్వం తరపున రైతులకు రూ.4సబ్సిడీ ఇస్తామన్నారు. లీజుకు తీసుకున్న రైతులకూ ఇది వర్తిస్తుందన్నారు. ఆగస్టు నెలాఖరు వరకు తోతాపురి మామిడి కొనుగోలు జరుగుతుందని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 80వేల హెక్టార్లలో తోతాపురి మామిడి సాగులో ఉండగా, తిరుపతి జిల్లాలో 14,582 హెక్టార్ల విస్తీర్ణంలో 1.5లక్షల టన్నుల తోతాపురి ఉత్పత్తి ఉంటుందన్నారు. తోతాపురి మామిడి కిలో రూ.12 ధర నిర్ణయించడం జరిగింది. మామిడిగుజ్జు పరిశ్రమలు రూ.8, ప్రభుత్వం రూ.4 అందజేయడం జరుగుతుందన్నారు.

గోవిందరాజస్వామి ఆలయంలో కవచ ప్రతిష్ఠ



తిరుపతి అర్బన్, జూలై 7(ఆంధ్రజ్యోతి): గోవిందరాజస్వామి ఆలయంలో జ్యేష్టాభిషేకంలో భాగంగా రెండో రోజైన సోమవారం కవచ ప్రతిష్ఠ క్రతువు వేడుకగా జరిగింది. ఉదయం శతకలశ స్నపనం, మహాశాంతిహోమం చేపట్టారు. ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం, సమర్పణ, ఆరగింపు, అనుగ్రహం వంటి కైంకర్యాలను నిర్వహించారు. సాయంత్రం ఉత్సవర్లు తిరుచ్చిపై మాడవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఈ కార్యక్రమంలో పెద్దజియ్యంగార్, చిన్నజియ్యంగార్, ఆలయ డిప్యూటీఈవో శాంతి, ఏఈవో మునికృష్ణ తదితరులు పాల్గొన్నారు.


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న మంత్రి సత్యప్రసాద్

మా భూమిని వేరేవారు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు..



'సార్! నా పేరు భారతి. తిరుపతి ఐఎస్ మహల్ వద్ద ఉంటున్నాం. నా భర్త ఆనంద్ 2023 జనవరిలో ప్రమాదవశాత్తు మరణించారు. ముగ్గురు పిల్లలున్నారు. ఎలాంటి ఆదాయమూ లేదు. తిరుపతి రూరల్ మండలం చిగురువాడ ఉత్తరపుకండ్రిగ వద్ద ప్లాట్ ఉంది. నా భర్త మరణించిన 4వ రోజే వేరే వ్యక్తి ఆ ప్లాట్‌ను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు' అని మంత్రి దృష్టికి తెచ్చింది. ఇదే విషయాన్ని గతంలో మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్లగా రిజిస్ట్రేషన్ రద్దు చేసి న్యాయం చేయాలని ఆదేశించారని గుర్తు చేశారు. స్పందించిన మంత్రి జిల్లా రిజిస్ట్రేషన్ అధికారులను పిలిచి సమస్యను వెంటనే పరిష్కరించి, బాధితురాలికి న్యాయం చేయాలని ఆదేశించారు.

ప్రతి అర్జీకీ సమాధానమివ్వండి

పీజీఆర్ఎస్ ప్రజా సమస్యల పరిష్కారం కోసమేనన్న అనగాని - కలెక్టరేట్‌లో వినతులు స్వీకరించిన మంత్రి

తిరుపతి (కలెక్టరేట్), జూలై 7 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలు పరిష్కరించడానికే పీజీఆర్ఎస్ ఉందని, ఇందులో వచ్చే ప్రతి అర్జీకి సమాధానం ఇవ్వాలని రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్లు, స్టాంపుల శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం డిస్ట్రిక్ట్ విజన్ యాక్షన్ ప్లాన్, పీ4పై సమీక్షించడానికి అనగాని సత్యప్రసాద్ జిల్లా అధికారులతో సమీక్షించడానికి విచ్చేశారు. పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేయడానికి వచ్చిన ప్రజలు ఒక్కొక్కరికిగా తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకురావడంతో కలెక్టర్ వెంకటేశ్వర్‌తో కలిసి నేరుగా వినతులను స్వీకరించారు. స్టేజ్ కిందనే కూర్చుని ఉన్న దివ్యాంగులతో నేలపై కూర్చుని వారి సమస్యలు తెలుసుకున్నారు. సహాయ పరికరాలు ఇవ్వలేదని, నిరుపేదలైన దివ్యాంగులకు ప్రభుత్వం షాపింగ్ కాంప్లెక్సుల్లో కొన్ని గదులు కేటాయించి జీవనోపాధి కల్పించాలని, త్రీవీలర్ బ్యాటరీ సైకిళ్లు, ఇంటి స్థలాలు ఇవ్వాలని పీడబ్ల్యూడీ ఫెడరేషన్ నాయకులు సుబ్రహ్మణ్యం, మస్తాన్ సాహెబ్ మంత్రి దృష్టికి తీసుకురావడంతో ఆయన సానుకూలంగా స్పందించారు. సమస్యలు వెంటనే పరిష్కరించాలని పక్కనే ఉన్న కలెక్టర్‌ను ఆదేశించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 284 అర్జీలు అందాయి. అందులో అత్యధికంగా 149 రెవెన్యూకు సంబంధించినవే ఉన్నాయి. జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, నగరపాలక సంస్థ కమిషనర్‌ మౌర్య, డీఆర్వో నరసింహులు, ఎస్‌డీసీలు దేవేంద్రరెడ్డి, రోష్మాండ్, ఆర్డీవోలు భానుప్రకాష్‌రెడ్డి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.



పెరుమాళ్లపల్లెను ప్రత్యేక రెవెన్యూ గ్రామంగా ఏర్పాటు చేయాలి

తిరుపతి రూరల్ మండలం పెరుమాళ్లపల్లె గ్రామాన్ని ప్రత్యేక రెవెన్యూ గ్రామంగా విభజించాలని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానితో కలిసి టీడీపీ మండలాధ్యక్షుడు ఈశ్వరరెడ్డి, గ్రామస్థులు మంత్రిని కోరారు. పెరుగుతున్న జనాభా, భౌగోళిక విస్తీర్ణం కారణంగా ప్రత్యేక రెవెన్యూ గ్రామంగా ఏర్పాటు చేసి, సర్వే నంబర్లు కూడా విభజించాలన్నారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించారు.

నా ఇంటి స్థలం కబ్జా చేశారు



బెంగళూరులో ఉన్న కుమార్తె ఇంటికి పోయి వచ్చే లోపు నా ఇంటి జాగాను గ్రామానికి చెందిన లీలావతి కుటుంబీకులు ఆక్రమించారు. పోలీసులకు ఫిర్యాదు చేస్తే వారు కూడా కూడా ఆక్రమించిన కుటుంబానికే అండగా నిలుస్తున్నారు. నిరుపేద దళితురాలినైన నన్ను బెదిరిస్తున్నారు. న్యాయం చేయండి.

- తలారి రాజేశ్వరి, కొంగరవారిపల్లె, చంద్రగిరి మండలం

పింఛను ఇప్పించండి



అయ్యా! కూలి పనులు చేసుకుని జీవనం సాగించేవాడిని. ఏడు నెలల క్రితం పక్షవాతంతో కాళ్లు, చెయ్యి పడిపోయాయి. కుటుంబ పోషణ కష్టంగా మారింది. పింఛను ఇచ్చి ఆదుకోండి.

- డి.అయ్యర్, తిరుపతి రూరల్

అభివృద్ధిలో జిల్లాను మొదట నిలుపుదాం

ఐదు రంగాల్లో వనరులు, అవకాశాలను అందిపుచ్చుకోవాలి

బంగారు కుటుంబాల అభివృద్ధికి శ్రద్ధ చూపాలి ● ప్రజాప్రతినిధులు, అధికారులకు ఇంఛార్జి మంత్రి పిలుపు


ఎమ్మెల్యేలు, అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి అనగాని

తిరుపతి, జూలై7(ఆంధ్రజ్యోతి): అభివృద్ధిలో జిల్లాను మొదటి స్థానంలో నిలపడానికి ఐదు ప్రధాన రంగాల్లోని వనరులను, అవకాశాలను అందిపుచ్చుకోవాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పిలుపునిచ్చారు. తిరుపతి కలెక్టరేట్‌లో సోమవారం మధ్యాహ్నం జరిగిన జిల్లా విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ సమావేశంలో పీ4 సర్వే, బంగారు కుటుంబాల అభివృద్ధి తదితర అంశాలపై ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్షించారు. 'జిల్లాలో పీ4 సర్వేలో 80,331 బంగారు కుటుంబాలను గుర్తించాం. ఇప్పటి వరకూ ఐదు మంది దాతలు 1911 కుటుంబాలను దత్తత తీసుకునేందుకు అంగీకరించారు' అని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ వెంకటేశ్వర్ వివరించారు. 'సీఎం చంద్రబాబు రూపొందించిన విజన్ 2047 డాక్యుమెంట్‌లో భాగంగా 2029 నాటికి జిల్లాను ఎంత వరకూ అభివృద్ధి పరచగలమో ఆలోచించండి. విజన్ యాక్షన్‌ప్లాన్ ద్వారా చరిత్రలో తొలిసారి ఎమ్మెల్యేలకు నియోజకవర్గ స్థాయిలో కార్యాలయాలు ఏర్పాటవుతున్నాయి' అని మంత్రి అనగాని వివరించారు. తిరుపతిలో పేదలు నిర్మించుకున్న ఇళ్లకు జీవో 30 అమలు చేసేలా స్పెషల్ డ్రైవ్ పెట్టాలని మంత్రి అనగాని సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి, ఏపీ హస్తకళల అకాడమీ ఛైర్మన్ పసుపులేటి హరిప్రసాద్, టీడీపీ మీడియా కో ఆర్డినేటర్ శ్రీధర్ వర్మ, రాష్ట్ర అధికార ప్రతినిధి కోడూరు బాలసుబ్రమణ్యం, జేసీ శుభం బన్సాల్, కమిషనర్ మౌర్య, ట్రైనీ కలెక్టర్ రఘువంశీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు పలు అంశాలు ప్రస్తావించగా, మంత్రి, కలెక్టర్ స్పష్టత ఇచ్చారు.

సీఎస్ఆర్ నిధుల వ్యయంలో పారదర్శకత ఏదీ?

'శ్రీకాళహస్తి నియోజకవర్గంలో పరిశ్రమలు ఎక్కువ ఉన్నాయి.సీఎస్ఆర్‌కింద ఎన్ని నిధులు ఇస్తున్నాయి? ఎక్కడ ఖర్చు చేస్తున్నారనే అంశంలో పారదర్శకత ఉండటంలేదు. ఆవివరాలు ఆన్‌లైన్‌లో పెట్టాలి. కొంత శాతాన్ని స్థానిక నియోజకవర్గంలో ఖర్చు చేయాలి'అని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి కోరగా, మంత్రి సానుకూలంగా స్పందించారు.

బంగారు కుటుంబాల జాబితా ఇవ్వండి

'పీ4 సర్వే ద్వారా గుర్తించిన బంగారు కుటుంబాల జాబితా ఎమ్మెల్యేలకు ఇవ్వాలి. పరిశ్రమలు సీఎస్ఆర్ కింద ఇస్తున్న నిధుల వివరాలు ఇవ్వడంతో పాటు యజమానులతో సమావేశం ఏర్పాటు చేస్తే బాగుంటుంది' అని ఎమ్మెల్యే సునీల్ కుమార్ అభిప్రాయపడ్డారు.

సీఎస్ఆర్ నిధులతో రోడ్లు బాగు చేయాలి

'శ్రీసిటీలో 220.. వెలుపల అపోలో, హీరో, క్రాఫికార్న్ వంటి పరిశ్రమలూ ఉన్నాయి. సీఎస్ఆర్ నిధులతో నియోజకవర్గంలోని రోడ్లు బాగు చేయాలి. పర్యాటక ప్రాంతాల్ని అభివృద్ధి పరచాలి. మోటర్ బైక్ ఉంటే బంగారు కుటుంబాల జాబితా నుంచి తొలగించడం సరికాదు' అని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు.

పరిశ్రమల ఏర్పాటుకు చొరవ చూపండి

'వెంకటగిరి నియోజకవర్గంలో భూములున్నా పారిశ్రామిక వాడలు ఏర్పాటు కాలేదు. దీనిపై చొరవ చూపాలి. ప్రత్యామ్నాయంగా పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి పరచాలి' అని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ కోరారు.

టెంపుల్ టూరిజంపై దృష్టి పెట్టాలి

'తిరుపతిలో పరిశ్రమలు, వ్యవసాయం, ఐటీ కంపెనీలూ లేవు. ఉన్నదల్లా సర్వీస్ సెక్టర్ మాత్రమే. టెంపుల్ టూరిజం అభివృద్ధి పరచాలి. దానికి కమిటీ వేసి నిపుణులను నియమించాలి' అని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కోరారు.

పారిశుధ్యం అధ్వానం

'తిరుపతిలో పారిశుధ్యం అధ్వాన్నంగా ఉంది.. ప్రజల ఆరోగ్యం దెబ్బతినేలా వుంది. వీధుల్లో రోడ్లు, డ్రైన్లు సక్రమంగా లేవు. ప్రత్యేక నిధులు కేటాయించి పరిస్థితిని మెరుగుపరచాలి' అని ఏపీజీబీసీ ఛైర్‌పర్సన్ సుగుణమ్మ విజ్ఞప్తి చేశారు.

ఇళ్లను క్రమబద్ధీకరిస్తే రూ. 400 కోట్లు

'తిరుపతి రూరల్ మండలంలో మఠం భూములను కొని 30 ఏళ్ళ కిందట ఇళ్ళు కట్టుకున్నారు. ప్రభుత్వం రోడ్లు, కాలువలు నిర్మించి కరెంటు కూడా ఇచ్చింది. మఠం భూములనే పేరుతో నిషేధిత జాబితాలో పెట్టారు. దాంతో రిజిస్ట్రేషన్లు జరగడం లేదు. నిషేధిత జాబితా నుంచీ ఆ భూములను తొలగించి క్రమబద్ధీకరిస్తే ప్రభుత్వానికి రూ. 400 కోట్ల వరకూ ఆదాయం వస్తుంది. కావాలంటే మఠానికి ప్రత్యామ్నాయ భూములిస్తాం' అని ఎమ్మెల్యే పులివర్తి నానీ సూచించారు.

నైపుణ్య శిక్షణలో ఎస్వీయూ సహకారం

'యువతకు నైపుణ్య శిక్షణ ఇవ్వడానికి ఎస్వీయూ సహకరిస్తుంది. ఇప్పటికే డ్రోన్ అండ్ స్పేస్ టెక్నాలజీ అంశంలో ఎంవోయూ కుదుర్చుకున్నాం. తిరుపతి, పరిసర ప్రాంతాల్లో డ్రోన్ వినియోగంపై శిక్షణ, ఆపరేషన్, రిపేర్లు వంటివి చేపడతాం. ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ విద్యార్థులకు శిక్షణ ఇస్తాం' అని వీసీ అప్పారావు పేర్కొన్నారు.

మహిళాభివృద్ధికి తోడ్పాటు

'మహిళలకు ఉన్నత విద్య, నైపుణ్య శిక్షణకు పద్మావతీ వర్సిటీ తోడ్పడుతుంది. ఏఐ, ఫ్యాషన్ టెక్నాలజీ తదితరాలపై దృష్టి పెడుతున్నాం. ఇప్పటికే 47 స్టార్టప్‌లు వున్నాయి. మహిళా బయోటెక్ పార్కు వుంది. తిరుపతిలో రెండు మురికివాడలు కేటాయిస్తే విద్యార్థులను పంపి పరిస్థితులు మెరుగుపరిచేందుకు ప్రయత్నిస్తాం. ఇంటర్న్‌షిప్స్ నిర్వహిస్తాం. పూర్వ విద్యార్థులను పీ4లో భాగస్వాముల్ని చేస్తాం' అని వీసీ ఉమా తెలిపారు.

విద్యార్థులు.. ఉపాధ్యాయులు 100శాతం హాజరు

- **రాష్ట్రంలో జిల్లా విద్యాశాఖ రికార్డ్**



100 శాతం హాజరు పోస్టర్లను ప్రదర్శిస్తున్న డీఈవో

తిరుపతి(విద్య), జూలై 7(ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖ రాష్ట్ర స్థాయిలో అరుదైన రికార్డ్‌ను సాధించింది. అన్ని పాఠశాలల్లో నమోదైన విద్యార్థులు, అన్ని పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు సోమవారం వందశాతం పాఠశాలలకు హాజరయ్యారని డీఈవో కేవీఎన్ కుమార్ వెల్లడించారు. పాఠశాలలు ప్రారంభమైన కొద్దిరోజుల్లోనే... ఈ అరుదైన రికార్డును సాధించడంపట్ల ఆయన ఆనందం వ్యక్తం చేశారు. 100 శాతం హాజరు నమోదు చేయాలంటూ పాఠశాల విద్యాశాఖ కమిషనర్ విజయ రామరాజు, రీజనల్ జాయింట్ డైరెక్టర్ శామ్యూల్ నిత్యం వీడియో కాన్ఫరెన్స్‌ద్వారా మార్గనిర్దేశం చేస్తూ వచ్చారని... ఆమేరకు రాష్ట్రంలో జిల్లా ఆ ఘనతను సాధించందన్నారు. ఉన్నతాధికారులు డీఈఓ ఇతర అధికారులను అభినందించారు. 100 శాతం హాజరుకు కృషి చేసిన అధికారులు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులకు డీఈవో కుమార్, సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.గౌరీశంకర్‌రావు, ఫషియల్ అటెండెన్స్ నోడల్ అధికారి జి.సురేష్ అభినందనలు తెలియజేశారు.

భరతనాట్యంలో వరల్డ్ రికార్డు


వరల్డ్‌రికార్డు సర్టిఫికెట్లు చూపుతున్న బాలికలు

తిరుపతి అర్బన్, జూలై 7(ఆంధ్రజ్యోతి): నటరాజ నర్తన ఆకారంలో 27.32 నిమిషాల పాటు భరతనాట్యంతో తిరుపతికి చెందిన బాలికలు వరల్డ్ రికార్డును కైవసం చేసుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తమిళనాడు సేలంలోని కైలాస మానససరోవరం స్కూల్‌గ్రౌండ్‌లో ఇంటర్ నేషనల్ టైమ్స్ అండ్ వరల్డ్ రికార్డు సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం భరతనాట్యంలో 'నటరాజ నర్తనం' ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి వివిధ రాష్ట్రాల నుంచి సుమారు 2వేల మంది బాల కళాకారులు ప్రాతినిథ్యం వహించారు. అందులో తిరుపతి నుంచి సింహల లేక్షణ సాయి, కందుల హవిష, బి.ప్రశ్వితశ్రీ, సి.కేతన పాల్గొని నటరాజనర్తన ఆకారంలో 27.32నిమిషాలు నృత్యం చేసి అహూతులను అబ్బురపరిచారు. తమిళ సినీనటి, క్లాసికల్ డ్యాన్సర్ ప్రియదర్శిని చేతుల మీదుగా నలుగురు బాలికలు ప్రశంసపత్రాలు, బహుమతులు అందుకున్నారు.

ఆగస్టు 7న గోవాలో జాతీయ ఓబీసీ మహాసభ

తిరుపతి అర్బన్, జూలై 7(ఆంధ్రజ్యోతి): గోవాలోని శ్యాంప్రసాద్ ముఖర్జీ ఇండోర్ స్టేడియంలో వచ్చేనెల ఏడో తేదీన జాతీయ ఓబీసీ మహాసభను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ, రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాస్‌గౌడ్, కేశన శంకరరావు తెలిపారు. తిరుపతిలోని పద్మావతి గెస్ట్‌హౌస్‌లో సోమవారం వారు మీడియాతో మాట్లాడారు. దేశవ్యాప్తంగా బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించడానికి, బీసీ డిమాండ్ల సాధన కోసం, భవిష్యత్తు కార్యచరణను రూపొందిస్తామన్నారు. ఈనెల 21నుంచి జరగనున్న పార్లమెంట్ సమావేశాలలో ఈ బిల్లుపై చర్చించి చట్టసభలలో బీసీలకు 50శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. 2026లోనే కులగణన పూర్తిచేసి జనాభా దామాషా ప్రకారం బీసీ రిజర్వేషన్లు పెంచాలని కోరారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లతో విద్య, ఉద్యోగాలలో బీసీలకు తీరని అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిని సరిదిద్దే బాధ్యత ప్రభుత్వాలు తీసుకోవాలన్నారు. సభకు ప్రధాని మోదీ, మంత్రులు, రాష్ట్ర ముఖ్యమంత్రులు, అఖిలపక్ష పార్టీల అధ్యక్షులు, జాతీయస్థాయి నేతలను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. జాతీయ ప్రధాన కార్యదర్శి కుమ్మరి క్రాంతికుమార్‌యాదవ్ మాట్లాడుతూ జనాభా దామాషా ప్రకారం వాటా కోసం పోరాటానికి బీసీలందరూ ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొబ్బినేని రఘుపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి సోమశేఖరాచారి తదితరులు పాల్గొన్నారు.

కాలువ పూడికతీతకు చర్యలు



పూడికతీత పనులను ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

చిల్లకూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామారెడ్డిపాళెం గ్రామ సమీపంలో ఉన్న బల్లవోలు డ్రైనేజీ పథకానికి సంబంధించి కాలువ పూడికతీత పూడికతీత పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ వర్షాల సమయంలో వరదనీరు వెళ్లపాళెం, బల్లవోలు, చింతవరం, రామారెడ్డిపాళెం, పల్లమాల తదితర గ్రామాల్లోని పొల్లాలోకి చేరి సకాలంలో వరినాట్లు వేయలేక అవస్థలు పడుతున్నామన్నారు. కాలువల్లో పూడిక తీయడం వల్ల వరదనీరు కాలువ ద్వారా సముద్రంలోకి చేరుతుందన్నారు. దీంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో వరినాట్లు వేసుకునే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో దువ్వూరు వినయ్‌కుమార్‌రెడ్డి, రావుల వెంకటేశ్వర్లు, పూడిపర్తి ప్రవీణ్‌కుమార్, అన్నం మునిశేఖర్‌గౌడ్, చెరుకూరు పద్మజ, లక్ష్మీనరసింహం పాల్గొన్నారు.

ప్రజల సమస్యల పరిష్కారానికే మహాసభలు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి

చిల్లకూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకే మహాసభ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి అన్నారు. సోమవారం మండలంలోని నెలబల్లిరెట్టపల్లిలో సీపీఐ ఆధ్వర్యంలో ద్వితీయ మహాసభ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మహసభలు నిర్వహించి ప్రజల నుంచి సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు సీపీఐ కృషి చేస్తుందన్నారు. నక్కలవారి కండ్రిగలోని ప్రభుత్వ భూములను పేదలకు ఇవ్వాలన్నారు. ప్రభాకర్, చిన్న పెంచలయ్య, సీవీఆర్ కుమార్, నారాయణ, రమేష్‌బాబు, రాఘవయ్య, మస్తానయ్య, ముత్యాలయ్య తదితరులు పాల్గొన్నారు.

గురుపూర్ణిమ వేడుకలకు ముస్తాబవుతున్న సాయిబాబా ఆలయాలు



సాయిబాబా ఆలయంలో విగ్రహాలకు అలంకరణ

నాయుడుపేట, జూలై 7 (ఆంధ్రజ్యోతి): గురుపూర్ణిమ మహోత్సవాలకు నాయుడుపేటలోని బ్రాహ్మణవీధిలోని షిరిడీసాయిబాబా మందిరం, రాజగోపాలపురంలోని సాయిబాబా మందిరం సోమవారం ముస్తాబవుతున్నాయి. షిరిడీ సాయిబాబా ఆలయంలో మంగళవారం సాయిబాబాను విశేష పుష్పాలంకరణ, అన్నప్రసాదాలు, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు. బుధవారం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, చిన్నపిల్లలచే వివిధ రకాల సాంస్కృతిక నాటికలు, మిమిక్రీ, గురువారం గురుపూర్ణిమ సామూహిక శ్రీసాయి సహస్రనామ పూజలు, అభిషేకాలు, అర్చనలు, అన్నదానం, నటరాజ గ్రూపు ఆధ్వర్యంలో నాటక, నృత్య ప్రదర్శనలు, నగరోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త కోటూరు సాయిరాం ప్రసాద్ తెలిపారు.

ఉపాధి పనులు కల్పించకపోతే ఉద్యమిస్తాం



మండల పరిషత్ కార్యాలయం ఎదుట నినాదాలు చేస్తున్న చంద్రశేఖరపురం ఉపాది కూలీలు

కోట, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనులు సక్రమంగా కల్పించని కారణంగా పస్తులు ఉంటున్నామని, తక్షణం పని చూపకపోతే ఉద్యమిస్తామని చంద్రశేఖరపురం కూలీలు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం గూడలి పంచాయతీ పరిధిలోని చంద్రశేఖరపురం గ్రామానికి చెందిన నిరసన తెలిపారు. తమ గ్రామంలో ఉన్న కూలీలకు రెండు వారాలకోసారి పనులు కల్పిస్తున్నారని, అంతేకాకుండా గ్రామం నుంచి 7 కిలోమీటర్ల దూరంలో నడిచి వెళ్లి పనులు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీడీవో దిలీప్‌కుమార్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

సూళ్లూరుపేట, జూలై 7 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో ఎంఆర్పీఎస్ 31వ ఆవిర్భవ దినోత్సవాన్ని సోమవారం ఎమ్మార్పీఎస్ నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిక జన్మదిన వేడుకల్లో భాగంగా ఉచ్చూరు రఘు ఆధ్వర్యంలో పట్టణంలోని మహదేవయ్య నగర్, మండల పరిధిలోని మంగళంపాడు, ఇలుపూరు, దామానెల్లూరు గ్రామాల్లో జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా గ్రామాల్లో పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్పీఎస్ నాయకులు కయ్యూరపు మురళి, సాయి, చిలకల శ్రీనివాసులు, మాచారం చెంగమ్మ, సుబ్బు తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరి: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా జరుపుకొన్నారు. అలాగే మందా కృష్ణమాదిగ జన్మదినం సందర్భంగా పట్టణంలోని కాశీపేట సెంటర్‌లో ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. పల్లిపాటి రవి, మంగళంపూరి సురేష్, కంటిపల్లి మని, వెంకి, సుదా, శాతరాశి బాలయ్య, కోటి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

చిట్టమూరు: మండల పరిధిలోని చిన్న దరఖాస్తు గ్రామంలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం జరుపుకున్నారు. ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి కంటేపల్లి మస్తానయ్య ఆధ్వర్యంలో టీడీపీ, బీజేపీ నాయకులు రాజేష్ రెడ్డి, శరత్ చంద్రారెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని కేక్ కట్ చేశారు. అనంతరం ఈశ్వరవాక, కలుగుర్తిపాడు, ఎం జంగాళపల్లి గ్రామాల్లో ఎంఆర్పీఎస్ జెండా ఆవిష్కరించారు.

తిరుపతి రైల్వేస్టేషన్‌లో తనిఖీలు

తిరుపతి(సెంట్రల్), జూలై7(ఆంధ్రజ్యోతి): తిరుపతి రైల్వేస్టేషన్‌లో సోమవారం రైల్వే బోర్డు ప్రిన్సిపుల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శైలేంద్రసింగ్ తనిఖీలు నిర్వహించారు. స్టేషన్ ఆధునికీకరణలో భాగంగా చేపట్టిన నిర్మాణాలను పరిశీలించారు. పనుల్లో వేగం పెంచాలని ఆదేశించారు. ఆరు ప్లాట్‌ఫారాల్లో ప్రయాణికులకు కల్పిస్తున్న మౌలిక వసతులను పరిశీలించారు. విశ్రాంతి గదులు, టికెట్ కౌంటర్లు, పలు కార్యాలయాలను సందర్శించారు. ప్రిన్సిపుల్ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ మధుసూదనరావు, ఏడీఆర్ఎం యు.సుధాకర్, డిప్యూటీ సీఈ వామనమూర్తి, స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ, స్టేషన్ మేనేజరు డాక్టర్ కె.చిన్నపరెడ్డి ఆయన వెంట ఉన్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

బొగ్గులమిట్టలో తాగునీటి కొరత

వెంకటగిరి టౌన్, జూలై 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బొగ్గుల మిట్ట, ధర్మాపురం, నరసింహారవు వీధి తదితర ప్రాంతాల్లో తాగునీరు సరఫరా జరగకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని 14వ వార్డు కౌన్సిలర్ ఆరి శంకరయ్య అన్నారు. సోమవారం 14వ వార్డులోని పలు ప్రాంతాల్లో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. మూడు నెలల నుంచి తాగునీరు సరఫరా కావడం లేదన్నారు. వార్డులో 25 విద్యుత్ దీపాలు వెలగడం లేదని చెప్పారు. మున్సిపాలిటీ అధికారులు సమస్యలను పరిష్కరించాలని కోరారు.

వేనాడు దర్గా కిటకిట

తడ, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేనాడు దీవిలో ఉన్న దావూద్ షావల్లి అల్లాతాత దర్గా ఆదివారం నుంచి కిటకిటలాడుతోంది. నెల్లూరులో జరుగుతున్న రొట్టెల పండుగకు వచ్చే భక్తులు వేనాడు దర్గాకు వచ్చి బాబాను దర్శించుకోవడం అనవాయితీ. దీంతో దర్గా ప్రాగణం భక్తులతో కిటకిటలాడుతోంది. మరో మూడు రోజులపాటు దర్గాలో భక్తుల రద్దీ కొనసాగనుంది.

సంపద తయారీ కేంద్రాల పరిశీలన

బాలయపల్లి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పల్లిపాడు, మన్నూరు, అలిమిలి, నిండలి, కడగుంట పంచాయతీల్లో సోమవారం ఎంపీడీవో వినీల్‌కుమార్ పర్యటించారు. ఆయా పంచాయతీల్లో చేతిపంపుల పనితీరు, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పరిశీలించారు.



సూళ్లూరుపేటలో తాళం వేసివున్న గ్రంథాలయం - తడలో తలుపులు తెరుచుకోని లైబ్రరీ

గ్రంథాలయం ఎప్పుడు తెరుస్తారో?

సూళ్లూరుపేట లైబ్రరీ రెండు వారాలుగా మూత ● తడ, దొరవారిసత్రంలోనూ అదే పరిస్థితి

సూళ్లూరుపేట, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఎందరికో విజ్ఞాన్ని అందించిన సూళ్లూరుపేట గ్రంథాలయం నేడు తలుపులు తెరుచుకోవడం లేదు. నియోజకవర్గ కేంద్రంలో మున్సిపల్ కార్యాలయం వద్దనున్న గ్రంథాలయం 15 రోజులకు ఒకసారి కూడా తెరవడం లేదు. పనివేళల్లో పాఠకులు వచ్చి వార్తాపత్రికలు, వార, పక్ష, మాస పత్రికలతో పాటు ఇతర గ్రంథాలు, పోటీ పరీక్షల పుస్తకాలు చదువుకునేందుకు రోజుకు 150 మందికి పైగా పాఠకులు వస్తుంటారు. ఏటా వేసవిలో విద్యార్థుల కోసం నిర్వహించే ప్రత్యేక శిక్షణ శిబిరం కూడా ఈ సారి ఏర్పాటు చేయకపోవడం గమనార్హం. ఇక్కడ పనిచేసే గ్రంథాలయ అధికారి గతంలో వారంలో మూడు రోజులు ఇక్కడ, మరో మూడు రోజులు నెల్లూరులో విధులు నిర్వహించేవారు. సిబ్బంది కొరతతో వారంలో మూడు రోజులే సూళ్లూరుపేటలో గ్రంథాలయం తెరిచేవారు. అయితే జూన్ నెల నుంచి సక్రమంగా గ్రంథాలయం తెరవడం లేదని పాఠకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జూన్ నెల 24 నుంచి ఇప్పటి నేటి వరకు గ్రంథాలయం తలుపులు తెరవలేదని చెబుతున్నారు. ఇక తడ, దొరవారిసత్రంలో కూడా ఇదే పరిస్థితి. ఏ రోజు గ్రంథాలయాలు తలుపులు తెరుచుకుంటాయో పాఠకులకు తెలియని పరిస్థితి. ఉన్నతాధికారులు స్పందించి రెగ్యులర్ ఉద్యోగిని నియమించి రోజు గ్రంథాలయం తెరవాలని పాఠకులు కోరుతున్నారు.

సుపరిపాలనే ప్రభుత్వ ధ్యేయం: పాశిం



కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజలకు సుపరిపాలన అందించడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని మిటాత్మకూరు, ఈదలపల్లి గ్రామాల్లో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ఏడాది పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం అరాచకపాలన సాగించి రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అధోగతిపాలు చేసిందన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడంతో పాటు పేదలకు అనేక సంక్షేమ పథకాలను అందిస్తోందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు పింఛన్లను రూ.4వేలకు పెంచడంతో పాటు ఒకటో తేదీన లబ్ధిదారుల ఇంటి వద్దనే అందిస్తున్నామన్నారు. దీపం పథకం ద్వారా ఉచితంగా గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం అమలు పరచడం జరిగిందన్నారు. త్వరలోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి వంటి పథకాలను అమలు చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకువెళుతున్న ప్రభుత్వానికి ప్రజలందరూ అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో నెలబల్లి భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లురాజు, మట్టం శ్రావణి, శ్రీహరి, ఎల్లసిరి శ్రీనివాసులరెడ్డి, అమరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల విలీనంతో పేద విద్యార్థులకు విద్య దూరం



ఏవో రవికుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్నట్లు సీఐటీయూ, విద్యార్థి సంఘ నాయకులు

సూళ్లూరుపేట, జూలై 7 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల విలీనంతో పేద విద్యార్థులు చదువులకు దూరమవుతున్నారని ఎస్ఎఫ్ఐ నాయకులు అన్నారు. సోమవారం ఆర్డీవో కార్యాలయం వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థి సంఘ నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు ధర్నా చేశారు. సూళ్లూరుపేట, తడ, దొరవారిసత్రం మండలాల నుంచి 12 గ్రామాలకు చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు విచ్చేసి పాఠశాలల విలీన ప్రక్రియను ప్రభుత్వం వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి భగత్ రవి మాట్లాడుతూ విద్యా రంగానికి పెద్దపీట వేస్తున్న ప్రభుత్వం పాఠశాలల విలీనం చేయడం వల్ల చాలామంది విద్యార్థులు పాఠశాలలకు వెళ్లలేని పరిస్థితి నెలకొందని, ముఖ్యంగా గిరిజన సెంటర్లు, దళితవాడలకు చెందిన పేద విద్యార్థులు కిలో మీటర్ల దూరం వెళ్లలేని పరిస్థితిలో చదువుకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాశాఖ మంత్రి లోకేష్ పునరాలోచించి పాఠశాలలను యథావిధిగా కొనసాగించాలన్నారు. అనంతరం ఏవో రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘ నాయకులు నాగరాజు, సుమన్, సీఐటీయూ నాయకులు లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.


ఉపాధ్యాయులకు సన్మానం

చిల్లకూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పారిచెర్లవారిపాళెం గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సోమవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఎనిమిదేళ్ల పాటు విద్యార్థులకు ఉత్తమ బోధన అందించిన ఉపాధ్యాయులు చంద్ర, వీవీ కుమార్, మంజుశ్రీ, ఆదిలక్ష్మి, సురేంద్రను హెచ్ఎం అనసూయ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో మాధవయ్య, చంద్రశేఖర్, శ్రీనివాసులు, ప్రజేంద్రరెడ్డి, సుగుణ, లీల, కామేశ్వరి, మధుసూదన్‌రావు, విద్యుల్లత పాల్గొన్నారు.

గురువులకు దుస్తుల పంపిణీ

వాకాడు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న వీరబ్రహ్మేంద్రస్వామి అచెల పరిపూర్ణ ఆశ్రమంలో గురుపూర్ణిమ వేడుకల్లో భాగంగా ఆధ్యాత్మిక గురువులకు సీతారామ ధార్మికసేవాసంస్థ ఆధ్వర్యంలో సోమవారం దుస్తులు పంపిణీ చేశారు. ప్రవాస భారతీయులు వెంకటసాయికృష్ణ, పూర్ణచంద్రరావు, మీన, అముక్త కుటుంబసభ్యుల దాతృత్వంతో 20 మంది గురువులకు వస్త్రాలు అందజేసినట్లు సంస్థ నిర్వాహకులు దివి అనంతాచార్యులు తెలిపారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు సుభద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయండి



కరపత్రాలతో సీఐటీయూ నాయకులు

గూడూరు అర్బన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): లేబర్ కోడ్‌లను వ్యతిరేకిస్తూ ఈనెల 9వ తేదీన జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ పట్టణ ప్రధాన కార్యదర్శి బీవీ రమణయ్య అన్నారు. సోమవారం మండలంలోని నెల్లటూరు విద్యుత్‌శాఖ జిల్లా స్టోర్స్ హమాలీల సంఘం ఆధ్వర్యంలో కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రామయ్య, రమేష్, మస్తాన్, జనార్దన్, రాఘవరావు, గోవర్ధన్, సుబ్బయ్య పాల్గొన్నారు.

మహిళలకు టైలరింగ్‌పై శిక్షణ

చంద్రగిరి, జూలై 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ద్వారకానగర్ యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో ఈ నెల 10వ తేదీ నుంచి 31 రోజుల పాటు మహిళలకు టైలరింగ్‌పై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ సురేష్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెల్లరేషన్ కార్డు కలిగిన తిరుపతి, చిత్తూరు జిల్లాలోని గ్రామీణ ప్రాంతానికి చెందిన 19 నుంచి 40 సంవత్సరాల మధ్య నిరుద్యోగ మహిళలు అర్హులని పేర్కొన్నారు. పదో తరగతి చదివి ఉండాలని వెల్లడించారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆధార్, రేషన్ కార్డు జిరాక్స్ కాపీలు, 4 పాస్‌పోర్టు సైజు ఫొటోలతో దరఖాస్తు చేసుకోవాలని వివరించారు. మరిన్ని వివరాలకు 7989680587, 9494951289, 6301717672లను సంప్రదించాలని తెలిపారు.

పామాయిల్ సాగుపై మొగ్గు చూపండి

రామచంద్రాపురం: జూలై 7(ఆంధ్రజ్యోతి): పామాయిల్ సాగుపై రైతులు మొగ్గు చూపాలని త్రీఎఫ్ ఆయిల్‌పాం కంపెనీ ఉమ్మడి జిల్లా మేనేజరు వెంకట మురళి కోరారు. రావిళ్లవారిపల్లెలో సాగులో ఉన్న పామాయిల్ తోటలను ఆయన సిబ్బందితో కలిసి సోమవారం పరిశీలించారు. పామాయిల్ తోటలకు ప్రభుత్వం పూర్తిగా సబ్సిడీ ఇస్తోందన్నారు తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం వస్తుందన్నారు. సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు.

సైనికుల్లా పనిచేస్తాం



భాస్కర్‌రెడ్డిని సన్మాదిస్తున్న మోహన్‌రెడ్డి తదితరులు

కోట, జూలై 7 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఇప్పటి నుంచే టీడీపీ బలోపేతానికి కృషి చేసి సైనికుల్లా పనిచేస్తామని ఆ పార్టీ సీనియర్ నాయకుడు, పెన్నక్క చెరువు సాగునీటి సంఘం అధ్యక్షుడు నెల్లూరు మోహన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని కొక్కుపాడులో సోమవారం టీడీపీ మండల అధ్యక్షుడిగా ఎన్నికైన పలగాటి భాస్కర్‌రెడ్డిని మోహన్‌నాయుడు ఆధ్వర్యంలో పూలమాలలు, శాలువాలతో అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు హరిప్రసాద్‌రెడ్డి, మురళీరెడ్డి, రమేష్‌రెడ్డి, కిరణ్ కుమార్, సుధీర్‌రెడ్డి, చంద్రారెడ్డి, రాధాకృష్ణారెడ్డి, నారాయణరావు, ఎంపీటీసీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పర్యటనను విజయవంతం చేయండి

పెళ్లకూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ మంగళవారం పెళ్లకూరు మండలంలో పర్యటిస్తారని, కూటమి నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య కోరారు. మంగళవారం ఉదయం 8.30 గంటలకు తాళ్వాయిపాడు, 11.00 గంటలకు ఎగువ కానూరు, సాయంత్రం శిరసనంబేడే, చెక్‌పోస్టు గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటిస్తారని తెలిపారు.

పశుగ్రాసం వినియోగంతో అధిక లాభాలు

గూడూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): పాడిరైతుల పశుగ్రాసాన్ని దాణాగా వినియోగించడం ద్వారా అధిక లాభాలను పొందవచ్చునని పశుసంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ సురేష్ అన్నారు. పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక ప్రాంతీయ పశువైద్యశాలలో పాడిరైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏకవార్షిక ధాన్యపు జాతికి చెందిన మొక్కజొన్న, జొన్న, సజ్జ బహువార్షికాలైన ధాన్యపు జాతికి చెందిన పారాగడ్డి, సూపర్ నేపియర్ తదితర జాతులను సాగు చేసుకుని పశువులకు దాణాగా వినియోగించుకోవచ్చునన్నారు. దీంతో పాల ఉత్పత్తి పెరగడంతో ఖర్చులు తగ్గి పాడి రైతులకు లాభదాయకంగా మారుతుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కాంచన, బత్తిని శ్రీనివాసులు, గాయత్రి, పాడి రైతులు పాల్గొన్నారు.



పశుగ్రాసంపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సురేష్

మంగళ, గురువారాల్లో పలు రైళ్ల రద్దు

తడ, జూలై 7 (ఆంధ్రజ్యోతి): చెన్నై - గూడూరు మార్గంలో గుమ్మడిపూడి, పొన్నేరి మధ్య ఇంజనీరింగ్, సిగ్నల్ మార్పు, పట్టాల మార్పు పనులు జరుగుతున్న నేపథ్యంలో మంగళవారం(నేడు), గురు వారాల్లో ఉదయం 9:15నుంచి మధ్యాహ్నం 3:15 వరకు పలు రైళ్లు రద్దు చేస్తున్నట్లు సదరన్ రైల్వే డివిజన్ అధికారులు ప్రకటించారు.

రద్దైన రైళ్ల వివరాలు...

- సూళ్లూరుపేట నుంచి నెల్లూరుకు ఉదయం 8:10 నిమిషాలకు బయలుదేరి వెళ్లే రైలు నంబరు 66035
- నెల్లూరు నుంచి సూళ్లూరుపేటకు ఉదయం 10:40 నిమిషాలకు బయలుదేరి వచ్చే రైలు నంబరు 66036
- చెన్నైమోర్ మార్కెట్ కాంప్లెక్స్ నుంచి సూళ్లూరుపేటకు ఉదయం 5:40, 8:35, 10:15, మధ్యాహ్నం 12:10కు వచ్చే ఈఎంయూ లోకల్ రైళ్లు.
- సూళ్లూరుపేట నుంచి చెన్నై మోర్‌మార్కెట్ కాంప్లెక్స్‌కు ఉదయం 10:00గంటలు, 11:45, మధ్యాహ్నం 12:35, 1:15కు వచ్చే ఈఎంయూ లోకల్ రైళ్లు.
- చెన్నైమోర్‌మార్కెట్‌కాంప్లెక్స్ నుంచి గుమ్మిడిపూడికి ఉదయం 8:05, 9:00, 9:30, 9:40, 10:30, 11:35, మధ్యాహ్నం 12:40కు వచ్చే ఈఎంయూ లోకల్ రైళ్లు.
- గుమ్మిడిపూడి నుంచి చెన్నైమోర్‌మార్కెట్‌కాంప్లెక్స్ ఉదయం 9:10, 9:55, 10:55, 11:25, మధ్యాహ్నం 12:00, 1:00, 2:30కు వచ్చే ఈఎంయూ లోకల్ రైళ్లు.

అలాగే చెంగల్‌పట్టు, గుమ్మిడిపూడి, తాంబరం మధ్య నడిచే పలు లోకల్ రైళ్లు పాక్షికంగా రద్దు కాగా, పలు రైళ్లు చెన్నై, మీంజూరు మధ్య నడవనున్నాయి.

రొట్టెల పండుగతో రైళ్లన్నీ కిటకిట

తడ, జూలై 7 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులో ఆదివారం నుంచి రొట్టెల పండుగ అట్టహాసంగా నిర్వహిస్తున్నారు. ఐదు రోజులపాటు జరిగే ఈ పండుగకు వివిధ ప్రాంతాల నుంచి లక్షలాది మంది తరలివస్తుంటారు. ఈ క్రమంలో ఆదివారం నుంచి రైళ్లన్నీ భక్తులతో కిటకిటలాడుతున్నాయి. సోమవారం సైతం నెల్లూరు వైపు వెళ్లే రైళ్లన్నీ కిక్కిరిసిపోయి నడిచాయి. ఈ సమయంలో రైళ్ల రద్దు కారణంగా ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది.

స్వర్ణముఖిలోకి మిగులు జలాలు



గూడలి స్వర్ణముఖినదిలో చేరుతున్న మిగులు జలాలు

కోట, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గూడలి వద్ద స్వర్ణముఖినదిలోకి మూడు రోజులుగా మిగులు జలాలు వస్తున్నాయి. దీంతో ఆ జలాలను కొత్తమంది రైతులు పెన్నాక చెరువులోకి, కొత్తమంది రైతులు వాకాడు బ్యారేజీలోకి మళ్లించుకుంటున్నారు. నాయుడుపేట ఎగువ ప్రాంతం నుంచి గంగ కాలువల ద్వారా వచ్చేనీరు అనధికారికంగా కొన్ని గ్రామాల రైతులు మామిడి కాలువలోకి మళ్లించుకోగా ఆ కాలువ నుంచి మిగులు జలాలను గూడలి వద్ద మామిడి కాలువ, స్వర్ణముఖినది ద్వారా అటు పెన్నాక చెరువు, వాకాడు బ్యారేజీలోకి మళ్లించుకుంటున్నారు.

స్వర్ణమ్మకు జలకళ

వాకాడు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): స్వర్ణముఖినదిలో సోమవారం జలకళ సంతరించుకోవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత రెండు నెలలుగా స్వర్ణముఖినదిలో నీరులేక వెలవెలబోయింది. ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ చొరవతో వాకాడు, కోట, చిట్టమూరు మండలాల ప్రజల దాహార్తిని, రైతుల సాగునీటి అవసరాల కొరకు తెలుగుగంగ ప్రాజెక్టు అధికారులతో సంప్రదింపులు జరిపి ఆగస్టు 15వ తేదీ వరకు 150 క్యూసెక్కుల నీటిని విడుదల చేసేలా చర్యలు తీసుకున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో హాజరుశాతం పరిశీలన



మండల విద్యాశాఖ కార్యాలయంలో ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర విద్యాశాఖ నోడల్ బృందం

వాకాడు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు శాతాన్ని రాష్ట్ర విద్యాశాఖ నోడల్ బృందం అధికారి రమేష్ సోమవారం పరిశీలించారు. పాఠశాలల్లో విద్యార్థుల నమోదు, ఫేషియల్ రికగ్నైజేషన్, అటెండన్స్ యాప్, మధ్యాహ్న భోజన అమలు తీరుపై సమీక్షించారు. ప్రాథమిక స్థాయిలో మౌలిక, గణిత సామర్థ్య సాధన, ఉన్నత పాఠశాలలో అభ్యసన అభివృద్ధి కార్యక్రమం అమలు తీరును మండల విద్యాశాఖ అధికారి నసీం ఆలీని అడిగి తెలుసుకున్నారు.

మున్సిపల్ కార్మికుల నిరసన

వెంకటగిరి, జూలై 7(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ కార్మికుల వేతనాలు పెంచాలని, సమ్మె కాలం ఒప్పందాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు మున్సిపల్ కార్యాలయం వద్ద సోమవారం నిరసన తెలిపారు. మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు వడ్డిపల్లి చెంగయ్య మాట్లాడుతూ మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల వేతనాలు పెంచడంతో పాటు సమ్మె కాలం ఒప్పందాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.